
www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 20 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి ఫాల్గుణ శుద్ధ ఏకాదశి
10-16 మార్చి 2025
వెల : ₹20/-

# హైందవ ఐక్యతా మహాయజ్ఞం



జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.


77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# మహాకుంభమేళా చిత్రమాలిక











# జాగృతి చదువుదాం.. చదివిద్దాం..

ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

## రండి..
## జాతీయభావాల వేదిక జాగృతి చందాదారులుగా చేరుదాం.. చేర్పిద్దాం!




సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1474/-
https://payit.cc/S32796

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/-
+ మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ.624/-)

**విడి ప్రతి రూ.20/-**

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

వివరాలకు సంప్రదించండి సర్క్యులేషన్ మేనేజర్ : **040-2756 1453, 99599 97013**

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - **9959991304**

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**


– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

దేవమాన్యాలకు ఒక పరమార్థం ఉంది. దైవ దర్శనానికి వచ్చే భక్తులకు, వారి భోజనవసతి వంటి వాటికి, హిందూ బాలబాలికల విద్యావ్యాప్తికి అవి ఉపయోగపడాలి. ఇంకా, ఆలయ వ్యవస్థలతో తరతరాలుగా అనుబంధం కలిగిన కుటుంబాలను ఆదుకోవాలి. శిల్పులు, కళాకారుల కడుపు నింపాలి. దశాబ్దాల నాడో, శతాబ్దాల నాడో ఆలయాలకు భూములు ఇచ్చిన వారి, ఇతర దానాలు చేసిన వారి అంతరంగం ముమ్మాటికీ అదే. కానీ బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలకు డబ్బులు లేవు కాబట్టి, దేవాలయాలు (హిందూ దేవాలయాలు మాత్రమే) ధన సహాయం చేయాలని ప్రభుత్వాలు కోరడంలో ఔచిత్యం ఏమిటి? ఈ పనే నిస్సిగ్గుగా చేసింది హిమాచల్‌ప్రదేశ్‌లో కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం. ఒక పక్కన హిందూ దేవాలయాల మీద ప్రభుత్వాల పెత్తనం కూలాలని విశ్వహిందూ పరిషత్ దేశవ్యాప్త ఉద్యమానికి సమాయత్తమవుతుంటే ఇలాంటి పితలాటకం తేవడం కాంగ్రెస్‌కే చెల్లింది. మెజారిటీ హిందువుల పట్ల ఆ పార్టీకి ఉన్న గౌరవం ఎంతటిదో ఇదే చెబుతోంది. సుఖ్విందర్ సింగ్ సుకు నాయకత్వంలో డిసెంబర్ 2022న హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఫిబ్రవరి 28, 2023న సెప్టెంబర్ 3, 2024న ఆ పథకాలను ప్రకటించారాయన. వీటి ఉద్దేశం మంచిదే. 6000 మంది అనాథ బాలబాలికలకు ఆశ్రయం, విద్య, సంక్షేమం కోసం వాటిని ప్రవేశపెట్టారు. వీటి కోసం 2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో రూ.272.27 కోట్లు కేటాయించినా మళ్లీ ఆలయాల నుంచి నిధులు కోరడమే వింత.

జనవరి 29న సామాజిక న్యాయం, సాధికారత శాఖ పేరుతో ఇచ్చిన పత్రికా ప్రకటన ఉద్దేశం ఆలయాలు వాటి నిధులు సర్కారు ఖజానాలో కుమ్మరించాలనే. ఆ రెండు పథకాలని బతికించడం కోసం గుడులు విరాళాలు ఇవ్వాలట. నిజం చెప్పాలంటే నిధుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గుడులకు మెత్తగా హుకుం జారీ చేసింది. ప్రభుత్వ దేవాదాయా ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల నుంచి మాత్రమే విరాళాలు కోరుతున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొని, కాస్త మసి కూడా పూశారు. ఎలా అంటే, సర్కారు వారి కొన్ని కార్యకలాపాలకు నిధులు ఇవ్వడం మన ఆలయ ధర్మకర్తల మండళ్లుకు రివాజే సుమా అంటూ ఆ ప్రకటన ముక్తాయించింది. ఇందులో

**శాలివాహన 1946 శ్రీ క్రోధి ఫాల్గుణ శద్ధ ఏకాదశి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం

**హైందవ ఐక్యతా మహాయజ్ఞం**

17

ధారావాహిక నవల

**తూర్పు-పడమర**

– గన్నవరపు నరసింహమూర్తి

20లో

ప్రత్యేక వ్యాసం

**వసంతాల కేళీ... హోలీ**

26లో





# జాగృతి

## సంపాదకీయం

మతలబేమిటో సులభంగానే తెలుస్తుంది. కాంగ్రెస్‌, దాని మిత్రపక్షాలు ఎక్కడ అధికారంలో ఉన్నా, దేవస్థానాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారుస్తాయి. అందుకే హిమాచల్‌ సర్కారు అంత ధీమాగా నిధులు కోరింది. గుడులను గుల్ల చేయాలని చూస్తోంది.

హిమాచల్‌ దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో 36 పెద్ద ఆలయాలు ఉన్నాయి. వీటికి రూ. 400 కోట్ల మేరకు డిపాజిట్లు ఉన్నాయని అంచనా. జఖు, జ్వాలాజీ, చాముండ, చింత్‌పూర్ణి, నైనాదేవి, బజరేశ్వరి, బైజనాథ్‌, లక్ష్మీనారాయణ ధర్మకర్తల మండళ్లు వాటిలో ముఖ్యమైనవి. చిత్రం ఏమిటంటే

# గుడిపై హిమాచల్‌ సర్కారు దాడి

ప్రభుత్వం అడిగింది కాబట్టి, ఆలస్యం తగదన్న తీరులో జఖు, తారాదేవి (సిమ్లా) ధర్మకర్తల మండళ్లతో పాటు ఇంకొన్ని కూడా ఇప్పటికే దేవుడి నిధులు ప్రభుత్వానికి అర్పించే మార్గాల గురించి చర్చించడం కూడా పూర్తి చేశాయని జాతీయ మీడియా ఘోషిస్తున్నది. కాబట్టే, కాంగ్రెస్‌ ప్రభుత్వం నిధుల కోసం గుడులను దేబిరించడం లేదు, ఘరానాగా దోచేస్తున్నది అని ప్రతిపక్ష బీజేపీ ఘాటు విమర్శలకు దిగింది.

రాష్ట్ర చరిత్రలో ఇంతవరకు ఏ ప్రభుత్వం ఇలా ధర్మకర్తల మండళ్ల నుంచి నిధులు గుంజాలని చూడలేదని, ఇది పూర్తిగా అసంబద్ధమని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు జైరామ్‌ ఠాకూర్‌ విమర్శించారు. ముఖ్యమంత్రి సుఖు, ఆయన పార్టీ కాంగ్రెస్‌ తెల్లవారి లేస్తే సనాతన ధర్మాన్ని దూషిస్తూ ఉంటారని, కానీ హిందూ దేవాలయాల నిధులు మాత్రం కావాలని విమర్శించారు. ఇలా నిధుల కోసం అభ్యర్థిస్తున్నట్టు నటిస్తూనే, ఆలయాల అధికారుల మీద ఒత్తిడి తెస్తున్నారని ఆయన అసలు గుట్టు బయటపెట్టారు. రెండేళ్లుగా ఈ పథకాల గురించి రాష్ట్రంలో అంగుళం కూడా మిగల్చకుండా అడ్వర్‌టైజ్‌మెంట్లు పెట్టి కోట్ల రూపాయలు వెచ్చించారనీ, ఫలితంగా లబ్ధిదారులకు లేదా బాధితులకు సున్నా మిగిలిందనీ ఆయన చెబుతున్నారు. బడ్జెట్‌లో ఆ పథకాల కోసం నిధులు కేటాయించడం నిజమే అయితే ఇలా దేవాలయాల మీద దండెత్తడం ఎందుకు అన్నదే ఆయన ప్రశ్న. ఇంతవరకు సుఖ్‌ శిక్షా పథకం మీద నిధుల కోసం ఖర్చు చేసినది రూ. 1.38 కోట్లు మాత్రమేననీ, సుఖ్‌ ఆశ్రయ పథకం మీద ఆ మాత్రం కూడా వెచ్చించలేదని ఆయన చెప్పారు. ఆలయాల నుంచి నిధులు సేకరణ నిర్ణయాన్ని బీజేపీ వ్యతిరేకిస్తున్నదని ఠాకూర్‌ స్పష్టం చేశారు. ఇందుకు హిమాచల్‌ ప్రదేశ్‌ ప్రభుత్వం తలాతోకా లేని వివరణ ఇచ్చింది. తాము దేవాలయాలనే కాకుండా, సాధారణ ప్రజల నుంచి విరాళాలు కోరుతున్నామని రాష్ట్ర కాంగ్రెస్‌ అధ్యక్షురాలు ప్రతిభా సింగ్‌ చెప్పారు. తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం, చిన్నారుల కోసం, మహిళల కోసం కార్యక్రమాలు చేపట్టి అందుకు నిధులు సేకరిస్తున్నదని ఆమె చెప్పారు. అంతవరకు సరే! సంక్షేమ పథకాలకు ఒక్క దేవాలయాల నుంచే ఎందుకు డబ్బులు లాగుతున్నారన్నదే ప్రశ్న. అతి పెద్ద భూస్వామిగా అవతరిస్తున్న వక్ఫ్‌బోర్డునీ, విదేశీ నిధులతో కోట్లకు పడగలెత్తిన చర్చిలని ప్రభుత్వం ఎందుకు విరాళాలు కోరడం లేదు? ఈ యాచనకు కారణం కాంగ్రెస్‌ ప్రభుత్వం అడ్డగోలుగా ఇస్తున్న ఉచితాలేనని విశ్లేషకులు చెబుతున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా అడ్డమైన ఉచితాలు ప్రకటించి కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చింది.

నిన్న కర్ణాటక కాంగ్రెస్‌ ప్రభుత్వం గుడుల మీద కప్పం విధించి భంగపడింది. ఇప్పుడు అదే దుశ్చర్యకు హిమాచల్‌ కాంగ్రెస్‌ ప్రభుత్వం ఒడిగడుతోంది. ఎన్ని విమర్శలు వస్తున్నా, ఎన్నెన్ని రుజువులు కనిపిస్తున్నా కాంగ్రెస్‌ తన హిందూ ద్వేషాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. దీనికి ఎక్కడో ఒకచోట అడ్డుకట్ట వేయవద్దా మరి! ★

10 మార్చి 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్‌




38లో

కథ

ధీర

- జి.వి.హేమలత శర్మ




ధరహాసం


| | | |
|---|---|---|
| కేంద్రం సాయంతోనే అమరావతి ఓఆర్‌ఆర్‌ (ఆంధ్రప్రదేశ్‌) | - | 16 |
| కన్జర్వేటర్లకే జర్మన్‌ ఓటర్ల మద్దతు! (అంతర్జాతీయం) | - | 22 |
| పదవి సతిది.. పరపతి పతిది..! (వాస్తవం) | - | 24 |
| సీపీఎం ఏలుబడిలో 'ఆశ' తీరేదెప్పుడు? (నిరాశ) | - | 28 |
| విపక్షాల విచ్ఛిన్నకర రాజకీయాలు (జాతీయం) | - | 30 |
| కులగణన సర్వేలో ఘోర వైఫల్యం (తెలంగాణ) | - | 32 |
| ఆ అమాత్యులకు చేతినిండా పని (జాతీయం-1) | - | 44 |
| బాలజాగృతి | - | 46 |
| మహిళా క్రికెటర్లా! మజాకానా! (క్రీడ) | - | 43 |
| కమ్యూనిస్టుల కంటిలో నలుసు 'ఛావా'! (సినిమా) | - | 50 |

# హైందవ



మహా కుంభమేళా ముగిసింది. ప్రపంచ చరిత్రలో ప్రయాగరాజ్ కొత్త పుటను తెరిచింది. నలభయ్ అయిదు రోజులలో ఒకే భావనతో, ఒక ధర్మానికి వారసులమని ప్రగాఢంగా నమ్ముతూ, తాదాత్మ్యంతో జనసంద్రాలు ఏకత్రితమైన పుణ్యస్థలిగా మేళాను నిఖిల ప్రపంచం గుర్తించక తప్పలేదు. ఒక కోటి మంది కాదు, పది కోట్లు కాదు, 66 కోట్లమందికి పైగా త్రివేణీ తీర్థంలో స్నానాలు చేశారు. జాతీయ భావన, ఆధ్యాత్మిక చింతన అనే తీరాలను ఒరుసుకుంటూ వెళ్లిన వారసత్వ ప్రవాహంలో స్నానమాచరించి జాతి పునీత అయిందనే అందరి విశ్వాసం. సగం భారతదేశం సంగమానికి విచ్చేసిందన్నమాటే. ఈ కుంభమేళా హిందువుల మహా విజయం. ఆత్మ విస్మృతి అనే కశ్మలాన్ని త్రివేణి వదిలించిందనే ఎక్కువ మంది నమ్మకం. అయినా ఇతర మతస్థులూ నిర్మలమైన హృదయాలతో భాగమయ్యారు. భారత్‌లోని ప్రతి రాష్ట్రం నుంచే కాదు, 76 దేశాల నుంచి వచ్చిన అనేక జీవన విధానాల వారు, విశ్వాసాల వారు సంగమంలో స్నానించారు. సరిగ్గా సంవత్సరం క్రితమే అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ ఘట్టాన్ని చూసి విస్తుపోయిన విశ్వం; ఇప్పుడు ప్రయాగరాజ్‌ను చూసి ఆధ్యాత్మిక వారసత్వం పట్ల హిందువులు ప్రదర్శించిన దృఢబంధాన్ని చూసి, ధర్మం పట్ల చూపిన నిబద్ధతను పరికించి వినయంగా ప్రణమిల్లుతున్నది. హిందూ వ్యతిరేకులు ప్రపంచానికి చూపించిన కులమతాల భారత్ అక్కడ కనిపించకపోవడం వారికి మరీ విచిత్రం. ఇందరు



# ఐక్యతా మహాయజ్ఞం

హిందువులు ఒకచోట చేరినా, ధర్మం ఇచ్చిన గాఢమైన భక్తితో పోటెత్తినా.. ఒక్క ముస్లిం మీద, ఒక్క క్రైస్తవుడి మీద అయినా దాడి జరిగిన జాడే లేకపోవడం, చర్చ్ మీదనో, మసీదు మీదనో ఓ రాయి పడిన వైనం నమోదు కాకపోవడం మరీ మరీ చిత్రం ప్రపంచానికి. అదే సమయంలో కొందరికి నిరాశ కూడా. అందుకే మహాకుంభ్ చాలామందిని భారతీయత పట్ల ఉన్న వ్యతిరేకత నుంచి విముక్తం చేసి ఉండాలి. కళ్లు తెరిపించి ఉండాలి.

అయినా... త్రివేణీ సంగమంలో మహాకుంభ్ స్నానం అంటే మూడు మునకలు కాదు. ఒక పురాతన ఆచారంతో, శతాబ్దాల నాటి సంప్రదాయంతో, భారతీయ ఆధ్యాత్మిక పరంపరతో మమేకమవుతూ ఆత్మ క్షాళనం కావాలని శిరస్సు వంచి సంగమాన్ని వేడుకోవడం. పురిశెడు జలంతో ఆచమనం చేయడమే కాదు, పునరుజ్జీవనోద్యమం అవసరాన్ని గుర్తించి, ఆ ఉద్యమంతో కలసి సాగడం. అర్ఘ్యంలో సూర్య భగవానుడినే కాదు, విశ్వగురు స్థానంలో నిలబడవలసిన ఆర్యావర్తాన్ని కూడా దర్శించుకోవడం. భారతీయ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని, అందులోని పరంపరను త్రివేణీ అలలు భక్తుడి ఆత్మకు చేర్చి, దానిని క్షాళన చేసిన క్షణమది. ప్రయాగలో అదే ప్రతిబింబించింది. ఆ లిప్తలలో భౌతిక ప్రపంచానికి అతీతమైన అనుభూతి ఏదో తమను ఆలింగనం చేసుకున్నదని లక్షలాది మంది స్నాతలు చెప్పడం ఇందుకే. ఇలాంటి అనుభూతిని శాశ్వతం చేసుకోవాలని ఆకాంక్షించిన వారే అక్కడ ఎక్కువ. కోకొల్లలుగా దర్శనమిచ్చిన నాగసాధువుల కోలాహలం అందుకు సంబంధించినదే. యజ్ఞకుండం నుంచి ఎగసిన జ్వాలను మరిపిస్తూ ఆ తీరాన్ని చుట్టిన కాషాయవాహిని అంతరంగం కూడా అదే. వారందరి ఉనికి మహాకుంభ్ వేడుకకే ఒక మార్మికతను అద్దింది. భక్తుల భగవన్నామ స్మరణ, శంఖారావాలు, ఘంటారావాలు, అగరవత్తుల గుబాళింపు, హారతి కర్పూరం సువాసనలు, సాధుసంతుల మంత్రోచ్చారణలు, భజనలు, పీఠాధిపతుల ధ్యానం ఆ గాలిని ఒక ఆధ్యాత్మిక భావ తరంగంలా మలిచాయి. ఆ సంగమ తీరానికి ఎవరు వెళ్లినా ఆ ఆధ్యాత్మిక పరిమళంలో భాగమైపోయారు. ఆత్మ విస్మృతితో కోల్పోయిన ఏకత్వభావననీ, ఏకాత్మతా దృష్టినీ ప్రతివారి ఉచ్ఛ్వాసనిశ్వాసాలలో వినేటట్టు చేసింది ఆ క్షణం. మహాకుంభ్ కేవలం మత కార్యక్రమం కాదు. అదొక ఆధ్యాత్మిక యానం. అందుకే జీవితమంతా గుర్తుంచుకునే ఒక అనుభూతిని ప్రసాదించి ప్రతి యాత్రికుడిని తిప్పి పంపింది.



మహాకుంభమేళా సరికొత్త ఆధ్యాత్మిక శిఖరాలకు చేరుకోవడంతో సరిపుచ్చుకోకుండా అంగరంగ వైభవంలో, దివ్యత్వంలో ప్రపంచానికి ఓ ప్రామాణికతను స్థిరపరిచింది. ఈ 45 రోజుల ఆధ్యాత్మిక జాతర అనూహ్యమైన రీతిలో గుమిగూడిన జన సందోహానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. 66 కోట్ల మందికిపైగా భక్తులు పవిత్ర త్రివేణి సంగమంలో స్నానం చేయడంతో చరితార్థులైనారు. తమ పేర్లను భారత్ ఆధ్యాత్మిక చరిత్రలో లిఖించుకున్నారు.

ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రం అండదండ లతో యోగి ప్రభుత్వం అదే పనిగా చేసిన కృషితో ప్రయాగరాజ్ చెప్పుకోదగిన రీతిలో రూపాంతరం చెందింది. మహాకుంభమేళా మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఓ వైభవాన్ని, దివ్యత్వాన్ని సంతరించు కుంది. మరీ ముఖ్యంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కలిసికట్టుగా మహాకుంభమేళాకు చేసిన ఏర్పాట్లు భువిపై దివ్యలోకాన్ని నిలిపాయి.

మహాకుంభమేళాలో 66 కోట్ల మందికిపైగా పాల్గొనడం ఓ చరిత్రాత్మకమైన మైలురాయి. మరే ఇతర వేడుక కూడా ఇంత భారీ సంఖ్యలో భక్తులు ఓ చోట గుమిగూడటాన్ని ఇప్పటిదాకా చూసింది లేదు. 66 కోట్లు అనే ఈ అంకె భారత్ జనాభాలో 50 శాతాన్ని దాటిపోయింది. ప్రపంచంలో అనేక దేశాల జనాభాను మించిపోయింది.

మొత్తం 13 అఖాడాల ప్రతినిధులు వారి వారి సంప్రదాయాలకు లోబడి మహాకుంభమేళాలో పాల్గొన్నారు. అమృతస్నానం చేయాల్సి వచ్చిన మూడు సందర్భాల్లోనూ ఆ క్రతువును నిర్విఘ్నంగా సంపూర్ణం చేశారు. మిగిలిన అఖాడాలు జునా అఖాడాకు అనుబంధితమైన కిన్నర్ అఖాడాతో చేరడం ఈ సారి కుంభమేళాలో ఓ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ అఖాడాలు కొత్తగా సాధువులను చేర్చుకునే కార్యక్రమాన్ని, మహామండలేశ్వర్ లాంటి కీలకమైన పదవుల్లో నియామకాలను విజయ వంతంగా పూర్తి చేశాయి.

**6 వేడుకలు.. కోట్లలో స్నానాలు..!**

45 రోజుల వేడుకలో భక్తుల సంఖ్య రోజులు గడుస్తున్న కొద్దీ పెరిగిందే తప్ప ఏ మాత్రం తగ్గకపోవడం విశేషం. భక్తులు స్నానం చేసేందుకు కీలకమైన ఆరు పర్వదినాల్లో వారి సంఖ్య కోట్లలో నమోదైంది. పర్వదినాల్లో మొదటిదైన జనవరి 13న పుష్య పూర్ణిమ నాడు 1.7 కోట్ల మంది భక్తులు మహాకుంభమేళాకు వచ్చారు. ఆ తర్వాత జనవరి 14న మకర సంక్రాంతి నాడు 3.5 కోట్ల మంది భక్తులు, జనవరి 29న మౌని అమావాస్య నాడు 7.64 కోట్లు, ఫిబ్రవరి 3న వసంత పంచమి నాడు 2.57 కోట్లు, ఫిబ్రవరి 12న మాఘ పూర్ణిమ నాడు 2.04 కోట్లు, ఫిబ్రవరి 26న మహాశివరాత్రి పర్వదినాన 1.53 కోట్ల మంది భక్తులు త్రివేణి సంగమంలో స్నానం చేశారు. ఫిబ్రవరి 15 నుంచి



26 తేదీల మధ్య కాలంలో ఏ ఒక్క రోజూ కూడా భక్తుల సంఖ్య ఒక కోటికి తగ్గకపోవడం గమనార్హం.

**ముర్ము నుంచి రవీనా టాండన్ దాకా**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోమ్ మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, అనేక మంది కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ఆయా

# సనాతన ధర్మానికి కుంభ

ప్రపంచంలోని ధార్మిక సమ్మేళనాలలో అగ్రగణ్యం కుంభమేళ. సనాతన ధర్మంలో అతి పెద్ద వేడుక. ఐక్యతా,ఏకత్వాల సంరంభం. విఘాతాలు సృష్టించే ఎవరెన్ని యత్నాలు చేసినా, చేస్తున్నా కొనసాగుతూ వస్తున్న అతి ప్రాచీనం, చైతన్యవంతమైన ఆధ్యాత్మిక పర్వం. 'కుంభమేళా జరిగే ప్రాంతం మాదే' అనే కొన్ని శక్తుల రాగాలు, 'కుంభ్ మేళా కాదు.. మృత్యుమేళ' అనే వెటకారాలు, 'కుంభ మేళాలు, పవిత్ర స్నానాలు మూఢాచారం'లాంటి వ్యాఖ్యలు ప్రజల ఆధ్యాత్మిక భావన ముందు వెలవెలబోయాయి. దక్షిణ భారత దేశం చిట్టచివరి కొన నుంచీ వ్యయ ప్రయాసలకు ఓర్చి గంగాస్నానానికి వెళ్లడాన్నే బట్టే దీని విశిష్టత వెల్లడవుతోంది.

మధ్య యుగంలో మౌర్య, గుప్త రాజవంశాలు కుంభమేళాకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చాయని చరిత్ర చెబుతుండగా, శంకరభగవత్పాదుల ప్రచారంతో దీనికి మరింత ప్రాచుర్యం లభించి, అలాంటి మహనీయుల దివ్యాశీస్సులతో అప్రతిహతంగా కొనసాగుతోంది. ఆధునిక కాలంలో ప్రజా ప్రభుత్వాలు ఈ ఆధ్యాత్మిక తీర్థ సంప్రదాయాన్ని కొనసాగిస్తుండగా, ముఖ్యంగా– ఈ విషయంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ చొరవ గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన నిమిత్తం లేదు.

సృష్టికర్త సమస్త విశ్వాన్ని నీటి నుంచే సృష్టించాడట. ప్రాణులకు జలం మాతృసమానమే కాక జీవనాధారం. ఆ నీరు ప్రవహించే నదుల ద్వారానే నాగరిత వర్ధిల్లింది. నదీజలాల్లోని అమృతత్వం రోగాలను నివారించి శారీరక, ఆయుర్వృద్ధి కలుగచేస్తాయని ఆయుర్వేదంలో పేర్కొన్నారు. 'పవిత్రమైన నీటితో మాకు తృప్తి కలిగించు'అని విన్నవించడం మన సంప్రదాయంలో కనిపిస్తుంది. నదీ స్నానం, కుంభమేళాలో పవిత్ర స్నానం గురించి పురాణాలు ఎంతో కీర్తించాయి.ఆ సమయంలో నదీజలంలో నక్షత్రాల సంగం ఉండి, స్నానాలు ఆచరించిన వారికి చంద్రుడు తదితర గ్రహాల అనుగ్రహం లభిస్తుందని విశ్వాసం. అందుకే, అనారోగ్యాది కారణాలతో నదీస్నానాలకు వెళ్లలేనివారు, అక్కడి నుంచి తెప్పించుకున్న తీర్థాన్ని స్థానికంగా స్నానం చేసే నీటిలో కలుపుకొనే సంప్రదాయం కనిపిస్తుంది.

ప్రపంచంలోనే ఎక్కువ మంది యాత్రికులు, భక్తులు హాజరయ్యే ఆధ్యాత్మిక సందర్భం కుంభమేళ. ఒకనాడు చిన్న ఆధ్యాత్మిక కార్యక్రమంగా ప్రారంభమైన ఈ తీర్థం కాలవాహినిలో అత్యంత అతిపెద్ద ఉత్సవంగా పరిణమించింది. ముఖ్యంగా యువత దీనిని ఆసక్తిగా గమనించి, ఆధ్యాత్మిక గురువుల నుంచి అనేక అంశాలను తెలుసుకునే దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి.

కుంభమేళాలు, పుష్కరాలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకలు. ఇవి భారతీయులకూ, విదేశీయులకే కాదు... దేవతలకూ పరమ పావనమైనవిగా పెద్దలు చెబుతారు. ఈ సంరంభ సమయంలో పవిత్ర నదుల్లో స్నానం ముక్తి మార్గమని, కుంభమేళా పుణ్యస్నానంతో మనస్సు, ఆత్మశుద్ధి అవుతాయని భక్తుల విశ్వాసం. త్రివేణి సంగమంలోని మూడు భాగాలను అగ్నిస్వరూప యజ్ఞవేదికలుగా

అసెంబ్లీల స్పీకర్లు, ఆయా రాష్ట్రాల మంత్రులు త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానమాచరించారు. రాజకీయాలకు అతీతంగా సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో విపక్ష నేత మాతా ప్రసాద్ పాండే, హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్, ఇతర పేరొందిన రాజకీయ నేతలు దిగ్విజయ్ సింగ్, సచిన్ పైలట్, అభిషేక్ మను సింఘ్వీ, రాజీవ్ శుక్లా, ధర్మేంద్ర యాదవ్ తదితరులు మహాకుంభమేళాను సందర్శించినవారిలో ఉన్నారు.

హిందీ సినీ ప్రముఖులు అక్షయ్ కుమార్, విక్కీ కౌశల్, కత్రీనా కైఫ్, పంకజ్ త్రిపాఠీ, రాజ్‌కుమార్ రావు, ఈషా గుప్తా, రవీనా టాండన్, వివేక్ ఓబెరాయ్, అనుపమ్ ఖేర్, హేమామాలిని, రవికిషన్, తమన్నా భాటియా, సోనాలి బింద్రే, రెమో డిసౌజా, షాన్, కైలాష్ ఖేర్, శేఖర్ సుమన్, ఉదిత్ నారాయణ్, పారిశ్రామిక ప్రముఖులు ముకేష్ అంబానీ, అనిల్ అంబానీ, గౌతమ్ అదానీ, లక్ష్మి మిట్టల్, ఆనంద్ పిరమల్, అశోక్ హిందూజా, ఓలా వ్యవస్థాపకుడు భవేష్ అగర్వాల్, క్రీడా ప్రముఖులు సునీల్ గవాస్కర్, సురేష్ రైనా, ది గ్రేట్ ఖలీ, సైనా నెహ్వాల్, బైచుంగ్ భుటియా, అనిల్ కుంబ్లే, ఆర్పీ సింగ్, ఇశాంత్ శర్మ, తదితరులు త్రివేణి సంగమంలో స్నానం చేయడానికి తోడు సాధువుల ఆశీస్సులు అందుకున్నారు.

**త్రివేణీ తీరాన కేబినెట్ భేటీలు**


ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు మహాకుంభమేళా వద్ద మంత్రివర్గ సమావేశాలను నిర్వహించాయి. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తన కేబినెట్ సహచరులతో పవిత్ర స్నానమాచరించిన అనంతరం వారితో సమావేశానికి అధ్యక్షత వహించారు. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, ఆయన మంత్రిమండలి సభ్యులు కూడా అదే బాట పట్టారు. పలు ఇతర రాష్ట్రాలకు చెందిన సీఎంలు సైతం కేబినెట్ భేటీ కోసమని తమ మంత్రులను ప్రయాగ రాజ్‌కు తీసుకొచ్చారు.

**డిజిటల్ మహాకుంభ్ అద్భుతం**

మహాకుంభమేళాలో మరీ ముఖ్యంగా చెప్పుకోవాల్సింది డిజిటల్ మహాకుంభ్. ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడం కోసమని ఓ ప్రత్యేక వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను తొలిసారిగా కుంభమేళాలో ఆరంభించారు. నిర్వాహకులు మహాకుంభ్ నగర్ అంతటా నిరంతరాయంగా నావిగేషన్ కోసమని గూగుల్‌తో ఓ పరస్పర అవగాహన ఒప్పందం – ఎంవోయూ కుదుర్చుకున్నారు. డిజిటల్ ఖోయా–పాయా కేంద్ర తప్పిపోయిన వేలాది మందిని వారి కుటుంబాలతో తిరిగి కలపడం ద్వారా సమూహాల నిర్వహణలో ఓ చిరస్మరణీయమైన విజయాన్ని నమోదు చేసింది.

**4 వేల హెక్టార్లు.. రూ.7 వేల కోట్లు..!**

యోగి ప్రభుత్వం మహాకుంభమేళాను ఘనంగా నిర్వహించడంలో అంది వచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని జారవిడుచుకోలేదు. మహాకుంభ్ నగర్‌ను 4,000 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో 25 సెక్టార్లుగా ఏర్పాటు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా కొత్తగా 12 కి.మీ.ల మేర ఘాట్‌లు నిర్మించారు. వాహనాల పార్కింగ్ కోసమని 1,850 హెక్టార్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. ఇవే కాకుండా 31 పంటూన్ వంతెనలు, 67వేలకు పైగా వీధి దీపాలు,



# మేళ జోతలు

భావిస్తారు. ఆయా ప్రదేశాలలో భక్తిశ్రద్ధలతో స్నానమాచరించి, ఒక్కొక్క రాత్రి బస చేయడం వల్ల త్రేతాగ్నుల ఉపాసన ఫలం సిద్ధిస్తుందని నమ్మకం. ఈ సంగమంలో మునక వేసి, పునీతులు కావడానికి దేవతలు కూడా మానవ రూపంలో దిగివస్తారని పురాణగాథ.

ప్రజలలో జాతీయ,నైతిక, ఆధ్యాత్మిక భావనల వృద్ధికి కుంభపర్వం దోహదపడుతుందని విజ్ఞులు అంటారు. గంగానదిలో కార్తికంలో వెయ్యిసార్లు స్నానాలు, మాఘంలో వంద సార్లు స్నానాలు, నర్మదలో వైశాఖంలో కోటిసార్లు స్నాన ఫలం ప్రయాగ్ కుంభమేళ స్నానంతో సమానమని స్కంద పురాణం పేర్కొంటోంది. అక్కడ మాఘ స్నానం అత్యంత పుణ్యప్రదమన్న పద్మపురాణం వాక్కు మేరకు ఇటీవలే ముగిసిన కుంభమేళాలో భక్తులు పోటెత్తారు. అమావాస్య నాటి స్నానం పరమోత్తమం అనే నానుడి ప్రకారం, జనవరి 29న మౌని అమావాస్యనాడు అతి పెద్ద స్నానోత్సవం జరిగింది. పూర్వీకులను స్మరించుకుంటూ స్నానమాచరించి, దానాలు చేయడం వల్ల ప్రతికూల శక్తులన్నీ తొలగిపోతాయన్న విశ్వాసాన్ని ఆచరణలో పెట్టారు. హిమాలయ గుహలలో తపస్సు చేసుకునే మహాత్ములు, యోగులు, నాగసాధువులు, వివిధ సంప్రదాయాల గురువులు, ఆచార్యులు ప్రవచనాలు, సందేశాలతో ఆధ్యాత్మిక వెల్లివిరిసింది.

ఈ ఆధ్యాత్మిక సంరంభం పట్ల వివిధ దేశాలు ఆకర్షితమయ్యాయి. విదేశీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారిలో ఎందరో పరిశోధకులు కుంభమేళాను ఆసక్తితో గమనించారు. పలు మతాలకు చెందిన వారు పవిత్ర స్నానం చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. సుమారు 40 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలకు వస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసింది. అంతకు మించి భక్తులు రావడం విశేషంగా పరిగణిస్తున్నారు.

సుమారు శతాబ్ద కాలంలో జరిగిన కుంభ మేళాలను పరిశీలిస్తే, కుంభమేళ–2025కు ఒక విశిష్టత ఉంది. అయోధ్య దివ్య భవ్యమందిర అయిదు శతాబ్దాల పైచిలుకు కల సాకారమై, సాకేత సార్వభౌముడు కొలువు దీరిన ఏడాదికే ఈ కుంభమేళ రావడం ప్రత్యేకత. 1966 నాటి కుంభమేళ అప్పటి దాకా ఎన్నడూ ఎరుగునంతటి కార్యక్రమని చరిత్ర చెబుతుండగా, ప్రస్తుత కుంభమేళా దానిని తిరగరాసింది. ఈసారి ప్రపంచవ్యాప్త భక్తులు డిజిటల్ ద్వారా వీక్షించారు. కుంభ మేళాలో తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) చాట్ సేవలు వినియోగించారు. కుంభమేళ సమాచారాన్ని 11 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంచారు.



ఒకటిన్నర లక్షలకుపైగా మరుగుదొడ్లు, భక్తుల కోసమని 25వేల విడుదులు ఏర్పాటు చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మహాకుంభమేళా కోసమని రూ.7 వేల కోట్లకుపైగా నిధులు కేటాయించగా, కేంద్ర ప్రభుత్వం ప్రయాగరాజ్‌ను అభివృద్ధి చేయడం కోసమని మొత్తంగా రూ.15 వేల కోట్ల పెట్టుబడి పెట్టింది.

### మహాకుంభమేళాతో 35 బిలియన్ డాలర్లు

మహాకుంభమేళా ఆధ్యాత్మికతను, ఆర్థిక చేతనత్వాన్ని పెనవేసే ఓ ప్రబలమైన తార్కాణమైంది. అది ధార్మికాచారాన్ని మించిపోయే ఓ కీలకమైన ఆర్థిక ఉత్ప్రేరకంగా పనిచేస్తోంది. 800 మిలియన్ డాలర్ల అంచనా బడ్జెట్‌తో సంపూర్ణమైన మహాకుంభ మేళా తనదైన ప్రభావంతో ఆర్థిక వ్యవస్థలోకి దాదాపు 30 బిలియన్ డాలర్ల నుంచి 35 బిలియన్ డాలర్ల నిధుల ప్రవాహాన్ని వెల్లువెత్తిస్తుంది. యూపీ ప్రభుత్వం మహాకుంభమేళా నుంచి రూ.54 వేల కోట్ల ఆదాయాన్ని అంచనా వేసింది. ఈ వేడుక పర్యాటకం, ఆతిథ్యం, రవాణా, స్థానిక వాణిజ్యంలో దాదాపు 60 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి ద్వారా లబ్ది చేకూర్చింది. కోట్లాదిగా భక్తుల రాకపోకలతో బస, ఆహార సేవలు, ధార్మిక సేవలకు అనూహ్యమైన గిరాకీ ఏర్పడింది. చిన్న వ్యాపారులు, తోపుడి బండి వ్యాపారులు, భారీ కార్పోరేట్ల ఆదాయంలో గణనీయమైన వృద్ధి కనిపించింది.


### ఆకాశాన్నంటిన బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలు

మహాకుంభమేళాలో యాత్రీకులకు ఆర్థిక సౌలభ్యం కోసమని 16 బ్యాంకులు వాటి శాఖలను మహాకుంభ్ నగర్ ప్రాంగణంలో నెలకొల్పాయి. ఈ బ్యాంకులు రూ.37 కోట్ల విలువైన లావాదేవీలను నిర్వహించాయి. యాత్రీకులు 16 బ్యాంకుల్లో అత్యధికంగా ఎస్‌బీఐలో నగదు జమలు చేశారు. అధికారులు చెప్పిన వివరాల ప్రకారం నగదు జమలతో పోలిస్తే నగదు ఉపసంహరణ చాలా తక్కువగా ఉంది. ఇంత పెద్ద ఎత్తున నగదు జమలు యాత్రికులు ధార్మిక వేడుకల్లో పాల్గొనేటప్పుడు తమ నగదు భద్రంగా ఉండాలని కోరుకుంటున్న వైనాన్ని సూచిస్తోందని అధికారులు తెలిపారు. బ్యాంకు శాఖలకు తోడు 50 మొబైల్ ఏటీఎంలతో కలుపుకొని మొత్తం 55 ఏటీఎం బూత్‌లను నెలకొల్పారు. అయితే పెరిగిన డిజిటల్ లావాదేవీలతో ఏటీఎంలకు అనుకున్నంత గిరాకీ రాలేదు.

### ప్రపంచ దేశాల ఆధ్యాత్మిక వేడుక

మహాకుంభమేళా కేవలం భారత్‌కు మాత్రమే పరిమితమైంది కాదు. అది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఓ ఆధ్యాత్మిక వేడుక. 76 దేశాల ప్రతినిధులు భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వ సంపద పట్ల అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆసక్తిని



ప్రదర్శిస్తున్నట్టుగా మహాకుంభమేళాలో పాల్గొన్నారు. భూటాన్ రాజు త్రివేణి సంగమంలో స్నానం చేశారు. ఒక్క నేపాల్ నుంచే 50 లక్షల మందికి పైగా భక్తులు ప్రయాగరాజ్‌కు వచ్చారు. 27 ఇతర దేశాల నుంచి 2 లక్షల మందికి పైగా యాత్రీకులు మేళాలో పాలుపంచుకున్నారు. ఇదే విషయమై ప్రయాగరాజ్‌కు వచ్చిన యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ కళత్రం లారెన్ పోవెల్ జాబ్స్ మాట్లాడుతూ "ఇక్కడ పొందే ఆధ్యాత్మిక అనుభూతి మరెక్కడా దొరకదు. ఈ వేడుక నుంచి పొందే శక్తి, దివ్యత్వం, వేడుక పరిమాణం మాటలకందనిది" అని అన్నారు.

**పారిశుద్ధ్య కార్మికులతో యోగి సహపంక్తి భోజనం**

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రయాగరాజ్‌లో మహాకుంభమేళా విజయవంతమైన సందర్భంగా ఫిబ్రవరి 27న అక్కడి క్షేత్రస్థాయి సిబ్బందిని కలిశారు. ఆధ్యాత్మిక వేడుకను సమర్థమంతంగా నిర్వహించడంలో కీలకమైన పాత్ర పోషించారంటూ వారిని కృతజ్ఞతాపూర్వకంగా అభినందించారు. మహా కుంభమేళాలో అవిశ్రాంతంగా విధులు నిర్వర్తించిన 75 వేల మంది పోలీసులకు ఒక్కొక్కరికి బోనస్ రూపేణా రూ.10 వేలు, ఏడు రోజులు సెలవు మంజూరు చేస్తామని యోగి ప్రకటించారు. స్వచ్ఛ కుంభ్ నిధి కింద వారందరికీ బహుమతులు, బీమా ధృవీకరణ పత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహాకుంభమేళాలో సేవలందించిన ప్రతీ పారిశుద్ధ్య కార్మికుడు, ప్రతీ ఆరోగ్య కార్యకర్తకూ అదనపు బోనస్ రూపేణా రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు అందజేస్తుందని తెలిపారు. వారందరికీ ఆయుష్మాన్ భారత్ లేదా ముఖ్యమంత్రి జన ఆరోగ్య యోజన కింద రూ.5 లక్షల ఆరోగ్య బీమాను వర్తింపజేస్తామని ప్రకటించారు. యూపీ సీఎం అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో సహపంక్తి భోజనం చేశారు.

**పర్యావరణ హితానికి ఆర్ఎస్ఎస్ సంచులు, కంచాలు**

ప్రయాగరాజ్‌లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని నెలకొల్పడానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ – ఆర్ఎస్ఎస్ నడుం బిగించింది. ప్లాస్టిక్ సంచులు, ప్లేట్లకు బదులుగా గుడ్డ సంచులు, స్టీలు కంచాలు వాడాలని కుంభమేళా సందర్శకులకు పిలుపునిచ్చింది. ఒక సంచీ – ఒక కంచం నినాదాన్ని భక్త జన సందోహం లోకి తీసుకొని వెళ్లింది. ఆర్ఎస్ఎస్ లక్షలాదిగా గుడ్డ సంచులు, స్టీలు కంచాలు, లోటాలను యాత్రికులకు పంచిపెట్టింది.

**వందేళ్లుగా కుంభమేళాకు..**

ఆగస్టు 8,1896న జన్మించిన స్వామి శివానంద సరస్వతి గడచిన వందేళ్లుగా క్రమం తప్పకుండా ప్రయాగరాజ్‌లో జరిగే కుంభమేళాలో పాల్గొని పవిత్ర స్నానమాచరిస్తున్నారు. 129 ఏళ్ల వయసులో ఆబాలగోపాలానికి స్ఫూర్తిగా నిలిచారు.

**ఏడడుగుల కండల బాబా**

కుంభమేళాలో ఏడడుగుల ఎత్తుండి వస్తాదు తరహాలో కండలను కలిగి ఉన్న ఆత్మప్రేమగిరి మహరాజ్ అక్కడకు వచ్చినవారందరి దృష్టిని ఇట్టే ఆకర్షించారు. ఆత్మప్రేమగిరి మహరాజ్ అసలు పేరు



ఎలెస్కి గార్సిన్. రష్యాలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండేవారు. విదేశాల్లో పర్యటిస్తూ భారత దేశానికి వచ్చారు. సనాతనమైన హిందూ ధర్మం పట్ల ఆకర్షితులయ్యారు. హిందూ ధర్మ ప్రచారానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆత్మప్రేమగిరి మహరాజ్ నేపాల్‌లో ఉంటున్నారు.

**అమ్మ కోసం అపర శ్రవణ కుమారుడు..!**

65 ఏళ్ల సుదేష్ ముజఫ్ఫర్ నగర్ వాస్తవ్యులు. ఆయన మాతృమూర్తి 92 ఏళ్ల జగ్‌బిరి దేవి. ఆమెకు ఎప్పట్నుంచో కుంభమేళాకు వెళ్లాలని, అక్కడ పవిత్రమైన నదీజలాల్లో స్నానం చేయాలనే ఉండేది. సుదేష్ అమ్మ కోరిక తీర్చడానికి ఓ చిన్నపాటి ఎద్దుల బండిపై అమ్మను కూర్చుండబెట్టారు. ఆయన ఆ బండిని తానే లాగుతూ రోజుకు 50 కి.మీ.ల దూరాన్ని అధిగమిస్తూ 13 రోజుల్లో ప్రయాగరాజ్ చేరుకున్నారు. పవిత్ర స్నానంతో అమ్మ కోరిక తీర్చారు.

**భక్తుల సేవలో 16 వేల మంది స్వయంసేవకులు**

ప్రయాగరాజ్ కుంభమేళాకు కోట్లాదిగా భక్తులు కోసం, అక్కడ వాహనాల రాకపోకలు సజావుగా జరగడం కోసం, భక్తులకు నిత్యావసర సేవలు సమకూర్చడానికని 16,000 మంది స్వయం సేవకులు అవిశ్రాంతంగా పని చేశారు.





**కాశీ, అయోధ్యకు లక్షల్లో భక్తులు**

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మహాకుంభమేళాతో రాష్ట్రంలో పర్యాటకం వృద్ధి చెందిన వైనాన్ని గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రమంతటా ఆధ్యాత్మిక పర్యాటకంలో భాగంగా అనేక సర్క్యూట్‌లు ఆవిష్కృతమయ్యాయని తెలిపారు. అలాంటి సర్క్యూట్‌లలో ప్రయాగరాజ్ నుంచి మా వింధ్యవాసిని ధామ్ మీదుగా కాశీకి చేరుకునే సర్క్యూట్ ఒకటని ఆయన చెప్పారు. మహాకుంభ మేళాను పురస్కరించుకొని కోట్లాదిగా భక్తులు ప్రయాగరాజ్‌కు వచ్చినట్టుగా మా వింధ్యవాసిని ధామ్‌ను ప్రతి రోజూ 5 లక్షల నుంచి 7 లక్షల మంది భక్తులు సందర్శించుకున్నారని తెలిపారు. అలాగే కాశీలో బాబా విశ్వనాథ్ ధామ్‌ను ప్రతి రోజూ 10 లక్షల నుంచి 15 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆ 45 రోజుల్లో అయోధ్యకు ప్రతి రోజూ 10 లక్షల నుంచి 15 లక్షల మంది భక్తులు వచ్చి బాలరామునికి పూజలు చేశారని చెప్పారు. గోరఖ్‌పూర్‌ను ప్రతి రోజూ 2 లక్షల నుంచి 2.5 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. మహాకుంభమేళా విషయానికి వస్తే ఈ 45 రోజుల్లో మొత్తంగా 66 కోట్ల 30 లక్షల మంది భక్తులు త్రివేణి సంగమంలో పవిత్ర స్నానమాచరించారని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు.

**గిన్నిస్ ప్రపంచ రికార్డుల పుస్తకంలో చోటు**

మహాకుంభమేళా అథారిటీ సాధించిన మూడు చరిత్రాత్మక ఘనతలకు గిన్నిస్ ప్రపంచ రికార్డుల పుస్తకంలో చోటు దక్కింది. ఆ ఘనతల్లో మొదటిది 329 మంది కార్మికులు పెద్ద ఎత్తున అనేక చోట్ల నది జలాలను నిరంతరాయంగా శుద్ధి చేసే కార్యక్రమం, రెండవది 19 వేల మంది కార్మికులు చేపట్టిన అతిపెద్ద పారిశుద్ధ్య కార్యక్రమం. ఘనతల్లో మూడవదిగా 10,102 మంది కళాకారులు ఎనిమిది గంటలు శ్రమించి చేతులతో రూపొందించిన అతిపెద్ద కళాఖండం ఉంది. ఈ సందర్భంగా యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఫిబ్రవరి 27న గిన్నిస్ ప్రపంచ రికార్డుల పుస్తకం అధికారుల నుంచి ధృవీకరణ పత్రం అందుకున్నారు.

**ఇండియా రికార్డుల పుస్తకంలో చోటు**

ప్రయాగరాజ్‌లో మహా శివరాత్రిని పురస్కరించుకొని ఫిబ్రవరి 26న 108 చిత్రకారులు 108 నిమిషాల్లో 108 రూపాల్లో మహా శివుని చిత్రించిన చరిత్రాత్మక ఘటనకు ఇండియా రికార్డుల పుస్తకంలో చోటు దక్కింది. పరమార్థ్ నికేతన్ ప్రాంగణంలో శివ ఫెస్ట్ పేరిట జరిగిన వేడుక ఈ ఘటనకు వేదికగా మారింది. ఇది మహాకుంభ మేళాలో చిరస్మరణీయ ఘటనల్లో ఒకటిగా నిలిచింది.

**16 వేల రైళ్లు.. 5 కోట్ల మంది భక్తులు..!**

భారతీయ రైల్వేలు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో 45 రోజులపాటు సాగే మహాకుంభమేళాకు భక్తుల సౌకర్యార్థం 13 వేల రైళ్లు నడపాలని మొదట భావించింది. అయితే అధికారుల అంచనాలకు మించి భక్తుల సంఖ్య కోట్లను దాటిపోవడంతో ఎట్టకేలకు 16 వేలకు పైగా రైళ్లను నడిపింది. ఆ రైళ్లలో 4.5 కోట్ల నుంచి 5 కోట్ల మంది భక్తులు ప్రయాగరాజ్‌కు రాకపోకలు సాగించారు.

**లక్షలాది చెట్లతో పర్యావరణ పరిరక్షణ**

సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని యూపీ ప్రభుత్వం మహాకుంభమేళాలో పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేయాలనే లక్ష్యంతో మియవకి అటవీ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఆ క్రమంలో 2023, 2024 మధ్య కాలంలో 34,200 చ.మీ.ల విస్తీర్ణంలో 63 జాతులకు చెందిన 1,19,700 మొక్కలను నాటారు. వాటిలో మామిడి, వేప, చింత, రావి, తులసి, తురాయి, ఔషధ మొక్కలు ఉన్నాయి. అప్పటిదాకా వ్యర్థ పదార్థాలకు పారవేయడానికి ఉపయోగించే బుస్వర్ డంపింగ్ యార్డులో 27 వేల మొక్కలు నాటడంతో అది కాస్త పచ్చదనంతో నిండిపోయింది.

**దాహార్తి తీర్చిన 233 నీటి ఏటీఎంలు**

ప్రయాగరాజ్‌లోని మహాకుంభమేళాలో 233 నీటి ఏటీఎంలు భక్తుల దాహార్తిని పరిశుభ్రమైన నీటితో

## యూపీలో 5

మహాకుంభమేళా ఉత్తరప్రదేశ్‌లో ఆధ్యాత్మిక పర్యాటకానికి సంబంధించి సరికొత్త బాటలు వేసింది. రాష్ట్రాన్ని దేశంలోనే ఒక ప్రధానమైన ధార్మిక గమ్యంగా స్థిరపరిచింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మహాకుంభమేళా సందర్భంగా రాష్ట్రమంతటా పేరొందిన ధార్మిక ప్రాంతాలకు యాత్రికుల రాకపోకలను మెరుగుపరచడం లక్ష్యంగా కీలకమైన ఐదు ఆధ్యాత్మిక కారిడార్లను అభివృద్ధి చేసింది. వాటి వివరాలు..

**ప్రయాగరాజ్-వింధ్యాచల్-కాశీ కారిడార్:**

ఈ కారిడార్ యాత్రికులను ప్రయాగరాజ్ నుంచి వింధ్యాచల్ దేవీధామ్‌కు అక్కడి నుంచి కాశీకి (వారణాసి) ప్రయాణించడానికి మార్గం సుగమం చేస్తుంది. శక్తి, మహా శివుడి భక్తులకు ఎంతో ప్రీతిపాత్రమైన ఈ మార్గం ఈ పవిత్రమైన స్థలాల మీదుగా ఓ ఆధ్యాత్మిక యాత్రను అందిస్తోంది.

**ప్రయాగరాజ్-లక్నో-నైమిశారణ్య కారిడార్:**

ఈ మార్గం భక్తులను ప్రయాగరాజ్ నుంచి లక్నో మీదుగా నైమిశారణ్యానికి చేరుస్తుంది. నైమిశారణ్య ధామ్ హిందూయిజమ్‌కు సంబంధించి 88 పవిత్రమైన తీర్థయాత్రా స్థలాల్లో ఒకటిగా నిలిచింది. ఇది 88 వేల మంది ఋషుల ధ్యాన కేంద్రంగా పేరొందింది. ఈ ధామ్‌కు బ్రహ్మదేవుడు, మహా విష్ణువు, మహా శివుడు, సతీ అమ్మవారికి చెందినది.

**ప్రయాగరాజ్-రాజాపూర్ (బాందా)-చిత్రకూట్ కారిడార్:**

శ్రీరామచంద్రుని ప్రవాసంతో ముడిపడి ఉన్న ఈ మార్గం భక్తులను చిత్రకూట్ ధామ్‌కు చేరుస్తుంది. ఇది కామద్గిరి పర్వత్, రామ్‌ఘాట్, హనుమాన్ ధార లాంటి పవిత్రమైన స్థలాలకు నిలయమైంది. ఈ మార్గం రామచరిత మానస్, వినయ్ పత్రిక, తదితర హిందూ ధార్మిక గ్రంథాలను రచించిన గోస్వామి తులసీదాస్ జన్మస్థలమైన రాజాపూర్ (బాందా) మీదుగా వెళుతుంది.

45 రోజులూ నిరంతరాయంగా తీర్చాయి. అన్ని రోజులూ కూడా అధికారులు రివర్స్ ఓస్మోసిస్ పద్ధతిలో శుద్ధి చేసిన తాగు నీటితో ఏటీఎంలను నింపారు. ప్రతీ ఏటీఎంకు ఓ సెన్సర్‌ను అమర్చడం ద్వారా ఏటీఎం పనితీరులో ఎలాంటి అంతరాయం, పొరపాట్లు లేకుండా చూసుకున్నారు. మొదట్లో నాణేల ద్వారా లేకుంటే యూపీఐ చెల్లింపుల ద్వారా భక్తుల నుంచి లీటరు నీటికి ఒక రూపాయి వసూలు చేసినప్పటికీ ఆ తర్వాత ఒక్క పైసా కూడా తీసుకోకుండా ఉచితంగా నీటిని అందించారు. సిమ్ ఆధారిత సాంకేతికత ద్వారా నీటి సరఫరాను పర్యవేక్షించారు. ప్రతీ ఏటీఎం రోజుకు 12 వేల నుంచి 15 వేల లీటర్ల మంచి నీటిని భక్తులకు అందించింది. ఏటీఎం దగ్గర ఉండే సిబ్బంది యాత్రీకులు నీటిని నింపుకోవడంలో ప్లాస్టిక్ సీసాలకు బదులుగా గాజు సీసాలను తప్పనిసరిగా వినియోగించేలా చూడటం ద్వారా పవిత్రమైన చోట వ్యర్థాలను తగ్గించడంలో తమ వంతు పాత్రను సమర్థమంతంగా పోషించారు.

**90 టవర్లతో బీఎస్ఎన్ఎల్ భేష్**

మహాకుంభమేళాలో భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ – బీఎస్ఎన్ఎల్ ఆత్మనిర్భర్ భారత్‌కు లోబడి కోట్లాది యాత్రీకులు, అధికారులు, భద్రతా బలగాలు, వలంటీర్లకు కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాల కల్పనలో ఓ కీలకమైన పాత్రను పోషించింది. మేళా ప్రాంతానికి ప్రత్యేకించి ఒక వినియోగదారు సేవా కేంద్రాన్ని నెలకొల్పింది. దేశ నలుమూలల నుంచి వచ్చిన యాత్రీకులకు వారి సంబంధిత బీఎస్ఎన్ఎల్ సర్కిళ్లకు అనుగుణంగా సిమ్ కార్డులను ఉచితంగా సమకూర్చింది. ఉదాహరణకు ఎవరైనా యాత్రికుడు సిమ్ కార్డును పోగొట్టుకున్నా, సిమ్ కార్డు పాడైపోయినా దానికోసమని అతడు తన సొంత రాష్ట్రానికి తిరిగి వెళ్లాల్సిన పనిలేకుండానే అదే రాష్ట్రానికి చెందిన సిమ్ కార్డును బీఎస్ఎన్ఎల్ అందించింది.

ఈ పని చేసినందుకు యాత్రీకుల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయకపోవడం విశేషం. తద్వారా మహాకుంభ మేళాకు ఎక్కడెక్కడి నుంచో వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి కుటుంబాలతో అనుసంధానమై ఉన్నారు. ఈ వేడుకలో ఫైబర్ కనెక్షన్లు, లీజ్డ్ లైన్ కనెక్షన్లు, మొబైల్ రీచార్జీలకు ఎక్కడ లేని గిరాకీ వచ్చింది. బీఎస్ఎన్ఎల్ గిరాకీకి తగ్గట్టుగా అవసరమైన వారందరికీ వాటిని సమకూర్చింది. అంతరాయంలేని కమ్యూనికేషన్ కోసమని మేళా ప్రాంతంలో మొత్తంగా 90 బీటీఎస్ టవర్లను యాక్టివేట్ చేసింది.

**నలభీములకు పప్పూ ఉప్పూ..!**

మహాకుంభమేళాలో స్వయంపాకం చేసుకునే యాత్రికులకు శుభ్రమైన ఆహార పదార్థాలను అందించడంలో అటు కేంద్ర ప్రభుత్వమూ, ఇటూ యూపీ ప్రభుత్వమూ అనేక చర్యలను సమర్థమంతంగా అమలు చేశాయి. అధికారులు అందరికీ అందుబాటు ధరల్లో 1,000 మెట్రిక్ టన్నులకుపైగా ఆహార పదార్థాలను 20 మొబైల్ వ్యాన్ల ద్వారా సరఫరా చేశారు. యాత్రీకుల నుంచి వాట్సప్ లేదా నిర్దేశిత ఫోన్ నంబరు ద్వారా తీసుకున్న ఆర్డర్లను వారికి నేరుగా అందించారు. రాయితీ మీద గోధుమ పిండి, బియ్యాన్ని 10 కేజీల పొట్లాల్లో , పెసరపప్పు, కందిపప్పు, సెనగపప్పును ఒక కేజీ పొట్లాల్లో భక్తులకు సమకూర్చారు. కొత్తగా 25వేల రేషన్ కార్డులు, 3,500 గ్యాస్ కనెక్షన్లు, 35 వేలకు పైగా గ్యాస్ సిలిండర్లను అందించారు. రోజుకు 5,000 గ్యాస్ సిలిండర్లను రీఫిల్ చేశారు. రోజూ 20 వేల మందికి ఉచితంగా భోజనం పెట్టారు.



**గగన వీధులన్నీ కుంభమేళా వైపే..!**

మహాకుంభమేళాను పురస్కరించుకొని 45 రోజలపాటు భక్తుల రద్దీని తట్టుకోవడానికి వీలుగా ప్రయాగరాజ్ విమానాశ్రయాన్ని అత్యంత అధునాతనమైన సౌకార్యాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ దేశంలో అనేక నగరాలకు, ప్రయాగరాజ్‌కు మధ్య

# ఆధ్యాత్మిక కారిడార్లు



**ప్రయాగరాజ్-మధుర-బృందావనం-శుక తీర్థ్ కారిడార్ (వయా బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వే):**

ఈ కారిడార్ భక్తులను బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వే మీదుగా మధుర- బృందావనం, ఆ తర్వాత మహర్షి శుకాచార్యుడు ధ్యానం చేసినట్టుగా పేరొందిన శుక తీర్థానికి తీసుకెళుతుంది. యాత్రీకులు ఈ కారిడార్ ద్వారా శ్రీకృష్ణ పరమాత్ముని జన్మస్థలమైన మధుర-బృందావనాన్ని సందర్శించ వచ్చు. బాలకృష్ణుని లీలలతో ముడిపడిన ప్రాంతాలను దర్శించుకొని, ఆధ్యాత్మిక అనుభూతిని పొందవచ్చు.

**ప్రయాగరాజ్-అయోధ్య-గోరఖ్‌పూర్ కారిడార్:**

ఈ కారిడార్ శ్రీరామచంద్రుడు, గోరఖ్‌నాథ్ సంప్రదాయాలకు చెందిన ప్రాంతాలను అనుసంధానం చేస్తుంది. భక్తులు ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించిన తర్వాత లేటె హనుమాన్ దేవస్థానం, అక్షయ్ వట్, సరస్వతి కూప్ లాంటి స్థలాలను సందర్శించుకోవచ్చు. అనంతరం అక్కడి నుంచి అయోధ్యకు బయలుదేరి వెళ్లి బాలరాముడి దర్శనం చేసుకోవచ్చు. భక్తులు అయోధ్య నుంచి గోరఖ్‌నాథ్ చేరుకొని గోరఖ్‌నాథ్ దేవస్థానంలో ఆశీస్సులు కోరవచ్చు.



# జాతి చేతనత్వం

“మహా కుంభమేళా సంపూర్ణమైంది.. ఐక్యతా మహా యజ్ఞం సంపూర్ణమైంది. ఎప్పుడైతే జాతి చేతనత్వంతో జాగృతమైందో, ఎప్పుడైతే వందల యేళ్ల నాటి బానిస మనస్తత్వపు బంధనాలను తెంచుకొని సరికొత్త చేతనత్వంతో శ్వాస తీసుకోవడం ఆరంభించిందో సరిగ్గా అలాంటి ఓ దృశ్యమే జనవరి 13 నుంచి ప్రయాగరాజ్‌లో మహాకుంభమేళా ఐక్యతలో మన ముంగిట సాక్షాత్కరించింది. జనవరి 22, 2024న నేను అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ వేడుకలో భగవద్భక్తి ద్వారా దేశభక్తి గురించి మాట్లాడాను.

ప్రయాగరాజ్‌లో మహాకుంభమేళా సందర్భంగా సర్వ దేవీ దేవతలు గుమిగూడారు. పిల్లలు, వృద్ధులు గుమిగూడారు. మహిళలు, యువత గుమిగూడారు. మనమంతా జాగృతమైన దేశ చేతనత్వానికి సాక్షుల మైనాము. ఈ మహాకుంభమేళా ఓ ఐక్యతా మహా

పర్యాటకులకు నిరంతరాయంగా విమాన సర్వీసులు అందించడం కోసమని ఎల్లెయన్స్ ఎయిర్‌తో ఓ భాగసామ్య ఒప్పందం చేసుకుంది. జనవరిలో కొత్తగా 81 విమానాలు గగన వీధుల్లోకి వచ్చాయి. దీంతో మొత్తం విమానాల సంఖ్య 132కు పెరిగింది. విమాన పర్యాటకులు నెలకు దాదాపు 80 వేల సీట్లను వినియోగించుకున్నారు. డిసెంబర్, 2024లో 8 నగరాలకే పరిమితమైన డైరెక్ట్ కనెక్టివిటీ 17 నగరాలకు పెరిగింది. ప్రయాగరాజ్ నుంచి విమానాలు శ్రీనగర్, విశాఖపట్టణంను కలుపుకొని 26 నగరాలకు రాకపోకలు సాగించాయి. వారానికి 30,172 ప్రయాణికులు, 226 విమానాలతో ప్రయాగరాజ్ విమానాశ్రయం పండుగ వాతావరణాన్ని చవిచూసింది. ఈ విమానాశ్రయం నుంచి తొలిసారి అన్నట్టుగా ఒక్కరోజులో 5,000 మందికిపైగా యాత్రికులు విమానాలెక్కారు. 106 ఏళ్ల విమానాశ్రయ చరిత్రలో మొట్టమొదటిసారిగా పగలు, రాత్రి తేడా లేకుండా విమానాలు తిరిగాయి.

**ప్రతి 10 నిమిషాలకో బస్సు..!**


మహాకుంభమేళాలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున మొత్తంగా 4,250 బస్సులు యాత్రికులను ప్రయాగరాజ్ చేర్చడమే పనిగా రోడ్ల మీద తిరిగాయి. నగరంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చడం కోసమని రంగంలోకి దిగిన 750 స్పెషల్ షటిల్ బస్సులు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్ స్టేషన్ల వద్ద ప్రతి రెండు నిమిషాలకు అందుబాటులో ఉంటూ భక్తులను ఎక్కించుకొని తిప్పాయి.

**పోలీసులే పెన్నిధి**

మహాకుంభమేళా సందర్భంగా ఉత్తర ప్రదేశ్ పోలీసులు భక్తులకు అండగా నిలిచారు. అనూహ్యమైన అంకిత భావాన్ని ప్రదర్శించారు. విధుల పట్ల నిబద్ధత వారికి అంతర్జాతీయ గుర్తింపును సంపాదించి పెట్టింది. యోగి ప్రభుత్వం సమర్థమంతమైన నిర్వహణకు తార్కాణమైంది. ఆ క్రమంలో యూపీ పోలీసులు 15 దేశాలు, 20 రాష్ట్రాల నుంచి వచ్చి తప్పిపోయిన భక్తులను, వారి కుటుంబాలతో కలపడంలో విజయవంతమైనారు. మచ్చుకు కొన్ని నిదర్శనాలు..

రాజస్థాన్‌లో జైపూర్ నుంచి వచ్చిన పుష్పేంద్ర సింగ్ షెకావత్ ఫిబ్రవరి 17న తన వాలెట్ పోగొట్టుకున్నారు. అందులో రెండు ఐఫోన్లు, రూ.69 వేల నగదు, ఓ బంగారు గొలుసు, రెండు ఉంగరాలు, ఏటీఎం కార్డులున్నాయి. అయితే అదృష్టవశాత్తూ అరెయిల్ ఘాట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారి అరవింద్ కుమార్ సింగ్‌కు ఆ వాలెట్ దొరికింది. వాలెట్‌లో ఉన్న మొబైల్ ఫోన్‌లో కాంటాక్టుల ఆధారంగా అధికారి సింగ్ షెకావత్‌కు వాలెట్‌ను భద్రంగా అందించారు. ఛత్తీస్‌గఢ్‌లో రాయ్‌పూర్ నుంచి వచ్చిన రాజకుమారి యాదవ్ కుంభమేళాలో ఉన్నట్టుండి కళ్లు తిరిగి పడిపోయారు. కానిస్టేబుళ్లు ప్రశాంత్‌కుమార్, రవీంద్ర సింగ్ వెంటనే ఓ అంబులెన్సును పిలిపించి ఆమెను ఓ ఆస్పత్రిలో చేర్పించారు. రష్యా నుంచి వచ్చిన భక్తురాలు రీటా జనవరి 29న సంగమం వద్ద పవిత్ర స్నానమాచరిస్తుండగా తన కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయారు.

దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆమెకు కానిస్టేబుల్ అమర్‌దీప్ అండగా నిలిచారు. ఆమెను కుటుంబ సభ్యులతో కలిపారు. జర్మనీ నుంచి వచ్చిన ఓ భక్తుల బృందం జనవరి 15న నవాబ్‌గంజ్‌కని బయలుదేరి దారి తప్పింది.



**ఇవాళ కుంభమేళా ఫలితాలు, అనుభవాలు ప్రపంచానికి పాఠాలుగా నిలిచాయి. ఆధ్యాత్మికతలో ఆర్థికాంశాలకు చోటు తక్కువే అయినా, కుంభమేళాలో ఇప్పుడు వాటిని శోధించే పరిశోధకులు కనిపిస్తున్నారు. జనవాహినిని అదుపు చేయడంలో కుంభమేళా ఒక కొండగుర్తుగా నిలిచిందంటున్నారు. ఈ 45 రోజులు మహామేళా నిండా ఎన్నో మైలురాళ్లు, మరెన్నో గీటురాళ్లు కూడా.**

# జాగృతం


కుంభమేళా. ఈ వేడుక ద్వారా 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసం 45 రోజులపాటు ఐక్యమైంది. ఆ విశ్వాసం మహాకుంభమేళాతో మమేకమైపోవడం ఓ అద్భుతం. నేను గడచిన 45 రోజులుగా ప్రతి రోజూ దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా ప్రజలు త్రివేణి సంగమ తీరానికి ఎలా చేరుకుంటున్నదీ చూశాను. సంగమం వద్ద స్నానం చేయాలనే భావోద్వేగాల కెరటం నానాటికీ ఉధృత మైంది. ప్రతి ఒక్క భక్తుడి ధ్యాస సంగమం వద్ద ఒక్కసారైనా స్నానం చేయాలనేదానిమీదే ఉంది. పవిత్రమైన గంగ, యమున, సరస్వతీ నదుల సంగమం ప్రతి భక్తుడి ఉత్సాహం, శక్తి, విశ్వాసంతో నిండి పోయింది. నేడు ఇంత పెద్ద వేడుకకు ప్రపంచంలో మరేదీ సాటి రాదు. అమెరికా జనాభాకు రెండింతలు అన్నట్టుగా కోట్లాది భక్తులు మేళాలో పాల్గొన్నారు. చిన్ని కృష్ణుడు యశోద మాతకు యావత్ ప్రపంచాన్ని తన నోటిలో చూపించినట్టుగా, 144 యేళ్ల తర్వాత జరుపుకున్న మహాకుంభమేళాతో యావత్ భారతీయులు, ప్రపంచమూ భారత్ శక్తిని విరాట్ రూపంలో దర్శించుకున్నారు. వేదాల నుంచి వివేకానందుడి వరకు, ఉపనిషత్తుల నుంచి ఉపగ్రహాల వరకు భారత్ ఘనమైన సంప్రదాయాలు ఈ జాతికి ఓ రూపానిచ్చాయి. ఈ ఐక్యతా మహాకుంభమేళా మన నదులను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకునేలా మనకు స్ఫూర్తినిచ్చింది. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత తేలిక కాదని నాకు తెలుసు. నేను గంగా మాత, యమునా మాత, సరస్వతి మాతను వేడుకుంటున్నాను. ఏమనంటే.. ఓ మాత మిమ్మల్ని కొలుచుకోవడంలో మేమేదైనా తక్కువ చేసి ఉంటే దయచేసి మమ్మల్ని మన్నించు. భగవత్ స్వరూపులైన భక్తులకు సేవ చేయటంలో మేమేదైనా తక్కువ చేసి ఉంటే నన్ను మన్నించాలని అశేష జన వాహినిని ప్రార్థిస్తున్నాను. నేను ఉత్తరప్రదేశ్ నుంచి ఎంపీగా ఓ మాట గర్వంగా చెబుతున్నాను. అదేమి టంటే యోగీజీ నేతృత్వంలో ప్రభుత్వమూ, అధికార యంత్రాంగమూ, ప్రజలూ ఒక్కతాటిపై నిలబడి ఈ ఐక్యతా మహాకుంభమేళాను దిగ్విజయం చేశారు. అది కేంద్రం కావొచ్చు, రాష్ట్రం కావొచ్చు, పాలకుడు కావొచ్చు, అధికారి కావొచ్చు ప్రతి ఒక్కరూ కూడా భక్తిభావాన్ని అణువణువునా నింపుకున్న ఓ సేవకుడైనారు. ప్రత్యేకించి ప్రయాగరాజ్ వాసులు, ఉత్తరప్రదేశ్ ప్రజలు ఈ 45 రోజులూ ఎన్ని కష్టనష్టాలు ఉన్నప్పటికీ భక్తులకు అనిర్వచనీయమైన సేవలు చేశారు. నేను వారందరికీ కృతజ్ఞతాభావంతో అభినందనలు తెలుపుతున్నాను. ఇదంతా చూశాక జాతి ఉజ్వల భవిత పట్ల నా విశ్వాసం మరింత బలపడింది. నేను త్వరలో శ్రీ సోమనాథుని సందర్శించుకుంటాను. ప్రతి భారతీయుడి భక్తి, ప్రార్థనల రూపంలో నా సంకల్ప పుష్పాన్ని స్వామికి సమర్పించుకుంటాను. మహాకుంభమేళా భౌతిక రూపం మహాశివరాత్రితో సంపూర్ణమైంది. కానీ నాకైతే గంగా మాత ఎలాగైతే నిరంతరాయంగా ప్రవహిస్తూ ఉంటుందో అదే తీరుగా ధార్మిక చేతనత్వం, మహాకుంభమేళా ఐక్యత ఎడతెరిపి లేకుండా దేశ ప్రజల నరనరాల్లో ఎడతెరిపి లేకుండా ప్రవహిస్తూ ఉంటాయనే ఓ గట్టి నమ్మకముంది." మహాకుంభమేళా సంపూర్ణమైన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అన్న మాటలివి. ★

వారు సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవడంలో కానిస్టేబుల్ రాజుసింగ్ ఎంతగానో తోడ్పడ్డారు. బెంగళూరునుంచి వచ్చిన శోభ జనవరి 15న కుంభమేళాలో గాయపడ్డారు. కానిస్టేబుల్ సుర్జీత్ యాదవ్ వెంటనే రంగంలోకి దిగి ఆమెకు ఓ అంబులెన్సు ఏర్పాటు చేశారు. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందేలా చేశారు. జనవరి 24న సంగమ్ మార్గ్‌లో కారు నడుపుకుంటూ వెళుతున్న వివేక్ భారతి ఉన్నట్టుండి మూర్ఛ వ్యాధికి లోనయ్యారు. కానిస్టేబుళ్లు గురుదీప్, కపిల్ కుమార్ వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తీసుకొనివెళ్లారు. ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కోలుకున్న వివేక్ భారతి కారుతో పాటుగా సురక్షితంగా ఇంటికి చేరుకోవడంలో ఇద్దరు పోలీసులు కీలకమైన పాత్ర పోషించారు.

**ఆ రెండూ దురదృష్టకరం**

జనవరి 29న మౌని అమావాస్యనాడు తెల్లవారు జామున రెండు గంటలకు సంగం ఘాట్‌లో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 30 మంది మరణించారు. మరో 60 మంది గాయపడ్డారు. ఫిబ్రవరి 15న ఢిల్లీలోని రైల్వే స్టేషన్‌లో మహాకుంభమేళాకు వస్తున్న యాత్రీకుల మధ్య జరిగిన తొక్కిసలాటలో 18 మంది మరణించారు. మరో 30 మంది గాయపడ్డారు. మరణించినవారి ఆత్మలకు సద్గతులు ప్రాప్తించాలని ఆశిద్దాం.

– జాగృతి డెస్క్



పీఐబీ సౌజన్యంతో..




**అమరావతి నిర్మాణానికి కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోంది. అమరావతి రాజధానితో పాటు చుట్టూ అవుటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) ను నిర్మించేందుకు ముందుకు రావడం విశేషం. 190 కి.మీ పొడవు, 70 మీటర్ల వెడల్పుతో 6 వరసలుగా మణిహారంగా నిర్మించే దీని టెండర్ల ప్రక్రియను ఏడు నెలల్లో పూర్తి చేసి ఏడాదిలోపు పనులు ప్రారంభించటానికి చర్యలు తీసుకుంటున్నారు. ఓఆర్ఆర్ కారణంగా అంతర్జాతీయంగా, జాతీయంగా చాలా నగరాలు స్వల్ప వ్యవధిలోనే ఎంతో అభివృద్ధి చెందాయి. ఆ స్ఫూర్తితో అమరావతితో పాటు ఓఆర్ఆర్‌ను ఏకకాలంలో నిర్మించనున్నారు.**

# కేంద్రం సాయంతోనే

రాష్ట్ర ప్రభుత్వానికి నయాపైసా ఖర్చు లేకుండా అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణ వ్యయం మొత్తాన్ని తానే భరించేలా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. ఇందుకు కోసం భూసేకరణ ప్రక్రియను సత్వరమే ప్రారంభించి ఏడు మాసాలలోగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తుంది. ఆపై నాలుగైదు నెలల్లో నిర్మాణ పనులను మొదలెట్టాలనిలక్ష్యంగా పెట్టుకుంది. ఓఆర్ఆర్ నిర్మాణానికి సుమారు 4, 205 ఎకరాలు అవసరమని ప్రాథమిక అంచనా కాగా,అందులో సుమారు 306 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయి. దీంతో 3,899 ఎకరాలను సేకరిస్తే సరిపోతుందని భావిస్తున్నారు.

**కృష్ణా డెల్టాకు మహర్దశ**

అమరావతి ఓఆర్ఆర్‌తోపాటు అనుసంధానంగా మరో రెండు రోడ్లను నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16లో కలుస్తున్న విజయవాడ పశ్చిమ బైపాస్‌ను తూర్పుదిశగా సుమారు 17 కి.మీ. పొడిగిస్తూ నందివెలుగు వరకు ఆరు వరుసల రహదారిని నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ సూచించింది. దీంతో విజయవాడ తూర్పు బైపాస్ రహదారి అవసరం ఉండదని ఎన్‌హెచ్‌ఏఐ తెలిపింది. చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16తో పశ్చిమ బైపాస్ కలిసే చోట ఫ్లవర్‌లీఫ్ ఇంటర్‌ఛేంజ్‌ను నిర్మిస్తారు. ఇక్కడ మొదలయ్యే అనుసంధాన రహదారి నంబూరుకు ఉత్తరంగా పెనుమూలి, మంచికలపూడి, కంఠంరాజు కొండూరు, దుగ్గిరాల, చింతలపూడికి ఆవలివైపుగా వెళ్లి నందివెలుగు వద్ద ఓఆర్ఆర్‌తో కలుస్తుంది. మంగళగిరి-తెనాలి-నారా కోడూరు మధ్య ప్రస్తుత రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయబోతున్నట్టు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇక రెండో లింకురోడ్డు విషయానికొస్తే.. బుడంపాడు వద్ద గుంటూరు హైవే జంక్షన్ నుంచి నారాకోడూరు వరకు సుమారు ఆరున్నర కిలోమీటర్ల పొడవున ఆరు వరుసలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి మూడు అలైన్‌మెంట్లను పరిశీలిస్తున్నారు.




**11 ప్యాకేజీలు... 3 దశలు..**

ఓఆర్ఆర్‌ను 11 ప్యాకేజీలుగా విభజించి మూడు దశలుగా నిర్మించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల నుంచి గుంటూరు జిల్లా పొత్తూరు వరకు 63 కి.మీ. రహదారిని మొదటి దశలో చేపడతారు. ఇందులో భాగంగా కృష్ణానదిపై పల్నాడు జిల్లా బలుసుపాడు-కృష్ణాజిల్లా మున్నలూరు మధ్య 3.15 కి.మీ.ల పొడవున వంతెన నిర్మిస్తారు. రెండో దశలో గుంటూరు జిల్లా పొత్తూరు - కృష్ణాజిల్లా పొట్టిపాడు మధ్య 65 కి.మీ. రహదారి నిర్మిస్తారు. కృష్ణానదిపై గుంటూరు జిల్లా మున్నంగి- కృష్ణాజిల్లా వల్లూరుపాలెం మధ్య 4.8 కి.మీ.వంతెన నిర్మిస్తారు. మూడో దశలో కృష్ణా జిల్లా పొట్టిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వరకు 62 కి.మీ. ఓఆర్ఆర్‌ను చేపడతారు. ఈ దశలోనే జి.కొండూరు సమీపంలో 4.4 కిలోమీటర్ల పొడవున టన్నెల్ నిర్మాణం చేపడతారు.

**ఓఆర్ఆర్ వెళ్లే జిల్లాలు, మండలాలు**

**ఎన్టీఆర్ జిల్లాలో..**

కంచికచర్ల మండలంలోని కంచికచర్ల, పెరెకలపాడు, గొట్టుముక్కల, మున్నలూరు, మొగులూరు, కునికినపాడు;వీరులపాడు మండలంలోని పొన్నవరం, జగన్నాథపురం, జుజ్జూరు, చెన్నారావుపాలెం; తిమ్మాపురం, గూడెం మాధవరం, అల్లూరు, నరసింహారావుపాలెం; జి.కొండూరు మండలం జి.కొండూరు, కుంటముక్కల, దుగ్గిరాలపాడు, పెట్రంపాడు, గంగినేనిపాలెం, నందిగామ, కోడూరు; మైలవరం మండలంలోని మైలవరం, పొందుగల, గణపవరం.

**ఏలూరు జిల్లాలో..**

ఆగిరిపల్లి మండలంలోని బొడ్డనపల్లె, గరికపాటివారి కండ్రిక, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లి, ఆగిరిపల్లి, చొప్పరమెట్ల, నరసింగపాలెం, సగ్గూరు, కృష్ణవరం, సురవరం, కల్లటూరు.

**కృష్ణా జిల్లాలో..**

బాపులపాడు మండలంలోని బండారుగూడెం, అంపాపురం; గన్నవరం మండలం సగ్గురు ఆమని, బల్లిపర్రు, బుతుమిల్లిపాడు; ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు, వెలినూతల, వెల్దిపాడు, తరిగొప్పుల, వేంపాడు, బొకినాల, మానికొండ; కంకిపాడు మండలం మారేడుమాక, కోలవెన్ను, ప్రొద్దుటూరు, కొణతనపాడు, దావులూరు, చలివేంద్రపాలెం, నెప్పల్లె, కుందేరు; తోట్లవల్లూరు మండలం రొయ్యూరు, చినపులిపాక, బొడ్డపాడు, ఉత్తర వల్లూరు,దక్షిణ వల్లూరు.

**గుంటూరు జిల్లాలో..**

– మంగళగిరి మండలంలోని కాజ, చినకాకాని; తాడికొండ మండలంలోని పాములపాడు, రావెల; మేడికొండూరు మండలం సిరిపురం, వరగాని,



సీఆర్‌డీఏ భవనం

# అమరావతి ఓఆర్ఆర్

మందపాడు, మంగళగిరిపాడు, డోకిపర్రు, విశదల, పేరేచర్ల, వెలవర్తిపాడు, మేడికొండూరు; పెదకాకాని మండలం నంబూరు, దేవరాయబొట్లపాలెం, అనుమర్లపూడి; దుగ్గిరాల మండలం చిలువూరు, కంఠంరాజు కొండూరు, ఈమని, చింతలపూడి, పెనుమూలి; కొల్లిపర మండలం వల్లభాపురం, మున్నంగి, దంతలూరు, కుంచవరం, అత్తోట; తెనాలి మండలంలోని కొలకలూరు, నందివెలుగు, గుడివాడ, అంగలకుదురు, కఠేవరం, సంగం జాగర్లమూడి; చేబ్రోలు మండలం గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల, సుద్దపల్లి, శేకూరు; వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు, అనంతవరప్పాడు, చమళ్లమూడి, కుర్నూతల; గుంటూరు తూర్పు మండలం ఏటుకూరు, గుంటూరు, బుడంపాడు ,గుంటూరు పశ్చిమ మండలంలోని పొత్తూరు, అంకిరెడ్డిపాలెం.

**పల్నాడు జిల్లాలో..**

అమరావతి మండలంలోని లింగాపురం, ధరణికోట, దిడుగు, నెమలికల్లు; పెదకూరపాడు మండలం ముస్సాపురం, పాటిబండ్ల, జలాల్పురం, కంభంపాడు, తాళ్లూరు, లింగంగుంట్ల, కాశిపాడు గ్రామాలు.

అసెంబ్లీ, హైకోర్టు భవనాల టెండర్లకు పిలుపు

శాసనసభ, హైకోర్టు భవనాల నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసేలా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీ సీఆర్డీఏ) పనులకు ప్రణాళికలు రూపొందించింది. రూ. 768 కోట్ల అంచనాతో శాసనసభ, రూ. 1,048 కోట్లతో హైకోర్టు భవనాలు నిర్మించేందుకు మార్చి 1న టెండర్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటివరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో టెండర్ల ప్రక్రియ ఆలస్యమైంది.

అమరావతి రాజధాని పనుల కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా బ్యాంకు ద్వారా ఇప్పటికే రుణం లభించింది. కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి 28న ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సంవత్సర వార్షిక బడ్జెట్ రూ. 3.22 లక్షల కోట్లలో రాజధాని నిర్మాణానికి రూ. 6 వేల కోట్లు కేటాయించింది.

**42 ఎకరాల్లో హైకోర్టు**

హైకోర్టు శాశ్వత భవనాన్ని 42 ఎకరాలలో 20.32 లక్షల చదరపు అడుగులలో 55 మీటర్ల ఎత్తున నిర్మించనున్నారు.బేస్మెంట్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఏడు అంతస్తులతో భవనాన్ని డిజైన్ చేశారు. ఏడో అంతస్తులో పూర్తిస్థాయి కోర్టు సమావేశ మందిరం, డైనింగ్ హాల్, సువిశాల గ్రంథాలయం ఏర్పాటు చేస్తారు. ఫిబ్రవరి 3, 2019న సుప్రీంకోర్టు అప్పటి




ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ దీనికి భూమి పూజ చేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు మందగించాయి. కూటమి తిరిగి అధికారంలోకి రావడంతో నిర్మాణంపై దృష్టి పెట్టింది. నిర్మాణ వ్యయం అప్పటిలో అంచనా వ్యయం రూ. 860 కోట్లు కాగా, ప్రస్తుతం రూ. 1,048 కోట్లకు చేరింది.


**103 ఎకరాల్లో అసెంబ్లీ భవనాలు**

శాసనసభ భవన సముదాయాన్ని 103.76 ఎకరాల్లో 11.21లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అసెంబ్లీ బేస్మెంట్, గ్రౌండ్ ఫ్లోర్తో పాటు మూడు అంతస్తులతో విభిన్నంగా డిజైన్లు రూపొందించారు. ఇందుకోసం లండన్‌కు చెందిన ఫోస్టర్స్ సంస్థ డిజైన్ చేసింది. టెండర్ల సంస్థల కోరిక మేరకు ఫోస్టర్స్ సంస్థతో సీఆర్డీఏ ఇటీవల వర్క్‌షాప్ నిర్వహించి, బిల్డింగ్ ఆకృతులు, నిర్మాణ శైలిపై అవగాహన కల్పించింది. అమరావతి ప్రభుత్వ భవన సముదాయంలోని సూపర్ బ్లాక్-ఈ దీనిని నిర్మిస్తారు. మొదటి అంతస్తులో మంత్రుల ఛాంబర్లు, అసెంబ్లీ హాల్, కౌన్సిల్ హాలు, క్యాంటీన్లు, సెంట్రల్ హాలు, లైబ్రరీ ఉంటాయి. రెండో అంతస్తులో కమిటీల ఛాంబర్లు, సభ్యుల లాంజ్, అసెంబ్లీ, కౌన్సిల్ల హాళ్లు, శిక్షణ కేంద్రం తదితరాలు ఏర్పాటు చేస్తారు. మూడో అంతస్తును నగరాన్ని చూసేందుకు ఉద్దేశించారు. అసెంబ్లీ పైభాగంలో ఎత్తయిన శిఖరం ఆకారంలో ఆకృతి ఉండగా, అందులో పైకి వెళ్లి అమరావతి నగరాన్ని చూసేలా ప్రణాళిక రూపొందించారు. 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ. 555 కోట్లతో శాసనసభ భవననిర్మాణానికి అంచనా వేసింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాజధాని నిర్మాణాన్ని నిలిపివేయడం వల్ల ప్రస్తుత అంచనా వ్యయం రూ. 768 కోట్లకు చేరింది.

సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టుగా రాజధాని


రాజధాని అమరావతిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు విధానంలో రూపొందిస్తారు. ఇప్పటివరకు రూ. 48 వేల కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఐఏఎస్ అధికారుల బంగ్లాల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ. 4,382 కేటాయించారు. మంత్రులు, న్యాయ మూర్తుల బంగ్లాల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ. 10,042 కేటాయించారు. ఎల్పీఎస్ మౌలిక సదుపాయాల్లో భాగంగా నాలుగు ప్రధాన రహదారులు, ఇతర సౌకర్యాల కోసం 579.5 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి రూ. 9,699 కోట్లు మంజూరు అయ్యాయి. ట్రంకు రోడ్లను రూ. 7,794 కోట్లతో, ఎస్టీపీ పనులను రూ. 318 కోట్లతో చేపడతారు.

అమరావతి నగరం నిర్మాణం కోసం ఏపీ ప్రభుత్వం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి రుణ సహకారం తీసుకుంటోంది. మొత్తం రూ. 15 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించారు. ఈ మేరకు ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి వచ్చే ఆర్థిక సాయం పొందేందుకు ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బ్యాంకుల నుంచి వచ్చే నిధుల కోసం ప్రత్యేకంగా ఖాతా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ రూ. 13,600 కోట్లు ఇస్తుండగా, రూ. 1,500 కోట్లను కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకోనుంది. మొత్తం రూ. 15 వేల కోట్ల నిధులు రాగానే అమరావతి పనులు వేగవంతమవుతాయి.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

ఆధ్యాత్మికం




58

# విశ్వ అవతరణకు ప్రతీకలు దశావతారాలు

వేదాలలో 'సగుణ సాకార' బ్రహ్మను వివిధ రూపాలలో అభివర్ణించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రధాన సాకార దేవతలు. ఈ త్రిమూర్తులు నిర్గుణ 'పరబ్రహ్మ' రూపాలే. ఈ పరబ్రహ్మ మూడు కార్యకలాపాలు సాగిస్తాడు. మూడు రూపాలుగా భాసిస్తాడు. సృష్టి చేసేవాడు 'బ్రహ్మ', సృష్టిని పరిరక్షించేవాడు విష్ణువు, నశింపచేసేవాడు ఈశ్వరుడు. ఈ సాకార త్రిమూర్తుల స్వరూప స్వభావాలను, శక్తులను పురాణాలు సవివరంగా విశదం చేశాయి. ఇది 'వివిధ దేవతాతత్వం' మాత్రమే. అద్వితీయుడైన 'పరబ్రహ్మ' వివిధ రూపాలు ధరిస్తున్నాడు. భక్తుడు తన స్వభావానికి అనుగుణంగా ఏదో ఒక రూపాన్ని ఎంచుకుంటున్నాడు...ఆరాధిస్తున్నాడు.

పరబ్రహ్మ త్రివిధ రూపాలలో ఒకడైన 'విష్ణువు' క్రమంగా దశావతారాలు ధరించాడు. విశ్వ అవతరణలోని వివిధ దశలకు ఈ అవతారాలు ప్రతీక. మత్స్య (చేప) కూర్మ(తాబేలు) వరాహ, నరసింహ, వామన (పొట్టివాడు) పరశు రామ, రామ, కృష్ణ, బుద్ధ,కల్కి అవతారాలు మానవ క్రమవికాసంలో వివిధ దశలుగా గోచరిస్తాయి. దైవశక్తిని మొదట జంతురూపంలోను, క్రమంగా మానవ రూపంలోను, చివరికి ఆదర్శపురుషుని రూపంలోను చిత్రీకరించడం భారతీయ తత్వం ప్రత్యేకత. వాస్తవిక దృష్టికి ఇది నిదర్శనం. రాముడు, కృష్ణుడు ఇద్దరూ ఆదర్శపురుషులు. ఈ మహనీయుల సంస్తుతితో 'భక్తితత్వం' సమున్న ఆధ్యాత్మిక శిఖరాగ్రాలకు చేరుకుంది. రాముడు 'మర్యాదా పురుషోత్తముడు'. సక్రమ కార్యకలాపాలు సాగించే ఆదర్శపురుషుడు. ఆయన ధర్మానికి ప్రతిరూపం.'రామో విగ్రహవాన్ ధర్మః'. రాముడు ధర్మానికి సజీవ రూపం.

కృష్ణుడు 'లీలా పురుషోత్తముడు'. భగవంతుని జగన్నాటకంలో ఆదర్శ మానవుడు. మానవ సంబంధాలలో నెలకొన్న అన్ని రకాల ఆదర్శాలను పటిష్టం చేయడానికి రాముడు ప్రయత్నించాడు. అయితే మానవ సంబంధాలను పెంపొం దించడమే కృష్ణుని లక్ష్యం. మానవాళి మధ్య సత్సంబంధాలు పెంపొందడానికి వీలుగా ఆయన అసంఖ్యాక పద్ధతులను అన్వేషించాడు.

ఈ లక్ష్య సాధనకోసం ఆయన అంగీకృత ప్రవర్తనా సరళిని అతిక్రమించాడు కూడా. విప్లవ పరివర్తన ప్రాతిపదికగాకల ధర్మానికి ఆయన జీవితం ప్రతీక. విభిన్నజీవన సిద్ధాంతాలను సరికొత్త రీతిలో సమీకృతం, సమన్వయం చేశాడు.

మిగిలిన అవతారాలలో భగవంతుని కొన్ని 'అంశలు' మాత్రమే ప్రస్ఫుటించాయి. కానీ కృష్ణావతారంలో భగవంతుడు సర్వసమగ్రంగా, సంపూర్ణంగా ప్రస్ఫుటించాడు. పదహారు దైవకళలూ (భంగిమలు) కృష్ణునిలో ప్రతిబింబించాయి. ఒక జీవిత కాలంలో శ్రీకృష్ణుని వలె ప్రపంచ మానవాళికి 'ఆదర్శాల అమృత భాండం' అందించిన మహనీయుడు మరొకరు లేరు. ఆయన నదిఒడ్డున నృత్యం చేశాడు. సమర రంగంలో అర్జునునికి 'గీత' బోధించాడు. ఆయన ప్రవచించిన నిష్కామ కర్మ (స్వార్థరహిత శ్రమ), ప్రేమ అన్ని సమస్యలకూ పరిష్కార మార్గాలు. మానవాళి బాధలకు అవి దివ్యఔషధాలు.

**అత్యద్భుత విజయం**

'భజ్' 'క్తిన్' అనే ధాతువుల సంయోగమే 'భక్తి'. 'సేవ చేయటం' అని ఈ ధాతువులకు అర్థం. 'భగవంతునితో సన్నిహిత సంబంధమే భక్తి' అని శాండిల్యుడు తన 'భక్తి సూత్రం'లో పేర్కొన్నాడు. భక్తి అపరిమిత ప్రేమను కురి పిస్తుందని 'భక్తిసూత్రం' ప్రవచిస్తోంది. ఈ ప్రేమ అమృతతుల్యమైంది. భక్తుడు ఈ అమృతం తాగి పూర్తి సంతృప్తిని పొందుతాడు. యల్లబ్ధ్వా పునమ్ సిద్ధో భవతి అమృతో భవతే, తప్తోభవతి' భక్తివల్ల భక్తునికి స్ఫూర్తి లభిస్తుంది. అమరత్వం సిద్ధిస్తుంది. భక్తి వల్ల భక్తుడు ఉన్నతిని పొందు తాడు. భక్తుడు కావడం ఆషామాషీ వ్యవహారం కాదు. మానవుడు భక్తుడు కావడం సమున్నత విజయశిఖరాలను అధిరోహించడమే కాగలదు.

**– శరణ్‌విహారీ గోస్వామి, జాగృతి, 03.5.1987**

మన రుషులు


# ఆత్మజ్ఞాని రైక్వుడు



రైక్వ మహర్షి స్థితప్రజ్ఞతకు మారుపేరు. జరిగిన దానికి చింతించక, జరుగుతున్న దానిని నిర్లిప్తంగా తిలకిస్తూ జరుగబోయే దాని గురించి తలపులేని మహావిరక్తుడు. ఆత్మజ్ఞాని. కీర్తికాంక్ష లేనివాడు. ఛాందోగ్యోపనిషత్‌లోని రెండు ఉపాసన విద్యలలో ఒకటైన 'సంవర్గవిద్య'ను (రెండవది ఉపకోసల విద్య) తెలియచెప్పిన రుషి. ఇతరాలను తనలో ఇము డ్చుకొనే దానిని సంవర్గ అంటారు. 'సంవర్గ' అంటే బాగా గ్రహించడం అనే అర్థం చెబుతారు. జనహృద రాజు 'జానశ్రుతి'కు ఆత్మవిద్యను బోధించాడు. ధర్మానికి కేంద్ర బిందువుగా, సత్యానికి సన్నిధిగా, దానగుణ రాశిగా ఉన్న ఆ రాజు కీర్తి దశదిశలా వ్యాపించింది. అయినప్పటికీ, ఇంకా ఏదో తెలుసుకోవాలనే ఆసక్తి. ఆయన ఉత్తమత్వానికి మురిసిన కొందరు మహర్షులు ఆయనను అనుగ్రహించ దలచి హంసల రూపంలో రాసాగారు. అందులో ఒక హంస, జానశ్రుతి గొప్పదనం గురించి వివరించగా, మరో హంస 'ఆయన గొప్ప వాడనడంలో సందేహం లేదు. సాధారణ జీవితం గడిపే రైక్వ ముని కంటే ఉన్నతుడు కాదు. దేనిని తెలుసుకుంటే ఇక తెలుసుకోదగిన విద్య ఉండదో అది తెలిసిన వాడు రైక్వుడు' అన్న మాటలను నక్షత్ర కాంతిలో విశ్రమిస్తున్న రాజు విన్నాడు. ఇతరుల ఉన్నతిని మన్నించే జానశ్రుతి ఆ మహర్షిని దర్శించి, ఆయన వద్ద గల విద్యను నేర్చుకోవాలను కున్నాడు. ఆయన జాడను తెలుసుకొని సపరివారంగా వెళ్లాడు. 'ఆరు నూర్ల గోవులను, మణిహారాన్ని, ఈ

# తాత్త్విక సిద్ధాంతాల్లో తలమానికం వేదాంతం

58




'వేదాంతులొస్తున్నారు చెంబు, తప్పేలా జాగ్రత్త పెట్టుకోండి' అని సామెత. వేదాంతులంటే దొంగలా! వారు వస్తే చెంబు, తప్పేల జాగ్రత్త పెట్టుకోవడం. ఎందుకు? అంటే 'ప్రపంచం అంతా మిథ్య, ఇందులో నాది నీదని ఏముంది' అని చెప్పి కనిపించిన వస్తువుని కైవసం చేసుకునేవారు. వేదాంతులనే భావం సామాన్య ప్రజల్లో కలిగిందనడానికి ఈ సామెత ఉదాహరణ. అందరూ వేదాంతాన్ని గురించి ఇలా భావిస్తారని కాదు కాని వేదాంతాన్ని గురించి మనలో అనేక అపోహలు ఉన్నాయని మాత్రం చెప్పవచ్చు. అలాగే దానిని ఆకాశానికి ఎత్తేవారు కూడ లేకపోలేదు. వేదాంతం తాత్విక సిద్ధాంతాలన్నింటిలోకి తలమానికమని దేశ విదేశ గొప్ప గొప్ప పండితులు, తాత్వికులు, శాస్త్రజ్ఞులు కొనియాడారు. వేదాంతం గురించి తెలిసినా, తెలియకపోయినా బందరు పేరు చెప్తే లడ్డూ, కాకినాడ పేరైతే తాజా, బాపూ పేరు చెప్తే కార్టూన్లు టక్కున గుర్తు వచ్చినట్లుగానే వేదాంతం అనగానే శంకరచార్యుల పేరు గుర్తుకు వస్తుంది. వేదాంతం ఒక ఆలోచనా విధానం. ఒక జీవిత దృక్పథం. అది ఎంతో శాస్త్రీయమైనదని, ఆధునిక వైజ్ఞానిక యుగంలో ఏ సిద్ధాంతమైనా ఆలోచనాపరులను తృప్తిపరచగలదంటే అది వేదాంతమేనని వివేకానందుడు నొక్కి చెప్పాడు.

మనకి ప్రాచీనమైన సంస్కృతి ఉంది. సంస్కృతి అంటే చక్కని జీవన విధానం. మన జాతి కొన్ని వేల సంవత్సరాలుగా జీవిస్తూ వచ్చినది కాబట్టి మనకి జీవితం అన్నా, ప్రపంచం అన్నా ఒక ప్రత్యేకమైన దృష్టి ఉంది. అదే భారతీయ దృక్పథం లేదా సనాతన దృక్పథం. ఈ దృక్పథం ప్రపంచాన్ని ఆరు ముఖ్యమైన కోణాల నుంచి చూపిస్తుంది లేదా దర్శింపజేస్తుంది. కాబట్టి ఈ ఆరింటిని దర్శనములు అన్నారు. అవి సాంఖ్యము, న్యాయము, వైశేషికము, యోగము, పూర్వమీమాంస, ఉత్తర మీమాంస. ఈ ఆరూ సిద్ధాంతాలు. వీటిలో ఉత్తర మీమాంసనే వేదాంతం అని పిలవడం కద్దు. నిజానికి వేదాంతం అంటే వేదానికి అంతమందు కలవి అంటే ఉపనిషత్తులని అర్థం. ఆ ఉపనిషత్తులపై ఆధారపడిన సిద్ధాంతం కాబట్టి ఉత్తర మీమాంసను కూడ వేదాంతమనే వ్యవహరిస్తుంటారు. ఈ వేదాంతంలో మళ్లీ కొన్ని రకాలున్నాయి. అందులో ముఖ్యమైనది అద్వైత సిద్ధాంతం.దానిని ప్రచారం చేసినవారిలో ప్రముఖులు శంకరాచార్యుడు .

శంకరాచార్యుడు ఒట్టి సిద్ధాంత కర్త మాత్రమే అయ్యుంటే ఆయనను ఇతర తాత్వికుల మాదిరిగానే గ్రంథాలయాలకో, పండితుల చర్చలకో పరిమితం చేసేవారు. ఆయన ప్రవచించిన సిద్ధాంతం, రచించిన అనేక గ్రంథాలు, చేపట్టిన సంస్కరణలు, స్థాపించిన సంస్థలు అన్ని తరగతుల ప్రజలను ప్రభావితం చేశాయి, చేస్తు న్నాయి. కాబట్టి శంకరాచార్యుల జీవితం నుంచి సామాన్యులు కూడా తెలుసుకోవలసింది, తెలుసుకుని ఆచరించవలసింది ఎంతో ఉంది. అలాగే భారతీయ సిద్ధాంతాలన్నింటిలోకి శంకరుని అద్వైత సిద్ధాంతం ఆధునిక వైజ్ఞానిక పరీక్షలకు నిలబడి ఆధునిక దృక్పథంలోని లోటు పాట్లను పూరించగలిగినది. అది ఆధునిక సమస్యలెన్నింటికో పరిష్కారం చూపుతుంది. అందువల్ల ఈ సిద్ధాంతం భారతీయులందరికీ గర్వకారణం. బహుముఖ సమర్థమైన సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన శంకరుని జీవితం చాలా ఆసక్తికరమైనది.

శంకరాచార్యులు కేరళ రాష్ట్రంలో మలబారు తీరంలోని కాలడి అనే గ్రామంలో శివగురువు, ఆర్యాంబ అనే పుణ్య దంపతులకు సాధారణ శకం 788 నందన సంవత్సరం, వైశాఖ శుద్ధ పంచమి, ఆదివారం పునర్వసు నక్షత్రంలో జన్మించారు.మన మహాపురుషులందరి కాలాల విషయంలో ఉన్నట్లుగానే శంకరాచార్యుని కాలం గురించి అనేకమైన వాదాలు, సందేహాలు ఉన్నాయి. అటువంటి సందేహాలకు ముఖ్యమైన కారణం మన ఒకప్పటి ప్రభువులైన బ్రిటిషువారు, వారి ఆస్థాన పండితులు, మన చరిత్రకీ, సంస్కృతికి మసిపూసే ప్రయత్నం చేసి జాతి ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసి స్వతంత్రంగా నిలబడకుండా చేయడానికై అనేకమంది పాశ్చాత్య పండితులు పరిశోధన పేరుతో మన చరిత్ర, సంస్కృతిలోకి అనేకమైన తికమకలను చొప్పించారు.

**– సత్యదేవప్రసాద్, జాగృతి, 12.5.1986**

రథాన్ని స్వీకరించండి. తాము ఉపాసించే దేవత విద్య గురించి బోధించండి' అని ప్రాథేయపడ్డాడు. ఆ ప్రలోభానికి లొంగని రైక్వుడు 'ఆత్మజ్ఞానం ముందు ఈ వస్తువాహనాలు, సువర్ణా భరణాల విలువ శూన్యం. ఇలాంటి వాటిని ఇచ్చి అమూల్యమైన అమృతానుభవాన్ని గ్రహించాలను కోవడం అత్యాశే అవుతుంది' అని మృదువుగా మందలించాడు. జ్ఞానంతో సమానమైనది లోకంలో ఏదీ లేదని, అలాంటి దానిని అధికారం, సిరి సంపద లతో పొందాలనుకోవడం అవివేకమనుకున్న రాజు సిగ్గుపడి వెనుదిరిగాడు. ఆ మహర్షి మందలింపునే ఉపదేశంగా భావించి ఈసారి నిరాడంబరంగా, ఒంటరిగా వెళ్లాడు. 'ఈ శరీరం అశాశ్వతం అని తెలిసినా మనిషి అరిష్వడ్వర్గాలకు లోనై పాప కార్యా లకు పాల్పడుతున్నాడు. ఆత్మానుభూతి హస్తగతమై, తత్వజ్ఞాన సంపున్నులైన మీరు నన్ను శిష్యునిగా స్వీకరించి, అమృతత్త్వమార్గం ఉపదేశించండి. నా కుమార్తెను స్వీకరించి నన్ను కృతార్థుడిని చేయండి' అని వేడుకున్నాడు. ఆయన నిరాడంబరత, జ్ఞాన పిపాసను గుర్తించిన రైక్వుడు రాజు కోరికను ఆమోదించాడు. 'సూర్యచంద్రులు, అగ్ని, వాయువు, జలం – అధిదైవతాలు. నేత్రం, శ్రోత్రం, వాక్కు మనస్సు, ప్రాణం–ఆధ్యాత్మాలు. విరాట్ ఛందస్సు అక్షరాలు పది అన్నం. అందులో బాహ్య, ప్రాణ వాయువులు భోక్తలు కాగా, మిగిలినవి భోజ్యాలు. ఈ పదింటిని కాదని లోకంలో అన్య వస్తువు లేదు. అన్నం, అన్నాది రూపంలోన సమస్తాన్ని అర్థం చేసుకున్నవాడు అంతటిని ఎరిగిన వాడవుతాడు' అని ఉపదేశించాడు. రైక్వుడు నివసించిన ప్రాంతానికి అనంతర కాలంలో 'రైక్వపర్ణ' అని పేరు వచ్చింది.

**– రామచంద్ర రామానుజ**

## వివేకానంద సూక్తిశతి

**I Would rather see everyone of you rank for the atheist is alive and you can make something out of Him**



**మూఢనమ్మకముల మూర్ఖులు అగుదురు**
**ఆస్తికులమునన్న నాస్తి ఫలము**
**మానవతయె చాలు మనిషి నాస్తికుడైన**
**వినుడి స్వామి సద్వివేక వాణి!!**



**బండిరాజుల శంకర్**
**ఆలేరు,**
**9948050608**





మామా! నే చెప్పింది విను... నేను అమెరికా వెళ్లింది సమీర కోసం కాదు... వేరే పని మీద. ఆ విషయం సమీరకు చెప్పలేదు. కానీ నా స్నేహితుడు ద్వారా నేనక్కడికి వచ్చినట్లు తెలుసుకొనీ సమీరే తనను కలవమనీ నాకు ఫోన్ చేసి చెప్పింది. అందుకే వెళ్లాను. అప్పుడు ఆ పెళ్లికొడుకు విపరీత ప్రవర్తన గురించి చెప్పింది. రోజూ అతను ఆమె ఆఫీసుకి, ఇంటికి వెళుతూ, ఫోన్లో అసభ్యంగా మాట్లాడుతూ వేధిస్తున్నాడనీ, అతని ప్రవర్తన అనుమానంగా ఉందనీ, నీకు చెబితే నువ్వు వినటం లేదనీ నాకు అతని వివరాలు చెప్పి అతని గురించి కనుక్కోమని చెబితే నేను హైదరాబాద్లో పోలీసుల సహాయంతో ఆ వివరాలు ఆరా తీసాను. అతనికి ఇదివరకే ఒకావిడతో పెళ్లైపోయి పిల్లదున్నాడనీ, ఆమెకి తనకు గొడవలొచ్చి ఆ వివాహం విడాకుల దాకా వెళ్లిందని, ఆమె భర్తపై గృహహింస కేసు పెట్టినట్లు, ఆ తరువాత అతను అమెరికా వెళ్లిపోయినట్లు తెలిసింది. ఈ విషయాలేవీ నువ్వు తెలుసుకోకుండా అతని ట్రాప్‌లో పడి తనతో సమీరకు వివాహం చేద్దామనీ ప్రయత్నించావు. కూతురు పెళ్లి విషయంలో ఒక తండ్రిగా నువ్వు కనీస జాగ్రత్తలు తీసుకోవద్దా? ఎవరో చెబితే వాళ్ల మాటలు నమ్మి కూతురికి ముక్కూ మొహం తెలియని వాడితో వివాహం చెయ్యడానికి సిద్ధపడటం సరియైన చర్యేనా? సమీర తెలివైనది కాబట్టి నాకు అన్ని విషయాలు చెప్పి అతని మోసం నుంచి బయటపడింది. నీ మాటలు గుడ్డిగా నమ్మి ఉంటే తను కూడా ఆ ఊబిలో కూరుకుపోయేది? ఏ తండ్రైనా కూతురి జీవితాన్ని బంగారంలా తీర్చిదిద్దాలనీ అనుకుంటారు. కానీ ఇలా తెలివి తక్కువగా వ్యవహరించదు. కనీసం నీ కొడుక్కైనా అతని గురించి చెప్పి కనుక్కోవాలన్న ఆలోచన నీకు రాలేదు... కేవలం నామీద మా కుటుంబం మీద కోపంతో కూతురి జీవితం నాశనం చెయ్యడానికి కూడా సిద్ధపడ్డ మూర్ఖుడివి. నేనే లేకపోతే సమీర జీవితం ఛిన్నాభిన్నం అయ్యేది. ఆ పని చేసినందుకు నన్ను అభినందించాల్సింది పోయి తిరిగి తగుదునమ్మా అనీ వచ్చి తిడుతున్నావు. మా కుటుంబం గురించి, నీ గురించి ఈ ఊరివాళ్లతో ఏం చెబుతావు? నువ్వు చెబితే ఊళ్లో వాళ్లు గుడ్డిగా నమ్మేస్తారను కుంటున్నావా? నువ్వెలాంటి వాడివో వాళ్లకి తెలియ దనుకుంటున్నావా? ఈ ఊళ్లో సగం తగువులకు, గొడవలకు నువ్వే కారణం అనీ ఊరందరికీ తెలుసు? నువ్వు నా గురించి, నిప్పు లాంటి మా కుటుంబం గురించి ఊరివాళ్లకు ఏది పడితే అది చెబితే నమ్మడానికి వాళ్లు నీలా పిచ్చివాళ్లు కారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని దాని జీవితాన్ని చక్కదిద్దు. అది నీకు ఈ విషయాలన్నీ చెప్పలేక చాలా రోజుల నుంచీ తనలో తానే కుమిలిపోతున్నది. నీతో మాట్లాడే స్వేచ్ఛకూడా ఇవ్వని నువ్వేం తండ్రివి? పిల్లలు ఎదిగిన తరువాత తండ్రి ఒక స్నేహితుడిలా ఉండాలి. కానీ శత్రువులా కాదు. నువ్వు అందరి తండ్రుల్లా ఉంటే నీతోనే చెప్పేది. నువ్వు వినని మూర్ఖుడివి కాబట్టే నాకు చెప్పింది. ఇంకో విషయం... నేనెప్పుడు నీ కూతురి వెంటపడలేదు. ఆ అవసరం కూడా నాకు లేదు. చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నామన్న చనువుతో ఒక స్నేహితురాలి గానే ఆమెను భావించాను గానీ నాకెటువంటి దురుద్దేశాలు లేవు. ఆమె జీవితం బాగుంటే సంతోషించే వాళ్లలో మొదటివాడిని నేను. అయినా కక్ష కార్పణ్యాలతో చెల్లెలి కుటుంబాన్ని ఆడిపోసుకోవడం తప్పా ఎప్పుడైనా ఆమెను తోడబుట్టువుగా చూశావా? నువ్వు మా మీద ఇంత విషం కక్కుతున్నా మా అమ్మ నిన్ను గానీ, మీ కుటుంబాన్ని గానీ ఒక్క మాట అనదు. వెళ్లు... ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొనీ అందరితో మంచిగా ఉండి కూతురి జీవితాన్ని చక్కదిద్దు. అప్పుడు నిన్ను అందరూ మంచి తండ్రనే కాక మంచి మనిషివనీ మెచ్చుకుంటారు" అంటూ గట్టిగా చెప్పడంతో మా మావ మౌనంగా వెళ్లిపోయాడు. వెళుతున్నప్పుడు అతని ముఖంలో వచ్చినప్పటి కోపం లేదు. సరికదా పశ్చాత్తాపం కనిపించింది.

పుట్టుకతో ఎవ్వరూ చెడ్డకారు. పరిస్థితులు, డబ్బు మనుషుల్ని పాడు చేస్తాయి. నేను మా మావ వెళ్లిపోతుంటే చాలా సేపటివరకు అతన్నే చూస్తూ నిలబడిపోయాను. ఇప్పుడు నాలో కూడా ఆవేశం తగ్గి ప్రశాంతత కలుగుతోంది.. రాగద్వేషాలకు ఎవ్వరూ అతీతులు కారు...

* * *

తొలకరి మొదలైంది. ఏరువాకలు ఊపందు కున్నాయి. అప్పుడప్పుడు చిరుజల్లులు నేలతల్లిని ముద్దాడుతున్నాయి. చెట్లు పచ్చగా మారుతున్నాయి. రైతన్నలంతా ఉత్సాహంగా పొలాల బాట పదుతున్నారు...





గన్నవరపు నరసింహమూర్తి

"పొలాలనన్నీ హలాల దున్నీ" అన్నట్లు నాగళ్లతో కాకుండా ట్రాక్టర్లతో దున్నుతున్నారు. వరి ఆకులు పోస్తున్నారు. మళ్ళీ వేసవి తరువాత చదువుల సంవత్సరం మొదలైనట్లే పంటల కాలం ప్రవేశించింది.

ఒకప్పుడు రైతులు నాగళ్లు,ఎడ్ల బళ్లు వాడేవారు. కానీ కొన్ని సంవత్సరాల నుంచీ వ్యవసాయ పద్ధతులు మారిపోసాగాయి. చాలా మంది రైతులు ట్రాక్టర్లు, వరికోసే యంత్రాలు కొన్నారు. నీటి కోసం చెరువుల మీదా, వర్షం మీద ఆధారపడకుండా బోర్లు విరివిగా తవ్వడం మొదలైంది. పూరిళ్ల స్థానంలో శ్లాబిళ్లు వెలిశాయి. పూర్వం ఎక్కడ చూసినా మట్టిళ్లు, పూరిళ్లు ఉండేవి. ఇప్పుడు అవి మచ్చుకి కూడా కనిపించటం లేదు. వీధులన్నీ కాంక్రీటు రోడ్లుగా మారిపోయాయి. అలాగే ఇంటింటికీ కొళాయిలు వచ్చాయి. పూర్వం ఊరంతా ఏటి దగ్గరే ఉండేది.

పూర్వం మా ఊళ్లో ఎక్కువగా వాలీబాల్, కబాడీ లాంటి ఆటలు ఆడేవారు. ఇప్పుడవన్నీ పోయాయి. అందరూ సెల్ఫోన్లో రకరకాల ఆన్లైను గేమ్స్ ఆడుకుంటు న్నారు. రైతుల పిల్లలెవ్వరూ వ్యవసాయం చెయ్యడానికి



**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**

మొగ్గు చూపటం లేదు. పూర్వం పదవ తరగతి పూర్తికాగానే వ్యవసాయంలో దిగేవారు.

ఇప్పటి వాళ్లంతా పట్నంలో కాలేజీ బాటపట్టి బాగా చదువుకుంటున్నారు. అందరూ మోటారు సైకిళ్లు వాడుతున్నారు. మా చిన్నప్పుడు ఊళ్లోకి మోటారు సైకిలు వచ్చినా, రిక్షాలు వచ్చినా మేమందరం వాటి చుట్టూ గుమిగూడే వాళ్లం. ఇప్పుడూ వీధంతా మోటారు సైకిళ్లు. ఊళ్లో పదిహేను ఆటోలున్నాయి. బస్సులెవ్వరూ ఎక్కటం లేదు. పూర్వం ఊరికి నాలుగుసార్లు వచ్చే బస్సు ఇప్పుడు ఒక్కసారే వస్తోంది.

మా ఊళ్లో హైస్కూలు ఉంది. అందులో పనిచేసిన ఉపాధ్యాయులంతా ఇక్కడే నివసించేవారు. కానీ ఇప్పుడు రోడ్లు వేయడంతో వారంతా దగ్గరున్న పట్నంలో ఉంటూ మా ఊరికి మోటారు సైకిలు మీద వస్తున్నారు.

ఆటోలు ఎక్కువ అవడంతో చాలా మంది పిల్లలు పట్నంలోని కాన్వెంట్లలో చేరిపోయారు. దానివల్ల మా ఊరి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోయింది. చాలా మంది పట్నం బాట పట్టేయడంతో చాలా ఇళ్లు ఖాళీ అయిపోయి మొండి గోడలు దర్శనమిస్తున్నాయి.

పూర్వం మా అగ్రహారం వీధిలో 50 ఇళ్లు ఉండేవి. ఇప్పుడు పదిళ్లలోనే మనుషులుంటున్నారు. అందరూ చదువుల కోసం, వైద్యం కోసం పట్నాలకు వెళ్లి పోతున్నారు. మరి కొన్నాళ్లకు మన పల్లెసీమలు ఖాళీ అయిపోతాయేమోనన్న భయం వేస్తోంది.

ఇప్పటి తరం యువతీయువకులు పల్లెలలో ఉండటానికి ఇష్టం చూపటం లేదు...

టీవీలు, స్మార్ట్‌ఫోన్‌ల వల్ల సినిమాలు చూసేవారు తగ్గిపోయేరు. మా చిన్నప్పుడు దగ్గర పట్నంలో సినిమాకి ఎడ్ల బండ్ల మీద వెళ్ళేవారు...

చాలామంది టీవీకి అతుక్క పోవడం వల్ల బయట రచ్చబండ మీద కూర్చొనే వాళ్లే కరువయ్యారు. కబుర్లు తగ్గిపోయాయి... పక్క ఊళ్లలోని టూరింగ్ టాకీసులు మాయమయ్యాయి. పౌరాణిక నాటకాలు పూర్తిగా కనుమరుగై వాటి స్థానంలో డాన్స్ బేబీ డాన్స్‌లు వచ్చాయి. రోడ్ల మీద నగ్నంగా అమ్మాయిల చేత డాన్సులు చేయిస్తూ యువత గంతులేస్తున్నారు. నైతికత, నైతిక విలువలు, సంప్రదాయాలు బాగా తగ్గిపోయాయి.


(సశేషం)




జర్మనీలో ఫిబ్రవరి 23న జరిగిన 21వ బుండ్‌స్టాగ్ (జర్మనీ పార్లమెంట్) ఎన్నికలు అక్కడి ప్రజల్లో పెరుగుతున్న జాతీయవాద కాంక్షకు ప్రతిరూపంగా నిలిచాయి. ఇదేసమయంలో వామపక్షం గతంలో కంటే తన ఓట్ల శాతంతో పాటు సీట్ల సంఖ్యను కూడా మెరుగుపరచుకోవడం గమనార్హం. అక్రమ వలసదారుల వల్ల పెరుగుతున్న సామాజిక హింస నేపథ్యంలో స్థానిక జర్మన్లలో వారిపట్ల వ్యతిరేకత ఏ స్థాయిలో ఉన్నదీ జాతీయవాద పార్టీ ఏఎఫ్‌డీకి గతంలో కంటే రెట్టింపు స్థానాలు కట్టబెట్టడాన్ని బట్టి అర్థమవుతోంది. తమ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్న ఈ అక్రమ వలసలపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీలిచ్చిన పార్టీలకే వారు తమ మద్దతు పలికినట్టు కూడా ఈ ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఇది కేవలం జర్మనీకి మాత్రమే పరిమితం కాదు.

# కన్జర్వేటర్లకే జర్మన్ ఓటర్ల

ఐరోపా సమాజంలో పెరుగుతున్న అభద్రతా భావం నేపథ్యంలో, ఆయా దేశాల ప్రభుత్వాలు వలసదారుల పట్ల ఇప్పటివరకు తాము అనుసరిస్తున్న విధానాలను సమీక్షించుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల్లో మార్పులు తీసుకురాకపోతే స్థానిక సంస్కృతుల విధ్వంసంతో పాటు తమ మనుగడ కష్టసాధ్యమవుతుందన్న అభిప్రాయం ఐరోపా దేశాల సమాజాల్లో క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలోనే డెన్మార్క్ ప్రధాని అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్నారు. జర్మనీ ఎన్నికల్లో విజయం సాధించి కొత్త ఛాన్సలర్‌గా అధికారాన్ని చేపట్టనున్న సీడీయూ / సీఎస్‌యూ కూటమి నాయకుడు మెర్జ్ ఇప్పుడు వలసల పట్ల కఠిన వైఖరి అనుసరించడంవైపే మొగ్గు చూపుతారన్నది స్పష్టం. ఎందుకంటే ఈ వలసలకు వ్యతిరేకంగా ఆయన గతంలో జర్మనీ పార్లమెంట్‌లో ఒక బిల్లును ప్రతిపాదించారు కూడా. కాకపోతే ఆ బిల్లు ఓడిపోయింది. ఇదిలావుండగా అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపడం వల్ల తాత్కాలికంగా మంచి ఫలితాలు వచ్చినా దీర్ఘకాలంలో, పారిశ్రామిక ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న వాదన కూడా ఉంది. ఇప్పటికే జర్మనీతో పాటుగా ఐరోపా దేశాల్లో తగినంత శ్రామికశక్తి లేకపోవడంతో చాలా ప్రైవేటు సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వలసదారుల్లో నిపుణులను పనుల్లో పెట్టుకోవడంవల్ల మాత్రమే అనుకున్న ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం సాధ్యమనేది ప్రైవేటు సంస్థల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయం మాత్రమే కాదు, వాస్తవం కూడా! దీనికి ప్రధాన కారణం స్థానిక ఐరోపా జాతుల ప్రజల జనాభా వేగంగా తగ్గిపోతుండటం! మరి మెర్జ్ ఈ సమస్యపట్ల సమతుల్యంగా వ్యవహరిస్తారా లేక దూకుడుగానే ముందుకెళతారా అన్నది వేచి చూడాలి.



జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

ఈ ఎన్నికల్లో సెంట్రల్ డెమోక్రటిక్ యూనియన్ ఆఫ్ జర్మనీ (సీడీయూ), క్రిస్టియన్ సోషల్ యూనియన్ (సీఎస్‌యూ) కూటమి 28.5% ఓట్లతో 208 స్థానాల్లో విజయం సాధించి అతిపెద్ద కూటమిగా నిలిచింది. 2021లో జరిగిన ఎన్నికల్లో ఈ పార్టీకి 197 సీట్లు (24.1% ఓట్లు) రాగా ఇప్పుడు 11సీట్లు పెరగడం గమనార్హం. ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డీ)20.8% ఓట్లతో 152 స్థానాల్లో గెలుపొంది రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. 2021 ఎన్నికలతో పోలిస్తే ఈ పార్టీ అత్యధిక లబ్ధిపొందిందనే చెప్పాలి. గత ఎన్నికల్లో 10.4% ఓట్లతో 83 స్థానాల్లో గెలుపొందగా ఈసారి ఓట్ల శాతం రెట్టింపు కావడంతో 82 స్థానాలు అదనంగా గెలుచుకోవడం ఈ పార్టీ సాధించిన ఘనత. ఇక అధికారంలో ఉన్న సోషల్ డెమోక్రటిక్ పార్టీ (ఎస్‌డీపీ) గతంతో పోలిస్తే 9% ఓట్లు కోల్పోయి 120 (16.4% ఓట్లు) సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. గత ఎన్నికల్లో ఈ పార్టీ 206 (25.7% ఓట్లు) స్థానాలను గెలుచుకుంది. ఎస్‌డీపీకి 1887 తర్వాత ఇంత తక్కువ ఓటింగ్ శాతం ఎప్పుడూ నమోదు కాలేదు. ఈ పార్టీకి జూనియర్ భాగస్వామిగా ఉన్న గ్రీన్స్ పార్టీ కూడా గతంతో పోలిస్తే ఈసారి 3% ఓట్లు కోల్పోయింది. గత ఎన్నికల్లో ఈ పార్టీ 14.7% ఓట్లతో 118 స్థానాల్లో గెలుపొందగా, ఇప్పుడు 12% ఓట్లతో 33 స్థానాలను కోల్పోయి 85 స్థానాలతో సరి పెట్టుకుంది.

సోషలిస్ట్ లెఫ్ట్ పార్టీ గత ఎన్నికల (4.9%)తో పోలిస్తే పరిస్థితిని మెరుగుపరచుకొని 9% ఓట్లతో 64 స్థానాల్లో గెలుపొందింది. ఆ పార్టీకి గత ఎన్నికల్లో గెలిచిన 39 సీట్లతో పోలిస్తే ఇప్పుడు 25 స్థానాలు అదనం. ప్రస్తుత ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడం ద్వారా మధ్యంతర ఎన్నికలకు కారణమైన ఫ్రీ డెమోక్రటిక్ పార్టీ(ఎఫ్‌డీపీ)కి ప్రజలు ఈ ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పారు. ఫలితంగా ఎఫ్‌డీపీ కేవలం 4.3% ఓట్లు మాత్రమే సాధించింది. ఈ పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోవడంతో 2013 తర్వాత మొట్టమొదటిసారి బుండ్‌స్టాగ్‌లో ప్రాతినిధ్యాన్ని కోల్పోవాల్సి వచ్చింది. లెఫ్ట్ పార్టీనుంచి విడిపోయి ఏర్పడిన సహ్రా వాగెన్‌నెఛెట్ అలయన్స్ (బీఎస్‌డబ్ల్యు) 4.97% ఓట్లు సాధించి పార్లమెంట్‌లోకి





# మద్ధతు!

అడుగుపెట్టే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయింది. ఇక సౌత్ షెల్స్‌విగ్ వోటర్స్ అసోసియేషన్ (ఎస్ఎస్‌వి) 5% ఓట్లతో ఒక్క స్థానంలో గెలిచి, బుండ్‌స్టాగ్‌లో తన ఉనికిని చాటుకుంది. ఈ ఎన్నికల్లో 82.5% ఓట్లు పోలయ్యాయి. ఇది 2021లో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఆరుశాతం ఎక్కువ! పార్ల మెంట్‌లో మొత్తం 630 స్థానాలుండగా అధికారాన్ని చేపట్టడానికి అవసరమైన సీట్లు 316.

**వలసలు-ఆర్థిక సమస్యలు**

ఐరోపా దేశాల్లో అత్యంత బలమైన జర్మనీ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయిన నేపథ్యంలో జరిగిన ఈ ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యంగా దేశంలోకి విపరీతంగా పెరిగిన వలసలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటివి దేశ రాజకీయ, ఆర్థికవ్యవస్థలను అస్తవ్యస్తం చేశాయి. అంతేకాదు గత రెండేళ్లుగా స్తంభించిన ఆర్థిక వ్యవస్థ ఓటర్లపై చాలా ప్రభావం చూపిందనే చెప్పాలి. దీంతో పాటు ఇటీవలి కాలంలో స్థానికులపై వలసదార్ల దాడులు పెరిగిపోవడం కూడా ఓటర్లు జీర్ణించుకోలేకపోయారు. సీడీయూ /సీఎస్‌యూ కూటమి నాయకుడు ఫ్రెడ్రిక్‌మెర్జ్ అక్రమ వలసలను అరికడతామని, సరైన పత్రాలు లేకుండా ఎవరినీ దేశంలోకి అనుమతించేది లేదని, అక్రమంగా దేశంలో ఉంటున్నవారిని స్వదేశాలకు తిప్పిపంపుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఓటర్లపై సానుకూల ప్రభావం చూపి ఈ కూటమికి 28.5% ఓట్లు రావడానికి దోహదం చేసింది.

**ముగ్గురు నేతల రాజకీయ సన్యాసం**

ప్రస్తుతం సీడీయూ / సీఎస్‌యూ నాయకుడు ఫ్రెడ్రిక్ మెర్జ్ జర్మనీ కొత్త ఛాన్సలర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డీ) గతంతో పోలిస్తే తన ఓటుషేరును రెట్టింపు సాధించినప్పటికీ మిగిలిన పార్టీలు మద్దతివ్వడానికి ముందుకు రాకపోవడంతో అధికారానికి దూరంగా ఉండక తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్ అంచనా మేరకు విపక్ష కన్జర్వేటివ్ గ్రూపు నాయకుడు ఫ్రెడ్రిక్ మెర్జ్‌కు తర్వాతి ఛాన్సలర్ అయ్యే అవకాశాలు మెరుగైన నేపథ్యంలో దేశ రాజకీయాల్లో ఇప్పటివరకు కీలక పాత్ర పోషిస్తున్న ముగ్గురు నాయకులు తాము రాజకీయాలనుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించడం గమనార్హం. వీరిలో ప్రస్తుత ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్, పదకొండేళ్లుగా ఎఫ్‌డీపీకి నాయకత్వం వహిస్తున్న క్రిస్టియన్ లిండ్నర్, గ్రీన్స్ వైస్-ఛాన్సలర్ రాబర్ట్ హెబెక్‌లున్నారు. క్రిస్టియన్ లిండ్నర్ ఒలాఫ్ స్కోల్జ్ ప్రభుత్వం తీసుకువచ్చిన 'డెబిట్ నిబంధనలను' తీవ్రంగా వ్యతిరేకించి, ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడంతో ప్రస్తుత ఎన్నికలు అనివార్యమయ్యాయి.

**ఆర్థిక ప్రగతిపైనే దృష్టి**

కన్జర్వేటివ్ గ్రూపు నాయకుడు ఫ్రెడ్రిక్ మెర్జ్ జర్మనీ ఆర్థిక ప్రగతిపైనే ప్రధానంగా దృష్టి సారించే అవకాశముంది. రాబోయే ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ప్రస్తుతం పన్నులద్వారా వస్తున్న ఆదాయం ఎంతమాత్రం సరిపోదు. ఈ నేపథ్యంలో మెర్జ్ సామాజిక సేవల్లో కోతలు విధించే అవకాశ ముంది. పెరుగుతున్న సైనిక వ్యయం, ధ్వంసమైన మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, పర్యావరణానికి సానుకూల కార్యక్రమాలు అమలు చేయాలంటే బిలియన్ల కొద్దీ యూరోలు అవసర మౌతాయి. నిజం చెప్పాలంటే 1990లో జర్మనీ పునరేకీకరణ తర్వాత మొట్టమొదటిసారి దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. 2022 ఫిబ్రవరి 24న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైంది. అప్పటినుంచి జర్మనీ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు సైనిక సహాయం నిమిత్తం 28 బిలియన్ యూరోలు (29 బిలియన్ అమెరికన్ డాలర్లు) ఖర్చు చేసింది. తద్వారా జర్మనీ అమెరికా తర్వాత ఉక్రెయిన్‌కు అతిపెద్ద మద్దతుదారుగా నిలిచింది. అయితే ట్రంప్ ఈ ఏడాది జనవరిలో అమెరికా అధ్యక్షుడైన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఉక్రెయిన్ విషయంలో ఆయన వ్యవహారశైలి ప్రభావం, అప్పటివరకు రష్యాకు వ్యతిరేకంగా వ్యవహరించిన ఐరోపా యూనియన్ (ఈయూ) దేశాలపై పడింది. డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఈయూను పట్టించుకోవడంలేదు. అమెరికా నేతృత్వంలో ఉక్రెయిన్‌కు గుడ్డిగా మద్దతివ్వడం జర్మనీ ఆర్థిక వ్యవస్థపై దారుణమైన ప్రతికూల ప్రభావం పడింది. తమకు సంబంధంలేని ఈ యుద్ధంలో అమెరికా ప్రోద్బలంతో రంగంలోకి దిగిన ఈయూ దేశాలు ఇప్పుడు ట్రంప్ వైఖరితో దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. ప్రధానంగా జర్మనీ ఈ ప్రభావానికి గురైంది. ఇక ముందు ఉక్రెయిన్‌కు అండగా నిలబడటం ఈయూ దేశాల ప్రాథమిక విధి అని అమెరికా చెబుతున్న నేపథ్యంలో, దాని ద్వంద్వ వైఖరికి బలైపోయామన్న బాధ ఈ దేశాలను పట్టిపీడిస్తోంది. ఇప్పటివరకు అమెరికా రక్షణ కల్పిస్తుందన్న భావనలో ఉన్న ఈయూ దేశాలు ఇప్పుడు తాము స్వయంగా రక్షణపరంగా బలోపేతం కావాల్సిన అవసరం ఏర్పడింది. అధికార మార్పిడి జరిగినప్పుడల్లా అమెరికా విదేశాంగ విధానం మారితే, జర్మనీ వంటి బలీయమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన ఈయూ దేశాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనక తప్పదన్న సత్యం ఇప్పుడు బోధపడుతోంది. కొత్తగా జర్మనీ అధికార పగ్గాలు చేపట్టనున్న ఫ్రెడ్రిక్ మెర్జ్ ఈ పెను సవాలును ఎట్లా ఎదుర్కొంటారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. సీడీయూ ప్రధాన కార్యదర్శి కార్‌స్టన్ లెన్నీమాన్ మాటల్లో ఇదే అభిప్రాయం వ్యక్తం కావడం గమనార్హం. ఈయూ దేశాల్లో జర్మనీ కీలక పాత్ర పోషించాలంటే ఫ్రాన్స్, పోలెండ్ దేశాలతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. జర్మనీ రాజ్యాంగం ప్రకారం ఎన్నికల తర్వాత 30రోజుల్లోగా బుండ్‌స్టాగ్ సమావేశం కావాల్సి ఉంది. అంటే మార్చి 25లోగా కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టాలి. ఒకవేళ అప్పటికి కొత్త ప్రభుత్వం ఏర్పడకపోతే పాత ప్రభుత్వమే అపద్ధర్మ ప్రభుత్వంగా కొనసాగుతుంది.

**మెర్జ్ ఐదు పాయింట్ల ఫార్ములా**

వలసదార్ల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో మెర్జ్ ఈ అక్రమ వలసలను అరికట్టేందుకు గతంలో ఐదు పాయింట్ల ఫార్ములాతో కూడిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ ఫార్ములా ప్రస్తుతం జర్మనీలో అమల్లో ఉన్న చట్టాలు, ఈయూ శరణార్థి చట్టాలు, జెనీవా కన్వెన్షన్‌ను అతిక్రమించేవిగా ఉండటం గమనార్హం. ఈ బిల్లుకు మద్దతు

విషయంలో ఏఎఫ్‌డీ మద్దతు తీసుకోవడానికి కూడా ఆయన వెనుకాడలేదు. ఈ విషయంలో ఇదే పార్టీకి చెందిన యాంజెల్లా మెర్కెల్ ఈయనతో విభేదించారు. చివరకు ఈ బిల్లు బుండ్‌స్టాగ్‌లో ఓడిపోయింది. కాగా అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాలన్నది ఏఎఫ్‌డీ విధానం. కేవలం ఈ కారణంగానే 20% ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచినప్పటికీ ఏఎఫ్‌డీతో పొత్తుకు మిగిలిన పార్టీలు ముందుకు రావడంలేదు. ఈయూ అనుసరిస్తున్న శరణార్థి విధానం నిర్వీర్యమైపోయిందని, ప్రస్తుతం వలసల కారణంగా హింస, దాడులు పెరిగిపోతున్నాయనేది మెర్జ్ వాదన. ఈ విషయంలో ఆయన డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడ్రిక్సన్ వలసలపై అమలు చేస్తున్న కఠిన వైఖరినే అనుసరించాలన్న కృతనిశ్చయంతో ఉన్నట్టు కనిపిస్తోంది. ప్రస్తుతం డెన్మార్క్ ప్రధాని శరణార్థులకు కల్పించే ప్రయోజనాల్లో కోత విధించడం, స్వదేశాలకు పంపేయడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని అంశాల్లో డెన్మార్క్ ప్రధాని తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి కూడా. 2024లో డెన్మార్క్ కేవలం 860 శరణార్థి అభ్యర్థనలను మాత్రమే అనుమతించిందంటే వలసలపట్ల కఠినచర్యలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో మెర్జ్ ఏఎఫ్‌డీ యేతర పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, వలసల విషయంలో అంతర్గతంగా ఏఎఫ్‌డీ మద్దతు పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జర్మన్లు కూడా (ముఖ్యంగా తూర్పు జర్మనీ వాసులు), వలసలు వచ్చేవారికోసం ఎక్కువ ఖర్చుచేస్తున్నా రని, ఉక్రెయిన్‌కు దండగమారి సహాయం చేస్తున్నారని ఆగ్రహంతో వున్నారు. ప్రజల అభిమతానికి అనుగుణంగానే,

ఉక్రెయిన్‌కు సైనిక సహాయం బాగా తగ్గించాలని, రష్యాతో చర్చలు జరిపేలా ఆ దేశంపై ఒత్తిడి తీసుకు రావాలని ఏఎఫ్‌డీ బలంగా కోరుతోంది. ఈ విషయంలో మెర్జ్‌ను అంతర్జాతీయంగా తమ దేశంపై ఉన్న అంచనాలు ఒకపక్క, దేశీయంగా ఎదురవుతున్న ఒత్తిళ్లు మరొకపక్క ఉక్కిరిబిక్కిరి చేయకమానవు.

**దీర్ఘకాలంలో నష్టం**

మెర్జ్ వలసల విధానం తాత్కాలికంగా బాగానే ఉన్నదనిపించినా దీర్ఘకాలికంగా దేశానికి ఇది ప్రతికూల ఫలితాలనివ్వడం ఖాయమని తాజాగా నిర్వహించిన ఒక సర్వే స్పష్టం చేస్తోంది. వలసలు ఆగిపోతే 2060 నాటికి జర్మనీలో ప్రస్తుతం వున్న 46.4 మిలియన్ల శ్రామిక శక్తి 35.1 మిలియన్లకు పడిపోతుందని అంచనా.

నిజానికి ఇప్పుడు కూడా దేశంలోని ప్రైవేటు రంగంలోని సంస్థలు నిపుణులైన పనివారులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వలస వచ్చేవారిలో నిపుణులను నియమించుకుంటే తప్ప సంస్థలు మనుగడ సాగించలేని దుస్థితి నెలకొంది. ఇప్పుడు మెర్జ్ వలసల పట్ల కఠిన వైఖరి అనుసరిస్తే, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. అక్రమ వలసదారుల వల్ల సామాజిక అశాంతి పెరుగుతున్న మాట వాస్తవమే. కానీ వీటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటూనే దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు వలసల పట్ల కొంత సహన వైఖరి అవలంబించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్క జర్మనీ మాత్రమే కాదు, మిగిలిన ఐరోపా దేశాలు కూడా సరిగ్గా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి.

**అమెరికాకు అనుకూలం**

మెర్జ్ ఇప్పుడు దేశాన్ని ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలన్న దృక్పథంతో వేసే ముందడుగులు అమెరికాకు కలిసొచ్చే అంశం. జర్మన్ అమెరికన్ బిజినెస్ ఔట్‌లుక్-2024 ప్రకారం, 96శాతం జర్మనీ కంపెనీలు అమెరికాలోని నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, కాలిఫోర్నియా, ఇల్లినాయిస్, టెక్సాస్ వంటి రాష్ట్రాల్లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు రాబోయే మూడేళ్లకాలానికి ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఇప్పుడు మెర్జ్ వాణిజ్యపరమైన ఆలోచనా ధోరణి కారణంగా ప్రైవేటు రంగానికి మరింత ప్రోత్సాహం ఇచ్చే అవకాశముంది. అమెరికా దీన్ని ఒక సావకాశంగా తీసుకొని, జర్మనీతో లాభసాటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి ఉత్సాహం చూపవచ్చు. ★


జాగృతి ఆధ్వర్యంలో ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి

స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక

'నవలల పోటీ- 2025'కి రచయితలను ఆహ్వానిస్తున్నాం..



1936-2022

ప్రథమ బహుమతి
రూ. 25,000

ద్వితీయ బహుమతి
రూ. 20,000

సూచనలు :

➡ ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి. ➡ నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు. ➡ సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. వ్రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు. ➡ నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా మొబైల్ నంబర్‌తో సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి. ➡ ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

➡ నవలలు పంపవలసిన చిరునామా : 3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.

నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 08 ఏప్రిల్, 2025



# పదవి సతిది..పరపతి పతిది..!

దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడున్నర దశాబ్దా లైనప్పటికీ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగినప్పటికీ, స్త్రీ పురుష అసమానతలు తగ్గడం లేదు. స్త్రీలు లింగ వివక్షను దాటుకుని విద్య, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య రంగాల్లో పురుషులతో సమానంగా పోటీపడి దూసుకుపోతున్నారు.

దేశవ్యాప్తంగా పంచాయతీరాజ్ సంస్థల్లోని 32.29 లక్షల మంది ప్రజాప్రతినిధుల్లో స్త్రీల సంఖ్య 15.03 లక్షలు మాత్రమే. వీరిలో స్వతంత్రంగా పనిచేస్తున్న వారెందరన్నది ప్రధానమైన ప్రశ్న. మహిళా ప్రజాప్రతినిధులను పిండి బొమ్మలనుచేసి భర్త, తండ్రి, కొడుకు, సోదరుడు పదవీ బాధ్యతలను నిర్వహిస్తూ అక్రమాలకు, అవినీతికి పాల్పడే దుస్థితి దేశంలో ప్రతి చోటా రాజ్యమేలుతుంది. సర్పంచ్, కార్పొరేటర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులకు మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో వారిపై పురుషుల పెత్తనాన్ని తప్పించేందుకు కేంద్రం సంసిద్ధం కావడం హర్షణీయం.

స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టి, వారికి రాజకీయ ప్రాతినిధ్యం ప్రారంభమై మూడున్నర దశాబ్దాలు అవుతున్నప్పటికి, మహిళా సర్పంచ్‌లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్స్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో మహిళా ప్రజాప్రతినిధులు అలంకారప్రాయమైనారు. నేడు దేశంలో మహిళ ప్రజా ప్రతినిధులు స్వేచ్ఛగా పనిచేయనిస్థితుల్లో అనేక ప్రతిబంధకాలు ఎదుర్కొంటు న్నారు. పురుషులు కీలక పదవుల్లో ఉన్నప్పుడు తమ భార్యలు, కుటుంబంలోని మహిళలు తమ అధికార పనులుకు అడ్డురావడం లేదు. కానీ మహిళలు రాజకీయ పదవుల్లోకి వస్తే వారు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు లేకపోవడం శోచనీయం. మహిళలకు పురుషులతో సమానంగా ఓటు హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉన్నప్పటికీ సాధికారత సాధనలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. 1992-93 సంవత్సరం నుంచి స్థానిక సంస్థల్లో మహిళా ప్రాతి నిధ్యం పెరిగింది. లక్షలాదిమంది మహిళలు స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతున్నారు.

**పురుషులపై జరిమానాకు కమిటీ సిఫార్సు అభినందనీయం**

స్థానిక సంస్థల్లో పేరుకే మహిళా సర్పంచ్‌లు అధికారం మాత్రం భర్తలు లేదా తండ్రులే చెలాయిస్తు న్నారు. నిర్ణయాధికారంలో పెత్తనం చేస్తూ మహిళా సాధికారిత లక్ష్యాన్ని దెబ్బతీస్తున్న పురుషులపై జరిమానా విధించాలని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసు చేయడం అభినందనీయం. సుప్రీంకోర్టు సలహా మేరకు విశ్రాంతి ఐఏఎస్ అధికారి సుశీల్ కుమార్ అధ్యక్షతన 2023లో కేంద్ర ప్రభుత్వం ఈ కమిటీని నియమించింది. ఇటీవల పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖకు ఈ కమిటీ నివేదిక సమర్పించింది. భర్త, తండ్రి, ఇతర పురుష బంధువులు పాత్రను నిరోధించాలంటే మహిళలకు వ్యవస్థాగతంగా ప్రభుత్వం అండగా నిలవాలని నివేదిక సూచించింది. పలు కీలక సూచనలు చేసింది

**స్త్రీలకు సమాన అవకాశాలు: ప్రధాని మోదీ**


మహిళా సర్పంచ్‌లు, కౌన్సిలర్లను పక్కకు నెట్టేసి కుటుంబంలోని ఎవరో ఒక మగవాడు అధికారాలు చెలాయించడం ప్రజాస్వామానికి సిగ్గుచేటు. ఇలాంటి సంస్కృతి పోవాలని, స్త్రీలకు సమాన హక్కులు, అవకాశాలు లభించాలని ప్రధాని మోదీ లోగడ ఆకాంక్షించారు.

స్వతంత్రంగా పనిచేసిన మహిళ సర్పంచ్‌లు అభివృద్ధి కార్యక్రమాల అమలులో రాణించిన చారిత్రిక వాస్తవాలను స్ఫూర్తిగా తీసుకోవాలి. ఎన్నికైన మహిళాప్రజా ప్రతినిధులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయాలి. వాటిని పంచాయతీ, బ్లాక్ స్థాయి అధికారుల వాట్సప్ గ్రూప్‌తో అనుసంధానించాలి. విద్యావంతులైన మహిళలను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలి. మహిళలు ఎదుర్కొనే రోజువారు పాలనాపరమైన సమస్యలకు అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలి. గ్రామీణ సర్పంచ్‌గాఎన్నికైన మహిళకు గ్రామీణాభివృద్ధి పథకాలు, గ్రామీణ చట్టాలు, రెవెన్యూ చట్టాల మీద శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. మహిళా హక్కులు, లైంగిక హింస, గృహ హింస చట్టాలు, వారసత్వ చట్టాలు, పరిష్కారాల చట్టాలపై ప్రతి 3 నెలలకు ఉచిత న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించి మహిళా ప్రజాప్రతినిధులకు న్యాయ, చట్టపరమైన అవగాహన కలిగించాలి. దైనందిన పాలనా నిర్వహణ, సమస్యల పరిష్కారంలో నైపుణ్యాన్ని పెంపొందించాలి.

రోజు వారీ పాలనా వ్యవహారాల్లో న్యాయ పరమైన సలహాలు అందించాలి. వారికి దన్నుగా ఒక ప్రత్యేక వ్యవస్థను సృష్టించాలి. గ్రామాల్లో మహిళా సంఘాల ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం గ్రామీణ మహిళా సర్పంచ్‌లకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందించాలి. మహిళా జనాభా నిష్పత్తి ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వార్షిక బడ్జెట్లో నిధులు కేటాయించాలి. స్థానిక సంస్థల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు ప్రవేశ పెట్టాలి.

**విధులు-నిధులుపై అవగాహన**

రాజ్యాంగంలోని 73, 74 సవరణ ప్రకారం స్థానిక సంస్థల విధులు, నిధులు ,అధికారాలు,ఆశించిన మేరకు నిధుల లభ్యత, కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ద్వారా లభించే నిధుల పంపిణీ, నిధుల బదిలీ, మౌలిక వసతుల కల్పన మీద మహిళా ప్రజాప్రతి నిధులకు అవగాహన శిక్షణ శిబిరాలు నిర్వహించాలి. గ్రామాల్లో ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రోత్సహించడం, గ్రామీణ మహిళా సర్పంచ్‌లకు ప్రజలు మద్దతును ఇచ్చే విధంగా అధికార వికేంద్రీకరణ ద్వారా ప్రజాభ్యుదయ పథకాలను అమలు చేయాలి. గ్రామీణ ప్రాంతాలలో మహిళల నాయకత్వం, వ్యవస్థాపన, స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై శిక్షణ ఇవ్వాలి. మహిళా సర్పంచ్‌లకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి పనితీరును మెరుగు పరచాలి. పాలనాధికారంలో స్త్రీలకు సరైన వాటా ఇవ్వడం ద్వారా మహిళా సాధికారతకు పునాది వేయాలి. మహిళాభ్యుదయం, మహిళా హక్కుల రక్షణ, మహిళా సాధికారిత సాధనకు ప్రత్యేక అభివృద్ధి వ్యూహాలతో ముందుకు వచ్చి మహిళాభివృద్ధే మానవాభివృద్ధి కేంద్రంగా ప్రభుత్వం సమగ్రమైన చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.



**నేదునూరి కనకయ్య**

**అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం, కరీంనగర్, 9440245771**



# వసంతాల

ప్రతి పర్వ దినం వెనుక ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక కోణాలు ఉంటాయి. వాటి అంతరార్థం దైవలీలలతో ముడిపడి ఉంటుంది. హోలీ వేడుక కూడా అలాంటిదే. ఈ పండుగను యుగయుగాలుగా జరుపుకుంటున్నట్లు 'ధర్మ సింధువు'లాంటి స్మృతి గ్రంథాలు, దీని వెనుక గల ఆరోగ్య రహస్యాలను వైద్య గ్రంథాలు చెబుతున్నాయి. అసుర శక్తులపై దైవీ శక్తుల విజయానికి ఈ పర్వదినం ప్రతీకగా నిలుస్తుంది.

హోలీ పండుగ వర్తమానంలో భావిస్తున్నట్లు కేవలం రంగుల చల్లుకునే పండుగే కాదు. ఆధ్యాత్మిక కోణంలోనూ, ఇందుకు సంబంధించిన పౌరాణిక గాథలు చూస్తే... దాని యదార్థ స్వరూపం బోధపడు తుంది. ఈ పండుగ, దీని విశిష్టతల గురించి ఎన్నో కథనాలు ఉన్నాయి. ఒక ప్రత్యేక ఉద్దేశంతో ప్రారంభ మైన ఈ ఉత్సవానికి కాలక్రమంలో అనేక రకాల ప్రాముఖ్యతలు ఏర్పడ్డాయి. అన్ని వర్గాను చేరదీసి, చిన్నా-పెద్ద, ధనిక-బీద, అధికార - అనధికార లాంటి భేదభావాలకు అతీతంగా, హిందూ జాతి వీరత్వాన్ని, ఏకత్వాన్ని, అఖండ త్వాన్ని స్ఫురింప చేసే మహత్తర పర్వదినంగా దీనిని జరుపు కుంటున్నారు.

శ్రీకృష్ణుడు మొట్టమొదటగా గోపీ గోపికలతో హోలీ ఆడాడని పురాణోక్తి. అయితే ఆయన ఆడిన ఆటకు, వర్తమానంలో జరుపుకొనే పండుగకు అంతరం ఎంతో ఉంది. జ్ఞానవిజ్ఞాన రూపాలనే రంగులు మోక్షసాధనకు చక్కటి మార్గాలని శ్రీకృష్ణ పరమాత్మ ఉపదేశించాడు. జ్ఞానమనే గులాంతో, విజ్ఞానమనే కుంకుమ రంగుతో తన భక్తుల మనసులను పరిశుద్ధ పరచి, వారిలో పవిత్రను నింపి మైమరపింపచేసేందుకు ఈ క్రీడ ఆడాడని యోగులు వ్యాఖ్యానించారు. యమునాతీరంలోని బృందావనంలో శ్రీకృష్ణుడు గోపికలపై వసంతాన్ని చిలకరిస్తే వారు ప్రేమాతిశయంతో ఆయనపై పన్నీరు, పుష్పాలు విరజిమ్మారని శ్రీమద్భాగవతం చెబుతోంది. సమస్త కలహాలకు ఈర్ష్యా ద్వేషాలే మూల కారణమని, జ్ఞాన యోగాల ద్వారానే వాటిని తొలగించడం సాధ్యమని, అప్పుడే ఆత్మపరమాత్మల కలయికకు మార్గం ఏర్పడుతుందని ఆధ్యాత్మిక, తత్వవేత్తలు అంటారు.

సామాజిక కోణంలో చూస్తే హోలీ సామాజిక పర్వదినం. అంతవరకు మనోవైషమ్యాలు కలిగి ఉన్నవారు పండుగవేళ పరస్పరం రంగులు చల్లు కోవడం, ఆలింగనలు చేసుకోవడం కనిపిస్తుంది. అలా ఈర్ష్యాద్వేషాలు కొంతవరకైన సమసిపోతాయని విశ్వాసం. అయితే ఈ చర్యలు అప్పుడప్పుడు, అక్కడక్కడ వికటిస్తుంటాయి. 'జ్ఞానమనే రంగులలో మానవులు తమ ఆత్మలను పరమాత్మలో విలీనానికి ప్రయత్నించాలి' అనే ఆధ్యాత్మిక చింతనకు బదులుగా, వర్తమానంలో కేవలం వేడుక కోసమే ఈ పండుగను జరుపుకుంటున్నారనే వ్యాఖ్యానాలు ఉన్నాయి. జనం వ్యవహార శైలీ అందుకు భిన్నంగా లేదని చెప్పవచ్చు. హద్దు దాటితో చేదు అనుభవాలు ఎదురవుతాయ నేందుకు బలవంతంగా రంగులు చల్లడం, మద్య పానం, శ్రుతిమించిన మాటలతో వేళాకోళాలు ఉదాహరణలు

హోలీ సంబంధించి యుగానికి ఒక కథ ప్రచారంలో ఉంది. కృతయుగంలో హోలిక (హిరణ్య కశిపుడి సోదరి) అనే రక్కసి తన ఒడిలో కూర్చున్న వారిని భస్మం చేయగల వరాన్ని పొందింది. హిరణ్యకశిపుడు తన పుత్రుడు ప్రహ్లాదునితో హరి నామస్మరణను మాన్పించే క్రమంలో పలు రకాల దండనలు విధించాడు. అయినా మార్పులేని కుమారుడిని భస్మం చేయాలని సోదరిని ఆదేశించాడు. ఆమె ప్రహ్లాదుడిని ఒడిలోకి తీసుకుని మంటల్లో చేరి ఆ 'బాలభక్తి' ప్రభావంతో దగ్ధమైంది. ప్రహ్లాదుడు బయట పడ్డాడు. ఈ సంఘటన చోటు చేసుకున్న ఫాల్గుణ పౌర్ణమినే 'ప్రహ్లాద పౌర్ణమి' అంటారు.

త్రేతాయుగంలో, శిశువులను చంపుతున్న హోలిక అనే రాక్షసిని రఘుమహారాజు సంహరించాడని, ఆ ఆనంద సమయంలో జరుపుకున్న పండుగ హోలీగా మారిందని కొన్ని గ్రంథాలు పేర్కొన్నాయి. రాక్షసి పీడ వదలినందుకు సంతోషంతో ప్రజలు వసంతాలు చిమ్ముకుంటూ వేడుక జరుపుకున్నారట. ఈ ఉత్సవం నాడు ఆ రాక్షసి బొమ్మను దహనం చేస్తారని 'పురుషార్థ చింతామణి' గ్రంథం పేర్కొంది.



- మధుర మీనాక్షీదేవి ఘోరతపస్సు చేసి సుందరేశ్వరుడిని పరిణయమాడిందీ ఫాల్గుణ పౌర్ణమి నాడే. ఆ రోజున ఆదిదంపతులకు పూజాదికాలు నిర్వహించి 'హోలికా మిశ్రమం' (మామిడిపూత, వేపచిగుళ్లు, తేనె మిశ్రమం)ను భక్తులు ప్రసాదంగా స్వీకరిస్తారు.
- శ్రీ మహాలక్ష్మి పాలకడలి నుంచి ఫాల్గుణ పౌర్ణమినాడే ఆవిర్భవించిందని, అయ్యప్పస్వామి పంబల రాజుకు కనిపించిందీ ఈ రోజునేనని, వారిని పూజిస్తే మంచిదనే విశ్వాసం ఉంది.
- శ్రీకృష్ణుడు మేధాముడనే రాక్షసుడిని చంపిన సందర్భాన్ని పురస్కరించుకొని బెంగాల్‌లో ఈ పండుగను పెద్ద ఎత్తున జరుపుకుంటారు. పెద్ద గడ్డి బొమ్మను తయారు చేసి, దహనం చేస్తారు. తెలుపు లేదా పసుపు రంగు దుస్తులు ధరించి, మెడలో పూలమాలలతో వీధిలోకి వచ్చి వసంత రుతువును స్వాగతిస్తూ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తారు. దీనిని 'దోల్ పూర్ణిమ' అంటారు.
- ఈ రోజున అష్టవిధ శక్తిమాతలను పూజించే సంప్రదాయాన్ని బట్టి దీనిని 'శక్తి పౌర్ణమి'గా పేర్కొంటారు.



# ళీ... హోలీ

> ❊ హోలీ నాడు జనావాస కూడళ్లలో పెద్ద మంటలు (భోగి మంటల మాదిరి) వేసి అగ్నికి ప్రదక్షిణ చేసి ఆ భస్మాన్ని నుదుట ధరిస్తారు. కొన్ని ప్రాంతాలలో దీనిని 'ధూళి వందన్'గా వ్యవహరిస్తారు.
>
> ❊ ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలో డోలోత్సవం నిర్వహిస్తారు. ఆ తిరునాళ్లకు 'డోలాయాత్ర'గా పేరు.
>
> ❊ కాముని పున్నమి నాడు తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో పశువుల కాపరులు వారిలో ఒకరికి ఎలుగుబంటి వేషం వేసి ఇళ్ల ముందు ఆడిస్తూ పాటలతో భిక్షాటన చేసేవారని తెలుస్తోంది. ఉత్తర భారత–దేశంలో ప్రధాన ఆహార పంట గోధుమలు కోతల సందర్భంగా 'హోహో' కోలాహలమే 'హోలి' అయ్యిందనీ కొందరి అభిప్రాయం.

ద్వాపరయుగంలో... కంసుని ఆజ్ఞ మేరకు తన ప్రాణం తీసేందుకు పాలు ఇచ్చే నెపంతో వచ్చిన పూతనను బాలకృష్ణుడు సంహరించాడు. అందుకే వ్రేపల్లెవాసులు ఈ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. ఆ రోజున బాలకృష్ణుడి విగ్రహాన్ని ఊయలలో వేసి ఊపుతారు. అదే 'డోలోత్సవం'. 'నిర్ణయామృతం' అనే సంస్కృత గ్రంథ కథనం ప్రకారం, ధర్మరాజు పాలనలో ప్లేగు వ్యాధి ప్రబలి పెద్ద సంఖ్యలో జనం మృత్యువాత పడుతుండడంతో 'ఇది హోలిక అని బ్రహ్మ రాక్షసి చర్యని, ప్రజలు నిద్రించే సమయంలో వారిని పొట్టన పెట్టుకుంటోందని, దీనిని ఎదుర్కొనే క్రమంలో హోలీ మంటలు వేయాలని శ్రీకృష్ణుడు సూచించాడట.

మరోవంక 'కుమారసంభవం' హోలీ పండుగకు కారణమని పౌరాణిక గాథ. తారకాసుర సంహారానికి కుమారస్వామి జన్మించాలి. అందుకు మహాతపస్సులో ఉన్న మహేశ్వరుడి మనసును చలింప చేయాలి. బ్రహ్మ సూచన మేరకు మన్మథుడు (మదనుడు) ఆ పనిని నెరవేర్చగా, ఉగ్రుడైన శివుడు తన మూడవ కంటితో మన్మథుడిని భస్మం చేశాడు. రతీవిలాపంతో మన్మథుడిని పునర్జీవితుడిని చేసి, ఆమెకు మాత్రం కనిపిస్తూ, అందరి హృదయాలలో ఉంటాడని ప్రకటించాడు శంకరుడు.

దక్షిణాదిలో ఈ పండుగను 'కామదహన గాథ'కు సంబంధించినదిగా పరిగణిస్తారు. ఇక్కడ కామం అంటే శృంగారపరమైన 'వాంఛ' అనే అర్థంలోనే కాకుండా 'కోరిక/ ఆకాంక్ష' అనే లౌకిక అర్థంలో తీసుకోవాలని పెద్దలు సూచిస్తారు. ఐహికమైన కోరికలను త్యజించి నిష్కామకర్మతో సమాజ మేలుకు ఉపకరించాలనే సందేశం ఇందులో ఇమిడి ఉంది.

పౌరాణిక గాథలను అటుంచి ఆ ఆనందకేళిలో ఆరోగ్య రహస్యాలూ దాగి ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతారు. రుతువు మారే క్రమంలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేలా ప్రకృతి వనరులతో తయారయ్యే రంగులు దోహదపడతాయని అంటారు. అలా వేప గింజలు, కుంకుమ, పసుపు తదితర ప్రకృతి సిద్ధ, ఆయుర్వేద పదార్థాలతో సంప్రదాయ బద్ధంగా రంగులు తయారు చేసేవారు.


శీతకాలం నుంచి వేసవి ప్రవేశించే వేళ గాలిలో మార్పుల కారణంగా, జలుబు, జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, వాటి నివారణకు ఔషధ గుణాలు గల బిల్వ, వేప ఆకులు; మందార, మోదుగ, అగ్నిపూల పొదులను చందనం, పసుపు కుంకుమలను నీటిలో కలిపి చల్లుకోవడం ఈ వేడుకలో భాగమని అంటారు. ఫాల్గుణ, చైత్ర మాసాల సంధికాలంలో పక్షం రోజుల పాటు నియమబద్ధంగా దీనిని స్వీకరిస్తే ఆరోగ్యం చేకూరుతుందని 'యోగ చింతామణి' పేర్కొంటోంది. ప్రకృతి సహజమైన రంగులతోనే హోలీ జరుపు కోవాలని 'పర్వ చూడామణి' పేర్కొంటోంది. సంప్రదాయకంగా వస్తున్న పండుగలను జరుపుకోవలసిందే. అదే సమయంలో పూర్వీకులు రూపొందించిన నియమాలను



ఆయుర్వేదం పేర్కొంటోంది. కాలక్రమంలో వాటి స్థానంలో పూర్తిగా రసాయనాలతో నిండిన రంగులు వాడకంలోకి వచ్చాయి. వీటిని చల్లుకోవడంలో ఆనందం, వినోదం మాట ఎలా ఉన్నా ఆరోగ్యపరంగా నష్టం వాటిల్లుతోందని, వాతావరణం కలుషితమవుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రసాయనకారక రంగుల కారణంగా చర్మ వ్యాధులు, అంధత్వం, మూత్రపిండాల వ్యాధులు వంటివి సంక్రమించే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఉగాది పచ్చడి తరహాలో... మామిడిపూత, వేప చిగురు, కరక్కాయపొడి, తేనె మిశ్రమాన్ని తీసుకోవడం (హోలీ మధు ప్రాశనం) వల్ల వేసవి తాపాన్ని తట్టుకొనే శక్తి సమకూరుతుందని ఆయుర్వేదం చెబుతోంది. పొలాల్లోని ధాన్యం, దినుసులు సేకరించి, ఆవు పాలతో మోదుగ పుల్లలపై తయారు చేసే మధుర పదార్థాన్ని 'హోలి'

పాటించడం ద్వారా ఆరోగ్యాలను, పర్యావరణాన్ని కాపాడినవారమవుతాం.

సమైక్య భావనా మాధుర్యాన్ని ప్రకటించేలా ఆసేతు శీతాచలం జరుపుకునే ఈ జాతీయ పండుగను విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ 'జనపర్వం' అని అభివర్ణించారు. వసంత రుతువు ఆగమనానికి ఈ పండుగను సంకేతంగా పరిగణిస్తారు.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్



# సీపీఎం ఏలుబడిలో 'ఆశ' తీరేదెప్పుడు?

తెలుగునాట ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతర విభాగాల్లోని కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి చేసే ఆందోళనకు వామపక్ష అనుబంధ కార్మిక సంఘాలు నాయకత్వం వహిస్తాయి. తాము కార్మిక పక్షపాతులమని వామపక్షాల నాయకులు చెప్పుకుంటారు. కానీ అందులో ఏ మాత్రం వాస్తవం లేదని కేరళలో ఆశావర్కర్లు 23 రోజులుగా (ఈనెల 4వ తేదీకి) చేస్తున్న ధర్నాను బట్టి అర్థమవుతుంది. వేతనం పెంచాలని,పదవీ విరమణ ప్రయోజనం కల్పించాలని, వివిధ యాప్‌లతో పని చేయాలి కాబట్టి మొబైల్ ఫోన్లను ఇవ్వాలన్న తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలో ఆశ వర్కర్ల డిమాండ్లనే కేరళలోనూ అడుగుతున్నారు. కేరళ ప్రభుత్వం తన వైఫల్యాలను కేంద్ర ప్రభుత్వం మీదకు నెట్టేయాలని చూస్తోంది.

ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల్లో వామపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తుంటే, కేరళలో రూ.7 వేలే చెల్లిస్తున్నారు(కేంద్రప్రభుత్వం నుంచి రూ.2వేలు ప్రోత్సాహకం చెల్లిస్తున్నారు). వాటిలోనూ రెండు, మూడు నెలల వేతన బకాయిలున్నాయి.. టీకాలువంటి ఇతర సేవలకు అదనంగా చెల్లిస్తారు. ఆశ వర్కర్లకు అప్పగించిన అదనపు పనులు చేస్తే అదనంగా ప్రోత్సాహకం అందుతుంది. ఒకవేళ అదనపు పనులు చేయలేకపోతే జీతంలో కోత విధిస్తారు. దీంతో నెలకు రూ.5 వేలే అందుకుంటున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. కేరళలో ఆశ వర్కర్ల సేవలు 2008లో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో 26,478 మంది ఆశా వర్కర్లు ఉన్నారు

వ్యాధులపై సర్వేల కోసం ఆశ వర్కర్లు తమ ఫోన్లలో సంబంధిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతి ఇంటి నుంచి 60పైగా అంశాలను సేకరించాలి. ఆ వివరాల నమోదు అనంతరం లబ్ధిదారు మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీని ఆశవర్కర్ తప్పనిసరిగా ఆ యాప్‌లో నమోదు చేయాలి. ఓటీపీ మోసాలు పెరిగిపోవడంతో, అది చెప్పేందుకు ప్రజలు నిరాకరిస్తున్నారు. దీంతో ఓటీపీ నంబరు నమోదును తొలగించాలని ఆశ వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. యాప్‌లు నమోదు చేయడానికి ప్రభుత్వమే ఫోన్ ఇవ్వాలన్న తెలుగు రాష్ట్రాల కార్మిక సంఘాల నేతల డిమాండ్‌నే అక్కడ కూడా ఆశవర్కర్లు గుర్తుచేస్తున్నారు.. స్టేట్ డిజిటల్ హెల్త్ మిషన్ ప్రారంభించిన శ్కెలి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడానికి ప్రభుత్వమే స్మార్ట్ ఫోన్లు, పోస్ట్ పెయిడ్ కనెక్షన్‌తో ఇవ్వాలని కేరళ ఆశ వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఆశ,అంగన్‌వాడీ కార్యకర్తలు దశలవారీగా ఆందోళన చేస్తున్నా పినరయి విజయన్ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 3న పెద్ద సంఖ్యలో శాసన సభకు చేరుకున్నారు. సచివాలయానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో గల అసెంబ్లీ ప్రవేశద్వారం వరకూ ప్రదర్శన నిర్వహించారు. ప్రవేశ ద్వారానికి దూరంగా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ఆశ వర్కర్లు అక్కడ బైఠాయించారు.


గత నవంబర్ నుండి మూడు నెలలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను, బకాయిలను చెల్లించలేదు. వారు ఆందోళన చేస్తూ రోడ్డెక్కిన తర్వాత, వారం రోజుల క్రితమే గౌరవ వేతనాలు, ప్రోత్సాహకాలు సహా బకాయిలన్నీ క్లియర్ అయ్యాయి. నెలవారీ గౌరవ వేతనాన్ని రూ.21వేలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు అందించాలని కేరళ ఆశా హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. కాగా, ఆందోళన చేస్తున్న వారిపై పోలీసు ఒత్తిళ్లు ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ధర్నాలో పాల్గొన్న వారి వివరాలను సీఐటీయూ నాయకులు సేకరిస్తున్నారని జాతీయ మీడియా పేర్కొంది.

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (పిఎస్‌సి)చైర్మన్, సభ్యుల వేతనాలను ప్రభుత్వం ఇటీవల భారీగా పెంచింది. చైర్మన్ జీతం రూ.2.26 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు, సభ్యుల వేతనాలు రూ.2.23 లక్షల నుంచి రూ.3.25 లక్షలకు పెంచేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఇదే విషయాన్ని ఆశ వర్కర్లు ప్రస్తావిస్తున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులకు లక్షల్లో జీతాలు పెంచి తమ వేతన బకాయిలు చెల్లించకపోవడాన్ని తప్పుబడుతున్నారు.


**ప్రతిపక్షాల మద్దతు**

ఆశ వర్కర్ల డిమాండ్లు సహేతుకమైనవేనని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆశ వర్కర్లపై అణచివేత చర్యలకు పాల్పడుతోందని కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం లిజు ఆరోపించారు. మూడు నెలలుగా గౌరవ వేతనాలు చెల్లించడం లేదని ఆశా వర్కర్లు సచివాలయం ఎదుట ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకుండా పీఎస్సీ చైర్మన్ జీతం ఎందుకు పెంచారని ప్రతిపక్ష నాయకుడు వీడీ సతీశన్ ప్రశ్నించారు. కేరళ ఆర్టీసీ ఉద్యోగులకు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు, పింఛన్లు సకాలంలో చెల్లించడం లేదని ఆరోపించారు. రాష్ట్ర సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లకు కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రమేష్ చెన్నితాల సంఘీభావం ప్రకటించారు. ఆశ వర్కర్ల డిమాండ్లు సరైనవేనని సీనియర్ సిపిఐ నాయకుడు, మాజీ రాష్ట్ర మంత్రి సి.దివాకరన్ అన్నారు.

సీఎం తలచుకుంటే ఆశ వర్కర్ల డిమాండ్లను ఐదు నిమిషాల్లో నెరవేర్చవచ్చునని సీపీఐ నాయకుడు దివాకరన పేర్కొన్నారు. ఆశ వర్కర్ల ఆందోళన గురించి అసెంబ్లీలో కొంగడ్ ఎమ్మెల్యే కె. శాంతకుమారి ప్రశ్నించగా, 90 శాతం మంది ఆశా కార్యకర్తలు నెలకు రూ. 10 వేల నుండి రూ. 13 వేల వరకు సంపాదిస్తున్నారని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే 90% పైగా బకాయిలు చెల్లించామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు చెప్పిందని బిజెపి నాయకుడు వి.మురళీధరన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడకుండా ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. వారి డిమాండ్లను ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకు వెళతామని కేంద్ర మంత్రి సురేష్ గోపి తెలిపారు.



**హేమచందర్ కొలిపాక**
సీనియర్ జర్నలిస్ట్, 9440021108


SURYA
A journey of brilliance completes
50+
Years
SINCE 1973
Surya Roshni has been a beacon of excellence,
illuminating lives with innovation and quality.
Here's to 50+ years of brilliance, and to many more years of lighting up the future together!
LIGHTING | FANS | APPLIANCES | WATER PUMPS | STEEL PIPES | PVC PIPES
I am SURYA | 50 YEARS OF TRUST | DURABLE PRODUCTS | ASSURED QUALITY
SURYA ROSHNI LIMITED | www.surya.co.in | surya surya_roshni surya.roshni surya-roshni
Email: info@surya.in Tel.: +91-11-47108000

మన దేశం విభిన్న ప్రాంతాలతో భాషా మత సంస్కృతులతో సామరస్యానికి నిలయంగా ఉంది. భారత రాజ్యాంగం పౌరులందరికీ వీటిని పరిరక్షించుకునే హక్కులను ఇచ్చింది. దురదృష్టవశాత్తు కొన్ని శక్తులు తమ సంతుష్టీకరణ రాజకీయాల కోసం ఈ దేశ మెజారిటీ ప్రజల మత, భాష, సంస్కృతి సాంప్రదాయాలను హేళన చేస్తున్నాయి. దేశ ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీస్తూ వికృత ఆనందాన్ని పొందుతున్నాయి. వారి గురి కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం. కానీ గాయపడుతున్నది దేశ ప్రజలే. బాధ్యతాయుత ముఖ్యమంత్రి పదవిల్లో ఉండి కూడా ఇలా ప్రవర్తిస్తే ఎలా అనే స్పృహ కూడా వీరికి లేకపోవడం శోచనీయం.



# విపక్షాల విచ్ఛిన్నకర




త్రిభాషా విధానానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటించారు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్. హిందీ భాషను తమపై బల వంతంగా రుద్దాలని ప్రయత్నిస్తే దాన్ని అణచి వేసేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తామంటు న్నారు. మరో భాషా పోరాటానికి తమిళనాడు ప్రజలు సిద్ధం అని స్టాలిన్ హెచ్చరించారు. ఆయన పిలుపు మేరకు రాష్ట్రంలో హిందీలో ఉన్న బోర్డులకు నల్లరంగు పూశారు డీఎంకే కార్యకర్తలు. తమ ఇళ్ల ముందు హిందీ భాషా వ్యతిరేక నినాదాలతో ముగ్గులు వేశారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా త్రిభాషా విధానం తప్పనిసరని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రాంతీయ భాషతో పాటు హిందీ, ఇంగ్లీషు భాషలను నేర్పించాల్సి ఉంటుంది. దీన్ని అమలు చేయని తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద ఇవ్వాల్సిన రూ.2152 కోట్ల నిధులను నిలిపేస్తున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. డీఎంకే ప్రభుత్వం రాజకీయ కారణాలతోనే హిందీని వ్యతిరేకిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. కేంద్రం ఎప్పుడూ తమిళ భాష చదవకూడదని చెప్పలేదని, మూడోభాషగా హిందీని అంగీకరించాలని ప్రతిపాదించామని స్పష్టంచేశారు. ఈ నిధులను తాము అడుక్కోవడం లేదని, మీ నాన్నగారి సంపాదన నుంచి అడగడం లేదని వ్యాఖ్యానించారు స్టాలిన్ కుమారుడు, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్.

తమిళనాట హిందీపై వ్యతిరేకత ఈనాటిది కాదు. స్వాతంత్ర్యానికి ముందు నుంచే జస్టిస్ పెరియార్ రామస్వామి, అన్నాదురై ద్రవిడవాదం ముసుగులో హిందీ వ్యతిరేక ఆందోళనలు నిర్వహిం చారు. స్వాతంత్ర్యం తర్వాత ప్రథమ ప్రధాని నెహ్రూ ప్రతిపాదించిన త్రిభాషా విధానాన్ని వ్యతిరేకించారు. ఫలితంగా హింస చెలరేగి వందలాది మంది మరణించారు.

హిందీ వ్యతిరేక ఉద్యమాలతో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఈనాటికీ కోలుకోలేదు. ఈ భాషోన్మాద రాజకీయాల ఆధారంగా ఎదిగిన డీఎంకే అదే రాజకీయాలను ఇప్పటికీ కొనసాగిస్తోంది. ప్రస్తుతం తమిళనాడులో ద్విభాషా విధానం మాత్రమే కొనసాగుతోంది. తమిళం, ఆంగ్లం మాత్రమే బోధిస్తున్నారు.

**డీఎంకే కపట విధానాలు**

డీఎంకే నాయకులు హిందీ వ్యతిరేకత విషయంలో కపట రాజకీయాలు చేస్తున్నారని తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై విరుచుకు పడ్డారు. ద్విభాషా విధానం పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ నేర్పడాన్ని నిరాకరిస్తున్నారు. కానీ సీబీఎస్ఈ సిలబస్ బోధించే ప్రైవేటు స్కూళ్లలో థర్డ్ లాంగ్వేజ్ లేదా అని ప్రశ్నించారు. ఇందులో కొన్ని స్టాలిన్ బంధువులవి, డీఎంకే పార్టీ వారివే ఉన్నాయని అన్నామలై గుర్తుచేశారు. "ఇక్కడ డీఎంకేది ద్వంద్వ విధానం. ధనికుల పిల్లలకు ఒక రకంగా, పేదల పిల్లలకు ఒక రకంగా వ్యవహరిస్తోంది. ఇది కపట ధోరణి" అంటూ అన్నామలై ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

ఇటీవల లోక్‌సభలో భాషాపరమైన అంశంపై డీఎంకే ఎంపీ దయానిధి మారన్‌ను స్పీకర్ ఓంబిర్లా మందలించారు. లోక్‌సభ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు సంస్కృతంలోకి అనువదించడంపై దయానిధి అభ్యంతరం చెప్పారు. "దేశంలో కేవలం 73వేల మంది మాత్రమే సంస్కృతం మాట్లాడుతున్నారన్నారు. సంస్కృతం ఎవరికీ అర్థం కాదు.. ఇది కేవలం ఆర్ఎస్ఎస్ భావజాలంతో చేస్తున్న పని" అని వ్యాఖ్యానించారు. సంస్కృతంలోకి అనువదించడంవల్ల ప్రజలు కష్టపడి కడుతున్న పన్నులు వృథా అవుతున్నాయన్నారు దయానిధి మారన్..

దీనికి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తీవ్రంగా స్పందించారు. "లోక్‌సభలో కేవలం సంస్కృతమే కాదు హిందీ సహా పలు భాషల్లో అనువాదం జరుగుతోంది. మీ సమస్య ఏంటో అర్థం కావడం లేదు.. మీరు ఏ దేశంలో నివసిస్తున్నారు. ఇది భారతదేశం. భారతదేశ ప్రాథమిక భాష సంస్కృతం" అని మందలించారు. బోడో, డోగ్రి, మైథిలి, మణిపురి, సంస్కృతం, ఉర్దూ భాషల్లో కూడా ఏకకాలంలో అనువాదం జరుగుతోందని అన్నారు. దయానిధి మారన్ భారతీయ భాషల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తు న్నారని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపించారు. విచిత్రం ఏమిటంటే.. డీఎంకే దిగ్గజనేత దివంగత మాజీ సీఎం కరుణానిధి, ఆయన మేనల్లుడు దయానిధి, మనవడు ఉదయనిధి పేర్లలోనే సంస్కృతం కనిపిస్తుంది. దయానిధి కుటుంబం నిర్వహించే చానళ్లు సూర్య, ఆదిత్య, ఉదయ, తేజ ఏ భాషకు సంకేతం?

డీఎంకే నాయకులు హిందీ విషయంలో చేస్తున్న వ్యాఖ్యలను ఇటీవల కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ తప్పుపట్టారు. తమిళ భాష గుర్తింపు పట్ల వారి నిబద్ధతను ప్రశ్నించారు. స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ అనే పేర్లు ఏమైనా తమిళమా అని నిలదీశారు. వారు ముందుగా తమ సొంత కుటుంబంలో తమిళ పేర్లను ఉంచుకోవాలి అని మురుగన్ సూచించారు.

**పునర్విభజనపై రాద్ధాంతం**

లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో కూడా తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చాలా రోజులుగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజక వర్గాలను నిర్ణయిస్తే దక్షిణ భారతదేశంతో పాటు తమిళనాట లోక్‌సభ స్థానాలు తగ్గిపోతాయని ఆందోళవ్యక్తం చేశారు. ఇందుకు విరుగుడుగా కొత్తగా పెళ్లి చేసుకున్న జంటలు త్వరగా పిల్లల్ని కనాలనే ఓ హాస్యాత్మక ప్రతిపాదనను ఆయన చేశారు. గతంలో తాము

# రాజకీయాలు

కుటుంబ నియంత్రణపై మాత్రమే దృష్టి సారించామని కానీ ఇప్పుడు రాష్ట్ర జనాభాను పెంచుకోక తప్పని పరిస్థితుల్లో పడ్డామని అన్నారు.

స్టాలిన్ వాదనకు గట్టి బదులు ఇచ్చారు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్క లోక్‌సభ సీటు కూడా తగ్గదని స్పష్టం చేశారు. సీఎం స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ మేరకు దక్షిణ భారత రాష్ట్రాలకు దామాషా నిష్పత్తిలో ఒక్క పార్లమెంటు స్థానం కూడా తగ్గదని తేల్చి చెప్పారు.

**మహాకుంభమేళాపై విషం**

పూర్వం రాక్షసులు మన మునులు యాగాలు చేస్తున్నప్పుడు భగ్నం చేసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా విఫలం కావడం తెలిసిందే. ఇప్పుడు హిందువుల ఆచారాల వ్యవహారాలను అవహేళన చేస్తూ భగ్నం చేసే పాత్రను కుహనా లౌకికవాద పార్టీలు తీసుకున్నాయి. ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా దిగ్విజయంగా ముగిసింది. మకర సంక్రాంతి నాడు ప్రారంభమై మహాశివరాత్రి నాడు ముగిసిన ఈ పవిత్ర ఆధ్యాత్మిక వేడుకకు 66 కోట్ల మందికి పైగా భక్తులు తరలి వచ్చి గంగ, యమున, సరస్వతి నదుల సంగమంలో స్నానమాచరించారు. ఇంత పెద్ద కార్యక్రమంలో జరిగిన స్వల్ప అపశ్రు తులు కొంత బాధ కలిగించినా, మొత్తం మీద శు భప్రదం చేసింది ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం. కుక్కతోక వంకర అనే చందాన హిందుత్వాన్ని, బీజేపీని, సంఘ్‌ను తీవ్రంగా ద్వేషించే కొన్నిపార్టీల నేతలు యధావిధిగా కారు కూతలు కూశారు.

మహాకుంభ్ మృత్యుకుంభ్‌గా మారిందని ఆరోపించారు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ. తనకు మహా కుంభమేళాపై భక్తి ఉందని.. గంగమ్మ తల్లి అంటే గౌరవం అంటూనే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు.

మమత వ్యాఖ్యలను యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా ఖండించారు.

"ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంపై రాజకీయాలు చేయడం ఎంతవరకు సముచితం. తొలిరోజు నుంచి మహాకుంభ్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఈ శతాబ్దంలో జరిగిన కార్యక్రమంలో భాగస్వా ములు కావడం ఆనందంగా ఉంది. అందుకే తప్పుడు ప్రచారాలు పట్టించుకోకుండా ఈ ప్రపంచం, ఈ దేశం మహాకుంభ్‌లో పాల్గొంది" అని యోగి అన్నారు.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హిందువుల మీద జరుగుతున్న దాడుల విషయంలో మమతా బెనర్జీ ఏనాడూ పట్టించుకోలేదు. దోషులపై కఠిన చర్యలు తీసుకోలేదు. పైగా ఓటు బ్యాంకు రాజకీయాలతో నిందితులను వెనుకేసుకు వచ్చారు. బాంగ్లాదేశ్ నుంచి కొనసాగుతున్న అక్రమ వలసలను అరికట్టకపోగా, వారి ఓట్ల కోసం రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఇప్పించారనే ఆరోపణలు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్నాయి. మమత హిందుత్వం విషయంలో విషం కక్కడం కొత్తేమీ కాదు.

మరోవైపు కుంభమేళాకు అర్థమే లేదంటూ ఆర్జేడీ అధినేత, బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ తన నోటి దురద తీర్చుకున్నారు. ఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాట ఘటనపై స్పందిస్తూ కుంభమేళా పనికిరానిదని వ్యాఖ్యానించారు.

**పవిత్ర స్నానాలపై కాంగ్రెస్ అక్కసు**

దేశ వ్యాప్తంగా ప్రాంతాలు, కులాలు, రాజకీయాలకు అతీతంగా కుంభమేళాకు తరలి వెళ్లి పుణ్య స్నానాలు చేశారు. కానీ కాంగ్రెస్ అగ్రనేతలు దీనికి దూరంగా ఉండిపోయారు. "రాహుల్ గాంధీ తరచుగా రాయ్‌బరేలికి వెళ్తారు. కానీ ఆయన ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా జరిగే ప్రదేశానికి వెళ్లలేకపోయారు. ఇది కేవలం 2 గంటల రెండు నిమిషాల ప్రయాణ సమయంతో 120 కి.మీ. దూరంలో ఉంది" అని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి విమర్శించారు. రాహుల్ కుటుంబం మొత్తం హిందూ మతాన్ని వ్యతిరేకిస్తుంది. వారు అయోధ్యలో వివాదస్పదకట్టడం మసీదుకు మూడుసార్లు వెళ్లారు కానీ రాముడి ఆలయంలో




శ్రీరాముని దర్శనం కోసం వెళ్లలేదు అని ఆరోపించారు. ఇక కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అయితే "గంగలో మునిగినంత మాత్రానా పేదరికం తొలగిపోతుందా, తినేందుకు భోజనం దొరుకుతుందా" అంటూ వ్యాఖ్యానించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కుంభమేళాలో పవిత్ర స్నానం చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. ఖర్గే హిందువుల మనోభావాలను దెబ్బతీశారంటూ ఓ న్యాయవాది ముజఫర్‌పూర్ కోర్టుకు వెళ్లి పిటిషన్ దాఖలు చేశారు.

**వారివి బానిస మనస్తత్వాలు: మోదీ**

మహా కుంభమేళాపై విపక్షాలు చేస్తున్న విమర్శల పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో స్పందించారు. బానిస మనస్తత్వాలు ఉన్నవారే ఇలా హిందూ మత విశ్వాసాలపై దాడి చేస్తుంటారని మండిపడ్డారు. మన నమ్మకాలు, మన దేవాలయాలను, మన సంస్కృతిని, మన సిద్ధాంతాలపై దాడి చేస్తుంటారని అన్నారు.

విదేశీ మద్దతు ఉన్న కొందరు నేతలు హిందూ మతాన్ని వెక్కిరిస్తుంటారని, తప్పుబడు తుంటారని, దేశాన్ని బలహీనపర్చేందుకు ప్రయత్ని స్తుంటారని మోదీ ధ్వజమెత్తారు. ప్రజల మధ్య చీలికలు తీసుకురావడమే వారి పని. మన దేశాన్ని కుంగదీసేం దుకు అనేక విదేశీ శక్తులు ప్రయత్ని స్తున్నాయంటే... ఇలాంటి వారు అండగా ఉండడం వల్లే అంటూ మోదీ విమర్శించారు. మహా కుంభమేళా వంటి భారీ కార్యక్రమం ప్రతి ఒక్కరినీ విస్మయానికి గురి చేయడంలో ఆశ్చర్యమేమీ లేదని, అది ఐక్యతా చిహ్నంగా భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని మోదీ వివరించారు.



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్

# కులగణన సర్వేలో ఘోర వైఫల్యం

సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే.. కాంగ్రెస్ ప్రభుత్వం ముద్దుగా పిలుచుకున్న పేరు 'కులగణన' సర్వే. కులగణన సర్వే చేపడతామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచా ఎంతో అట్టహాసంగా, ఆర్భాటంగా చెబుతూ వచ్చింది. రాష్ట్రంలో ఏ కులంవారు ఎంత మంది ఉన్నారు? వారి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయి? అన్నది తెలుసుకోవడం లక్ష్యంగా ఈ ప్రక్రియ చేపట్టినట్లు ప్రకటించింది. తొలి విడతలో 50 రోజుల పాటు ఈ సర్వే నిర్వహించింది. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అదే పనిమీద ఉన్నా సర్వే విజయవంతం కాలేదు. పైగా దీనిమీద వచ్చినన్ని విమర్శలు, ఇప్పటివరకు కాంగ్రెస్ సర్కారుపై ఏ అంశంలోనూ రాలేదనే చెప్పాలి.

తెలంగాణలో వెనుకబడిన తరగతులు వారి కోసమే కులగణన సర్వే చేపట్టామని, ఇది దేశంలోనే సాహసోపేత నిర్ణయమని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ పార్టీ ఆర్భాటంగా ప్రకటించింది. సర్వే ప్రారంభానికి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని పిలిపించి భారీ బహిరంగ సభ నిర్వహించింది. కులగణన ప్రభుత్వ కార్యక్రమ మైనప్పటికీ సంబంధిం చిన సమీక్షా సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు భాగస్వామ్యం కల్పించింది. కానీ, హంగులు, ఆర్భాటాలు ఎక్కువై.. ఫలితాల విషయంలో చతికిల పడింది.

కుల గణన సర్వే మొదటి దశలో వందశాతం పూర్తి కాకపోవడం, విపక్షాల నుంచి, చివరకు లబ్ధి కలిగిస్తామన్న బీసీ సామాజిక వర్గాల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. దాంతో ప్రభుత్వం రెండవసారి అవకాశం కల్పించింది. అయితే ఈ విడతలో మరింతగా పరువు పోయినంత పనయ్యింది. కొంత మంది రాజకీయ నాయకులు కావాలనే సర్వేలో పాల్గొనకపోవడం, తమ వివరాలు ఇవ్వక పోవడం వంటివి చోటు చేసుకున్నాయి. వివరాల సేకరణలో భాగంగా ప్రభుత్వం పలు రకాల అవకాశాలు ఇచ్చింది. ఎన్యూమరేటర్లు ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయడం, ప్రజలు ఆన్‌లైన్‌లోనే వివరాలు నమోదు చేసుకోవడం, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయడం వంటివి చేపట్టింది. టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేస్తే అధికారులే ఇంటికి వచ్చి సర్వే వివరాలు నమోదు చేసుకుంటారని ప్రకటించింది. ప్రజా పాలన కేంద్రాల వద్ద సర్వే ఫారం నింపి ఇవ్వొచ్చు. అంతేకాదు.. ఇంటి దగ్గరే సర్వే ఫారమ్‌లో వివరాలన్నీ ఎవరికి వాళ్లే నమోదు చేసుకొని.. ప్రజా పాలన కేంద్రాల్లో ఇవ్వొచ్చు. ఇంటిదగ్గర సర్వే ఫారం నింపడానికి వీలుగా ఇంటర్నెట్‌లో ఆ సర్వే ఫారాలు అందుబాటులో ఉంచింది ప్రభుత్వం. కాని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల నుంచి పెద్దగా స్పందన లేదు. అటు.. ప్రజల నుంచి కూడా సర్వేలో పాల్గొనాలన్న ఆసక్తి అసలు కనిపించలేదు. ప్రధానంగా రాజధాని నగరం హైదరాబాద్‌లో మరీ చప్పగా సాగిందని చెప్పొచ్చు.

గత యేడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో మొదటి విడత సర్వే పూర్తయిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 3.56 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదనిలెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని కుటుంబాల్లో ఇది 3.1 శాతం. ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని సంపూర్ణంగా విజయవంతం చేయాలన్న లక్ష్యంతో మరోసారి అవకాశం ఇచ్చినా, స్పందన నామమాత్రమే. కేవలం 18,539 కుటుంబాలు మాత్రమే వివరాలు నమోదు చేసుకున్నాయి. మొత్తం మీద కులగణన ప్రక్రియ పూర్తయినట్లు ప్రకటన వెలువడింది.

కులగణన సర్వే ప్రారంభానికి ముందు రాష్ట్రంలో మొత్తం 1,15,71,457 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బందిని, ఎన్యూమరేటర్లను నియమించింది. మొదటి విడతగా గత ఏడాది నవంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు నిర్వహించిన సర్వేలో 96.9 శాతం (1,12,15,134) కుటుంబాలు వివరాలు నమోదు చేయించుకున్నాయి. ఆ సమయంలో ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా 3,56,323 కుటుంబాలు.. అంటే.. 3.1 శాతం మిగిలిపోయినట్లు తేల్చింది. వారి వివరాలను కూడా నమోదు చేసే లక్ష్యంతో కులగణన రెండో విడతగా ఫిబ్రవరి 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సర్వే చేపట్టింది.

గత ఏడాది నవంబర్ 6వ తేదీ నుంచి 50 రోజుల పాటు (డిసెంబరు 25వ తేదీ వరకు) నిర్వహించిన సర్వేలో నమోదైన వివరాన్నిటిని క్రోడీకరించి కంప్యూటరైజ్ చేశారు. సంబంధిత సమగ్ర నివేదిక ప్రభుత్వానికి చేరింది. దీంతో, ఫిబ్రవరి 4వ తేదీ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణ సర్వేనివేదికను ప్రకటించారు. 'రాష్ట్రంలో గుర్తించిన మొత్తం 1,15,71,457 కుటుంబాలకు గాను 1,12,15,134 కుటుంబాలను సర్వే జరిగింది. అంటే 96.9 శాతం సర్వే పూర్త యింది. ఇంకా 3.1 శాతం అంటే.. 3,56,323 కుటుంబాలను సర్వే చేయలేదు'అని చెప్పారు. రెండో విడత సర్వేకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కూడా సాధ్యమైనంత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ, కింది స్థాయిలో ఈ ఆదేశాలు అస్సలు అమలు కాలేదనే చెప్పుకోవచ్చు. ప్రభుత్వం రెండో విడత సర్వే కోసం కల్పించిన మూడు ఆప్షన్లను పరిశీలిద్దాం...

**టోల్‌ఫ్రీ నెంబర్**

ప్రభుత్వం ప్రకటించిన టోల్ ఫ్రీ నంబర్ 040-21111111కు ప్రజలు ముందుగా రాష్ట్రంలోని ఏ



గత ఏడాది నవంబర్ 6వ తేదీ నుంచి 50 రోజుల పాటు (డిసెంబరు 25వ తేదీ వరకు) నిర్వహించిన సర్వేలో నమోదైన వివరాన్నిటిని క్రోడీకరించి కంప్యూటరైజ్ చేశారు. సంబంధిత సమగ్ర నివేదిక ప్రభుత్వానికి చేరింది. దీంతో, ఫిబ్రవరి 4వ తేదీ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణ సర్వేనివేదికను ప్రకటించారు. 'రాష్ట్రంలో గుర్తించిన మొత్తం 1,15,71,457 కుటుంబాలకు గాను 1,12,15,134 కుటుంబాలను సర్వే జరిగింది. అంటే 96.9 శాతం సర్వే పూర్త యింది. ఇంకా 3.1 శాతం అంటే.. 3,56,323 కుటుంబాలను సర్వే చేయలేదు'అని చెప్పారు.



ప్రాంతం నుంచైనా కాల్ చేసి, కులగణనలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పాలి. సర్వే జరిగినన్ని రోజులు ఈ టోల్ ఫ్రీ నెంబర్ అందు బాటులో ఉంటుంది. కాల్ ఎవరు చేశారో.. వాళ్లు ఇచ్చిన వివరాల ఆధారంగా ఎన్యూమరేటర్లే వాళ్ల ఇంటికి వెళ్లి సర్వే ఫారంలో వివరాలు నమోదు చేసుకుంటారు.

**ప్రజా పాలనా సేవా కేంద్రాలు**

గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఎంపీడీఓ కార్యాలయాల్లో, పట్టణ ప్రాంతాల్లో అయితే వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలనా సేవా కేంద్రాలకు ప్రజలు వెళ్లి తమ వివరాలను అందించాలి. మొదటి విడతలో సర్వేకు సంబంధిం చిన శిక్షణ పొందిన సిబ్బందిని ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. సర్వే ఫారాలను నింపడంలో ప్రజలకు వీళ్లు సహకరించా లని ఆదేశాలిచ్చారు.

ఇంట్లోనే వివరాలు నమోదు http// seeepcsurvey.cgg.gov.in అనే వెబ్‌సైట్ నుంచి సర్వే ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని.. ఆ ఫారంలో తమ కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలను రాసి.. ఆ ఫారాన్ని దగ్గరలోని ప్రజా పాలనా సేవా కేంద్రంలో అందించాలి.

ఇలా.. ప్రభుత్వం మూడు రకాల ఆప్షన్లు ఇచ్చి రెండో విడత సర్వేలో పూర్తి వందశాతం వివరాల నమోదు పూర్తవుతుందని ఆశించింది. కానీ, అనుకున్న మాదిరిగా జరగలేదు. రెండు విడతల్లో నిర్వహించిన సర్వేల్లో చూసుకుంటే ప్రభుత్వం ప్రకటించిన మొత్తం కుటుంబాల్లో 97.08శాతం కుటుంబాలే సర్వేలో పాల్గొన్నట్లు తేలింది. దీనిని బట్టి చూస్తే.. రాష్ట్రంలో ఇంకా సర్వేలో పాల్గొనని, వివరాలు వెల్లడించని కుటుంబాల సంఖ్య 3,37,964 గా తేలింది.


కులగణన రెండో విడత సర్వేలో నమోదైన 18,539 కుటుంబాలను కూడా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేశారు. దీంతో, రాష్ట్రంలోని కులాల లెక్కల్లో స్వల్పంగా తేడా ఏర్పడే అవకాశం ఉంది. తొలి విడత సర్వేలో ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక మేరకు రాష్ట్రంలో ఎస్సీల జనాభా 17.43 శాతం (61,84,319), ఎస్టీల జనాభా 10.45 శాతం (37,05,929 ), బీసీల జనాభా 46.25 శాతం (1,64,09,179) ఉన్నట్టు తేల్చారు. వీరితో పాటు.. మొత్తం ముస్లిం జనాభా 12.56 శాతం (44,57,012) కాగా ఇందులో బీసీ ముస్లింల జనాభా 2.48 శాతం (8,80,424), ఓసీ ముస్లింల జనాభా10.08 శాతం (35,76,588), ఇతర ఓసీల జనాభా 13.31 శాతం (44,21,115)గా ఉన్నాయి. రెండో విడత సర్వే వివరాలను కూడా క్రోడీకరిస్తే.. ఈ లెక్కల్లో స్వల్పంగా మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది.

ఇక, ప్రధాన ప్రతిపక్షం, గతంలో పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖరరావు, ఆయన కుమారుడు మాజీ మంత్రి తారక రామారావు, కేసీఆర్ మేనల్లుడు, మాజీ మంత్రి హరీష్‌రావు వంటి వాళ్లు రెండో విడత సర్వేలో కూడా తమ వివరాలు నమోదు చేసుకోలేదు. వాస్తవానికి తొలి విడత సర్వే పూర్తయిన తర్వాత వీళ్లు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీసీల లెక్కలన్నీ తప్పులని పదే పదే ఆరోపణలు చేయగా ప్రభుత్వం వాటిని దీటుగా తిప్పికొట్టింది. అసలు సర్వేలో పాల్గొనని వాళ్లకు విమర్శించే అర్హత లేదంటూ ప్రభుత్వం ఎదురు దాడికి దిగడంతో.. రెండోసారి సర్వే చేయిస్తే.. తాము వివరాలు నమోదు చేయించుకుంటామని బీఆర్ఎస్ ముఖ్య నేతలు ప్రకటించారు. అయినా బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు మాత్రం సర్వేలో పాల్గొనలేదు. తమ వివరాలు వెల్లడించలేదు.

ఇక, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2014లో బీఆర్ఎస్ ఇదే మాదిరిగా సమగ్ర కుటుంబ సర్వే పేరుతో ఒక్కరోజు సర్వే చేపట్టి.. కనీసం ఆ సర్వే వివరాలు కూడా బయట పెట్టలేదు. ఆ వివరాలన్నీ కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికే చేరాయన్న విమర్శలు ఇప్పటికీ ఉన్నాయి. ఇక, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే పేరుతో అదే స్థాయిలో సర్వే చేపట్టింది. కానీ, అమలులో మాత్రం బొక్క బోర్లా పడింది. రెండుసార్లు సర్వే చేసినా విజయవంతం కాకపోవడంపై పలు రకాల విశ్లేషణలు సాగుతున్నాయి.

**సుజాత గోపగోని**

**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**





# వాళ్లని రానివ్వం.. ఎందుకంటే?

మహారాష్ట్రలో తాజాగా ఒక వివాదానికి తెర లేచింది. అక్కడ హిందువులు నిర్వహించే ఒక ఉత్సవం కొద్దిరోజుల పాటు జరుగుతుంది. అందులో వ్యాపారాలు చేయడానికి తాము ముస్లింలను అనుమతించడం లేదు అని స్థానికులంతా తీర్మానం చేశారు. ఎందుకు? ఆ ఉత్సవం సందర్భంగా కొన్ని ఆచారాలను తాము పాటిస్తామనీ, ముస్లింలు పాటించరనీ కాబట్టి తాము వారిని ఉత్సవంలోకి అనుమతించరాదని తీర్మానించామని అంటున్నారు ఆ ప్రాంత ప్రజలు.

అహల్యానగర్ జిల్లా, మాఢీ గ్రామంలో మాఢీచీ యాత్ర జరుగుతుంది. హోలీ రోజున మొదలై గుఢి పాడ్వ (మరాఠీల ఉగాది) వరకు నిర్వహిస్తారు. ఈ యాత్రలోకే ముస్లిం వ్యాపారులను అనుమతించ బోమంటూ ఆ గ్రామ ప్రజలు చేసిన తీర్మానం సర్పంచ్ సంజయ్ మర్కడ్, గ్రామ డెవలప్‌మెంట్ అధికారి అనిల్ ల్వాండే సంతకాలతో వెలువడింది. ఆ తీర్మానంలో ఏం ఉంది? 'ముస్లిం సమాజానికి చెందినవారు యాత్ర సమయంలో గ్రామస్థులు పాటించే ఆచారాలను పాటించరు. కాబట్టి మాఢీచి యాత్రలో వారికి ప్రవేశం లేదు' అని పేర్కొన్నారు. దీని వెనుక పరమార్థాన్ని ఒక సీనియర్ అధికారి మీడియాకు తెలియచేశారు. యాత్ర సాగే అన్ని రోజులు ప్రజలు మౌనం పాటిస్తారు. ఉపవాసాలు చేస్తారు. ఆఖరికి పెళ్లిళ్లు కూడా చేయరు. క్షవరాలకు కూడా వెళ్లరు. వీటి గురించి ముస్లింలకు తెలుసు. అయినా పాటించరు అని చెప్పారాయన. దీని మీద ఇప్పుడు జిల్లా యంత్రాంగం దర్యాప్తునకు ఆదేశించింది.

# అమెరికా జైళ్లలో

సీబీఎస్ న్యూస్ అనే మీడియా సంస్థ ఉంది. అది సీబీఎస్ మార్నింగ్స్ అనే శీర్షికను వెలువరిస్తూ ఉంటుంది. ఆ శీర్షిక కింద ఫిబ్రవరి 28న వచ్చిన కార్యక్రమం కాస్త విస్తుగొలిపే విధంగానే ఉంది. అదేమిటంటే, అమెరికా జైళ్లలో ఎక్కడ చూసినా నెలవంకేనట. అంటే ముస్లింల నెలవంక. అమెరికా జైళ్లలో ప్రతి ఏటా వందల సంఖ్యలో ఖైదీలు ఇస్లాంలోకి మారిపోతున్నారట. త్యాబా ఫౌండేషన్ అనే సంస్థ అమెరికా జైళ్లలో ఉన్నవారికి ఇస్లాం విద్యను అందించే పనిని చేపట్టింది. ఈ



కార్యక్రమాన్ని మొదలు పెట్టింది కూడా ఆ సంస్థే. రెమినౌర్ దాని సంచాలకుడు. ఇస్లాంను పాటించడం, దానిలోని ఆచరాలు, వాటిని అనుసరించే విధానం ఏమిటో ఎలాగో తమకు తెలియచేయవలసిందని జైళ్ల నుంచి కోరుతున్న వారి మెసేజ్‌లతో తన ఫోన్ నిండిపోతున్న దని చెబు తున్నాడతడు. అమెరికాలో ఉన్న జైళ్లన్నింటి నుంచి ఇలాంటి మెసేజ్‌లు కుప్పలు

# 'మల్లికార్జున ఖర్గే పేరు



కాంగ్రెస్ పార్టీ మౌలిక విలువలని (ఉన్నాయా ఏమిటి?) కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మైలపరిచారంటూ, మంట కలిపేశా రంటూ ఆ పార్టీలో ఒక వర్గం బాగా దుఃఖపడిపో తోంది. ఇంతకీ డీకే చేసిన అంతటి అప్రాచ్యపు పని ఏమిటి? మహాకుంభమేళాకు వెళ్లడం, శివరాత్రికి సద్గురు జగ్గీ వాసుదేవ్ పిలిస్తే ఆయన ఆశ్రమానికి వెళ్లడం. దీనికి కాస్త దీటుగానే డీకే స్పందించారని చెప్పాలి. 'ఔను, నేను హిందువును. పుట్టుకచేత హిందువును. నేను హిందువుగానే మరణిస్తాను. కానీ అన్ని మతాల పట్ల గౌరవ భావంతోనే ఉంటాను. మా పార్టీ కూడా అంతే. మా పార్టీ అధ్యక్షుడి పేరు ఏమిటి? మల్లికార్జున ఖర్గే. మల్లికార్జునుడంటే ఎవరో కాదు, శివుడే కదా! మరి ఆయన పేరు మార్చుకోవలసి ఉంటుందా?' అన్నారు. శివరాత్రి ఉత్సవాల కోసం ఈషా ఫౌండేషన్ తనను ఆహ్వానించినందుకే వెళ్లానని చెప్పారాయన. వాసుదేవ్ ఆశ్రమం కోయంబత్తూరులో ఉన్నా, ఆయన మైసూరు వారు. ఆయన చాలా గొప్ప వ్యక్తి. ఆయనను విమర్శించేవాళ్లు చాలామంది ఉండొచ్చు. అయినా ఆయన జ్ఞానం చాలా గొప్పది అన్నారు డీకే. అయినా డీకే కాంగ్రెస్ వాళ్లకి బొత్తిగా నచ్చని వ్యాఖ్యలు చేశారు. మహాకుంభమేళా వెళ్లినందుకు చాలామంచి అనుభూతి పొందాననీ, అక్కడి ఏర్పాట్లు కూడా అద్భుతమనీ అన్నారు. అంతగా ఏర్పాట్లు చేయడం అంటే చిన్న విషయం కాదని కూడా తేల్చి చెప్పారు. కొన్ని పొరపాట్లు జరిగితే జరగొచ్చు. అది రైళ్లతో వచ్చిన ఇబ్బంది. అయినా నేను వాటిని తప్పు పట్టను అనే డీకే చెప్పారు. కాంగ్రెస్ దృష్టిలో ముమ్మాటికి ఇది అపరాధమే మరి!

ఇంతకీ డీకే కాంగ్రెస్ పార్టీ మౌలిక విలువలని

# దూరిన నెలవంక

తెప్పలుగా వచ్చి పడుతున్నాయంటున్నాడతడు. నిజానికి ఆ ఫౌండేషన్‌ను 15 ఏళ్ల క్రితం ముస్లిం ఖైదీల కోసం ప్రారంభించారు. కానీ ఇప్పుడు దాని విస్తృతి బాగా పెరిగిపోయింది. వారి అవసరాల మేరకు తమ విద్యా కార్యక్రమాన్ని బాగా విస్తరించామని రెమి నౌర్ చెబుతున్నాడు. ఈ 15 సంవత్సరాలలో ఆ ఫౌండేషన్‌కి ఇస్లాం, దాని అనుసరణ గురించి 13,000 మందికి బోధించింది. అందులో ఇస్లాం స్వీకరించడానికి 90 శాతం ఇప్పుడు సిద్ధంగా ఉన్నారట. తెలిసో తెలియకో అసలు విషయం కూడా అతడు కక్కేశాడు. జైలు గోడలు తమను ఆపలేవన్న నమ్మకాన్ని తమ విద్య ఇస్లాం ఖైదీలలో రేకెత్తించిం దని చెప్పాడు. హత్య కేసులో పట్టుబడి 30 ఏళ్ల జైలు శిక్ష పడిన మహమ్మద్ అమీన్ ఆండర్సన్ అనే ఖైదీ రెండేళ్ల శిక్షాకాలం తరువాత ఇస్లాం స్వీకరించాడట. అతడు ఇస్లాం స్వీకరించడానికి చాలా కారణాలు ఉన్నా, ఆధ్యాత్మిక స్వేచ్ఛ అందులో మొదటిదని రెమి భాష్యం చెబుతున్నాడు. ఇక్కడ ఆండర్సన్ నేపథ్యం కూడా కాస్త తెలుసుకో వాలి. ఇతడి అసలు పేరు క్రిష్టోఫర్ ఆండర్సన్. ఫిలడెల్ఫి యాకు చెందినవాడు. ఇతడి తండ్రి మతబోధకుడే అయినా, ఆండర్సన్ మాత్రం చట్ట విరుద్ధమైన, అనైతిక పనులు చేయడం మొదలు పెట్టాడు. ఇప్పుడు మానవత్వం పట్ల తనలో ఒక భావనను కలగచేసినది ఇస్లాం అంటున్నాడు.


# మార్చుకుంటారా?'

మంట కలిపారని ఆరోపించినవారు ఎవరు? ఏఐసీసీ కార్యదర్శి పీవీ మోహన్. ఈ మోహన్ అనే వ్యక్తి ట్వీట్ చూస్తే కుంభమేళా అనేది బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాళ్ల కార్యక్రమమని భావించేటంతటి అజ్ఞానం కనిపిస్తున్నది. రాహుల్ గాంధీని నిరంతరం ఎద్దేవా చేసే వాళ్ల నుంచి ఆహ్వానం రావడం, దానికి సెక్యులరిస్టు పార్టీ అయిన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు వెళ్లడం కార్యకర్తలను పెడతోవ పట్టిస్తుందని మోహన్ ఉవాచ. జగ్గీ భావాలు కూడా ఆర్ఎస్ఎస్, బీజేపీలకి దగ్గరగానే ఉంటాయి కదా అంటూ తన ప్రకటనకు ముక్తాయింపు కూడా ఇచ్చాడు కాంగ్రెస్ మోహనుడు. డీకే గుడులూ గోపురాలూ తిరిగితే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ ఆయన ఒక సెక్యులర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడని గుర్తు చేశారు. మిగిలిన అజెండాలు, విలువల మాటేమో కానీ, హిందూ ధర్మాన్ని ద్వేషించడమే ఆ పార్టీ ప్రస్తుత అజెండా.



# ఆయన ఎవరో తెలుసుకుందాం!


ప్రపంచంలో ఎక్కడైనా సాధారణంగా ఒక వ్యక్తి విజయానికి గీటురాళ్లుగా వారి విద్యార్హతలు, ఉద్యోగంలో ఉన్నత స్థానానికి చేరుకోవడం, ఇతర ప్రాపంచిక విజయాలను తీసుకుంటారు. ఇవన్నీ ఉన్నా కూడా ప్రద్యుమ్న భగత్ ప్రయాణం ఆధ్యాత్మికత వైపు సాగడం ఒక ప్రత్యేక ఉదాహరణ. బాప్స్ (బోచసన్వాసి అక్షర పురుషోత్తమ స్వామినారాయణ్ సంస్థ)లో సేవలు అందిస్తున్నారు. ఆయనది ఒక అద్భుత యాత్ర. ప్రద్యుమ్న న్యూజిలాండ్‌లోని ఆక్లండ్‌లో పుట్టారు. పదిహేనో ఏటనే గొప్ప వక్తగా పేర్గాంచారు. బోయింగ్, నాసా సంస్థలలో అవకాశం వచ్చింది. అయితే అవేమీ ఆయనను ఆకర్షించలేదు. అంతరిక్ష పరిజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానాల నుంచి ఆయన ఆధ్యాత్మిక చింతనవైపు చూశారు. ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మక బాప్స్‌లో చేరారు. దీక్ష తీసుకుని సాధు కేశవసంకల్పదాస్‌గా మారారు. జీవితంలో విజయం సాధించడం అంటే ఏమిటో ఆయన కొత్త రీతిలో ఆవిష్కరించారు. తన మనసు చెప్పినట్టు నడుచుకోగలడమే అసలైన విజయం.





# హిందువుల వైద్యం ఖర్చు ఇతర మతాలదా?

అస్సాంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వం. అలాంటిది అక్కడే పదో తరగతి ప్రశ్నపత్రంలో కనిపించిన ప్రశ్న సారాంశం చాలా విస్తుకొలిపేటట్టు ఉంది. ఇది సామాజిక శాస్త్రం ప్రశ్నపత్రం. 'గ్రామీణ ప్రాంతం దంబుక్‌లో ప్రభుత్వం ఆసుపత్రి ప్రారంభించింది అనుకుందాం. అది హిందువులకి ఉచితంగా వైద్యసేవలు అందిస్తుంది. అదే ఇతర మతాలకు చెందినవారు వారి వైద్య ఖర్చులు వారే భరించాలి. భారత్ వంటి దేశంలో ప్రభుత్వం అలాంటి పని చేయగలదా? నీ అభిప్రాయం తెలియచేయి!' అన్నదే ప్రశ్న సారాంశం.

కాబట్టి విద్యావేత్తలను ఇంకా నమ్మవలసిన అవసరం ఉందా? లేదంటే బీజేపీ ప్రభుత్వాలే ఇంకాస్త జాగరూకతతో ఉండాలా? ఈ ప్రశ్నతో ఉన్న ఆ ప్రశ్నపత్రం తరువాత సామాజిక మాధ్యమాలలో దర్శనమిచ్చింది. చాలామంది ప్రశ్న అడిగిన తీరును విమర్శించారు. ఇంకొందరు ఇదంతా విద్యకు మతం రంగు పులమడానికి చాప కింద నీరులా సాగుతున్న ప్రయత్నమని వ్యాఖ్యానించారు.



# నిండా మునిగిన పార్టీ నేత ఇంకా ఏం మునకలేస్తాడు?



కొందరు రాజకీయ నాయకుల చెణుకులు చిరకాలం గుర్తు పెట్టుకునేలా ఉంటాయి. కేంద్రమంత్రి, బిహార్ మాజీ ముఖ్యమంత్రి ఇటీవల ఒక చక్కని చెణుకు విసిరారు. మీడియాతో ఆయన సమావేశమైనప్పుడు ఒక విలేకరి ప్రశ్న అడిగాడు. రాహుల్ గాంధీ ప్రయాగరాజ్ వచ్చి, త్రివేణి సంగమంలో ఎందుకు మునగలేదు అన్నదే ఆ ప్రశ్న. అందుకు మాంఝీ ఇలా చెప్పారు. ఈ మధ్య రాహుల్ త్రివేణీ సంగమంలో మునక వేయలేదంటూ, హిందూ వ్యతిరేకి అంటూ బీజేపీలో కొందరు నేతలు అనడం తెలిసిందే. మాంఝీ వ్యాఖ్యకు ఆ నేపథ్యం కూడా తోడైంది. అయినా, రాహుల్‌ని సంగమంలో ఎందుకు మునగలేదని ప్రశ్నించడం అసంబద్ధం అని తేల్చారు మాంఝీ. ఎందుకూ అంటే, ఆయన పార్టీ కాంగ్రెస్ ఇప్పటికే నిండా మునిగి ఉంది కదా అన్నారాయన. మరి రాహుల్ మళ్లీ మళ్లీ ఎక్కడ మునుగుతాడు పాపం! అని ప్రశ్నించారు. నిజమే మరి! అయినా రాహుల్ గాంధీ స్టయిలే వేరు. జనవరిలో మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు జరిగింది. ఈ మధ్యకాలంలో ఆయన ఢిల్లీని వదిలిపెట్టలేదంటే అది వేరే విషయం. అలా అని చెప్పాపెట్టకుండా విదేశాలకు వెళ్లే తన శైలినీ ప్రదర్శించలేదు మరి! ఫిబ్రవరి 20-21 తేదీలలో ఆయన రాయబరేలీ వెళ్లారు గాని, ఓ అడుగు ఇటు ప్రయాగ్‌రాజ్‌కు వేయలేదు.

# కలకలం రేపుతున్న కాంగ్రెస్ మహిళా కార్యకర్త హత్య



హరియాణాలో కాంగ్రెస్ పార్టీ యువ కార్యకర్త హిమానీ నర్వాల్ హత్య సంచలనం రేపుతున్నది. 22 ఏళ్ల హిమానీ మృతదేహం మార్చి 1న రోహతక్ జిల్లాలోని ఒక బస్టాండ్‌లో దొరికింది. ఆమెను ఎవరో హత్య చేసి సూట్‌కేసులో పెట్టి ఆ బస్టాండ్‌లో పెట్టారు. హత్య వార్త బయటపడిన తరువాత తమ పార్టీకి చెందిన ఏ ఒక్క నాయకుడు తమను పరామర్శించ లేదని హిమానీ కుటుంబ సభ్యులు ఆరోపించడం విశేషం. హిమానీ తల్లి సవిత నర్వాల్ కాంగ్రెస్ పార్టీ మీద తీవ్ర విమర్శలు చేశారు. పార్టీలో పెరుగు తున్న ఆదరణ, ప్రముఖులతో పరచయాలు, భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీతో కలసి కనిపించడం వంటి విషయాలే తన కూతురు హిమానీ మరణానికి కారణమని, సొంత పార్టీలోనే ఆమెకు ఆగర్భ శత్రువులు తయారయ్యారని ఆమె తల్లి ఆరోపించారు. ఎన్నికలు, పార్టీ కలసి తన కూతురుని బలిగొన్నాయని ఆమె రోదించారు. హిమానీ రాహుల్ యాత్రలో ఆయనతో కలసి నడిచింది. ఎంతో పలుకుబడి ఉన్న హుడా కుటుంబంతో పరిచయం కలిగి ఉంది. ఇదంతా ఓర్వలేకే కొందరు శత్రువులు తయారయ్యారని సవిత ఆరోపించారు.

# ఒవైసీ హిస్టరీ ప్రొఫెసర్ అవతారం

ముస్లింల పాలనలో భారతదేశంలో కేవలం 80 ఆలయాలను మాత్రమే వారు ధ్వంసం చేశారట. అంతకు మించి ఒక్క ఆలయాన్ని కూడా ముట్టలేదట. ఇది ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఉవాచ. మీకెవరికైనా సందేహాలు ఉంటే అమెరికా చరిత్రకారుడు రిచర్డ్ ఎం ఈటన్ పుస్తకం తిరగేయమని కూడా సలహా ఇచ్చారాయన. నాలుగు వందల సంవత్సరాల క్రితం ఇక్కడ దేవాలయాలను ధ్వంసం చేశారంటూ ఎప్పుడు వీలైతే అప్పుడు వారు-విస్పృతార్థంలో బీజేపీవారు- మీడియా ముందు చెబుతూ ఉంటారని, వారంతా ఆ అమెరికా చరిత్రకారుడి పుస్తకం 'టెంపుల్ డెసిక్రేషన్ అండ్ ముస్లిం స్టేట్స్ ఇన్ మీడివల్ ఇండియా' చదవాలని హోంవర్క్ కూడా ఇచ్చారు ఒవైసీ. ఆ 80 ఆలయాల కూల్చివేత క్రీస్తుశకం 11వ శతాబ్దం, 16 శతాబ్దం మధ్యనే జరిగిందని కూడా ఒవైసీ మాస్టారు ఏఎన్ఐ వార్తా సంస్థతో చెప్పారు. మిగతా కాలమంతా ముస్లిం పాలకులు అసలు హిందూ ఆలయాలకేసి చూడలేదని ఆయన మనలని నమ్మించాలని తపన పడుతున్నారు. అంతేకాదు, ఉదారవాద, మార్క్సిస్టు చరిత్రకారులు చెప్పే పుష్యమిత్ర శుంగ కథను కూడా ఆయన గుర్తు చేశారు. పుష్యమిత్ర శుంగ అనేక బౌద్ధారామాలను ధ్వంసం చేశాడని ఒవైసీ చెప్పారు. పైగా పుష్యమిత్రుడి మీద ఎవరైనా సినిమా తీసే సాహసం చేయగలరా అంటూ సవాలు కూడా విసిరారు. చాళుక్యరాజు ఒకటో నరసింహవర్మ చాళుక్యుల రాజధాని వాతాపిలో ఉన్న గణేశ విగ్రహాన్ని తీసుకుపోయాడని, బోధివృక్షాన్ని శశాంక్ అనే పాలకుడు నరికిన సంగతి హ్యుయాన్‌త్సాంగ్ రాశాడని ఒవైసీ మాస్టారు పాఠం చెప్పారు. సరే, ఈటన్ అనే అమెరికా చరిత్రకారుడు రాశాడు కాబట్టి



## అర లక్షమంది తప్పిపోయారు.. కానీ!

రోజూ కోట్లలో జనం వస్తుంటే, కొందరు తప్పిపోయే అవకాశాలు చాలా ఎక్కువ. ప్రయాగ రాజ్‌లో జరిగిన మహాకుంభ్ పుణ్యస్నానాల కోసం ఆ 45 రోజులలో 54,357 మంది తప్పిపోయారు. భారత్‌లోని వివిధ రాష్ట్రాలకు, నేపాల్‌కు చెందిన వీరందరినీ మళ్లీ వారి కుటుంబీకులకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం క్షేమంగా అప్పగించింది. వీరిలో మహిళలు ఎక్కువగా ఉన్నారు. ఈ బాధ్యతను రాష్ట్ర పోలీసులు కూడా ఎంతో శ్రద్ధతో నిర్వహించారు. తప్పిపోయిన వారి కోసం మహాకుంభ్‌లో అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. అందులో ఒకటి డిజిటల్ పద్ధతిలో నడిచిన ఖోయా పాయా కేంద్రం. ఇది తప్పిపోయిన వారిలో దాదాపు 35,000 మందిని వెంటనే వారి కుటుంబీకుల దగ్గరకు చేర్చింది. ఇలాంటి కేంద్రాలు ఐదు ఏర్పాటు చేశారు. ఈ పనిలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా తమ వంతు సాయం అందించాయి.



మహమ్మదీయ పాలనలో 80 ఆలయాలు కూలాయన్న సంగతి ఒవైసీ ప్రగాఢంగా నమ్ముతున్నారు. మరి అదే అమెరికాకు చెందిన విల్ డ్యూరాంట్ అనే చరిత్రకారుడు రాసిన పుస్తకాలు కూడా ఒవైసీ చదివితే బావుంటుంది. ముస్లింల విధ్వంసం ఎంతో ఆ చరిత్రకారుడు కూడా వివరించాడు కదా! ఆ సంగతి మాత్రం ఒవైసీ నోటి నుంచి ఊడి పడదు. ఒవైసీ వంటివారు, మార్క్సిస్టులు, ఉదారవాదులు తిమ్మిని బ్రహ్మిని చేయాలని చూస్తారు. వాస్తవం వారికి అక్కరలేదు. ఈ దేశంలో నలభయ్ వేల దేవాలయాలు ముస్లింలు కూలగొట్టారని ఎన్నో ఆధారాలు ఉన్నాయి. పైగా వీటికి ఆధారాలు ముస్లిం పాలకుల ఆత్మకథలలోను, విదేశీయాత్రికులు రాసిన కథనాలలోను కనిపిస్తున్నాయి.

## హిందీ, హిందూ వ్యతిరేకత: ఓ అనంత ప్రహసనం




అదొక ఎడతెగని ప్రహసనం. కానీ చాలా క్రూరమైనది. అదే ద్రవిడ పార్టీల, ప్రధానంగా డీఎంకే హిందీ వ్యతిరేక వాదం. దీనికి తోడుగా తెచ్చుకుంటారు హిందూ వ్యతిరేకవాదం. ఆ రెండూ వేర్వేరు కాదనుకునే పశుప్రాయులు కూడా అందులో తక్కువేమీ కాదు. ఎడారి మతం క్రైస్తవంలో చేరి కూడా సనాతన ధర్మాన్ని విమర్శించే నికృష్టులు డీఎంకేలో ఉన్నారు. అది ఎవరో కాదు, సాక్షాత్తు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కొడుకు ఉదయనిధి. ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేత ఇబ్బడిముబ్బడిగా ఉన్నందున పాత అస్త్రం తిరిగి బయటకు తీసింది డీఎంకే. అదే తమిళుల మీద 'ఢిల్లీ' హిందీ రుద్దడం. కొత్త విద్యావిధానం పేరుతో తమిళుల మీద హిందీని రుద్దాలని కేంద్రం చూస్తున్నదని, దీనిని వ్యతిరేకిస్తామని, ఉద్యమిస్తామని పాచిపాట పాడుతున్నారు ఎంకే స్టాలిన్. తల్లి కుక్క భౌమంటే పిల్లకుక్కలు కూడా రాగం అందుకున్నట్టు హిందీలో రాసి ఉన్న పేర్ల మీద తారు పూస్తామని ఆ పార్టీ కార్యకర్తలు బయలుదేరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బాగా అందుబాటులోకి వచ్చిన వేళ రెండు భాషలు చాలవా, ద్విభాషా సూత్రం చాలదా అన్నది స్టాలిన్ ప్రశ్న. ఆ భాషలు తమిళం, ఇంగ్లిష్. ఈ హిందీ రుద్దడం వెనుక ఉన్నది సంస్కృతం అమలులోకి తేవాలన్న దుర్బుద్ధి మాత్రమేనని కూడా ఈ మధ్య స్టాలిన్ కనుగొన్నాడు.

విద్యావిధానంలో త్రిభాషాసూత్రం ఎన్‌డీఏ లేదా బీజేపీ ప్రభుత్వం తెచ్చినదేమీ కాదు. 1961లోనే విద్యావిధానం గురించి చర్చ జరిగినప్పుడు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఆ తరువాతే ఆ సూత్రాన్ని అమలులోకి తెచ్చారు. 1968లో హిందీయేతర భాషలు ఉన్న రాష్ట్రాలలో హిందీని బోధించాలని నిర్ణయించారు. ఊరంతా ఒకదారి, ఉలిపికట్టెది మరొక దారి అన్నట్టు ఆ తరువాత నుంచి తమిళనాడులో ద్విభాషా సూత్రం అమలులోకి తెచ్చారు. హిందీ పట్ల ద్వేషాన్ని బాగా నూరిపోశారు.

డీఎంకే ఏనాడూ ప్రజాస్వామ్యబద్ధంగా, జాతీయ స్ఫూర్తిగా అనుగుణంగా వ్యవహరించింది లేదు. అది ఈ దేశాన్ని గౌరవించే పార్టీ కాదు. ఒక సర్వే ప్రకారం భారతదేశంలో 54 శాతం ప్రజలు హిందీ మాట్లాడగలరు. అంతకంటే ఎక్కువ శాతం ఆ భాషను అర్థం చేసుకోగలరు. సమీప గతంలోనే అంటే 2001 జనాభా లెక్కల ప్రకారం చూసినా ఆనాడు ఉన్న 121 కోట్ల మందిలో 52 కోట్లు తాము మాట్లాడే భాష హిందీ అని తెలియచేశారు. అంటే 44 శాతం. మరి ఇంగ్లిష్ మాటేమిటి? 130 మిలియన్‌లు మాత్రమే మాట్లాడగలరు. కాబట్టి అనుసంధాన భాష హిందీ అవుతుందా? ఇంగ్లిషా? స్టాలిన్ లెక్క ప్రకారం ఇంగ్లిష్ అనుసంధాన భాష. కానీ ముస్లింలను బుజ్జగించడానికి మాత్రం ఉర్దూను నెత్తిన పెట్టుకోవడానికి ఈ స్టాలిన్ అనే విధ్వంసక శక్తి, అతడి పార్టీకి అభ్యంతరం లేదు. దేశంలో ఉర్దూ మాట్లాడేవాళ్ల సంఖ్య 5.07 కోట్లు. అంటే 4.19 శాతం. చాలాచోట్ల ముస్లింలు కూడా ఉర్దూ మాట్లాడరు. ఇక్కడ అర్ధమవుతుంది స్టాలిన్ దుర్బుద్ధి.

స్టాలిన్ రాజకీయాలు చేస్తున్నారే తప్ప, నిజంగా తమిళం మీద, తమిళుల మీద అభిమానంతో మాట్లాడడం లేదని జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు వంటివారు అంటున్నారు. తమిళనాడు నుంచి తెలివైన ఇంజనీర్లు తయారవుతున్నారు. వారు ఢిల్లీ, ముంబై వంటి ప్రాంతాలలో పనిచేయాలంటే హిందీ తప్పనిసరి. కాబట్టి హిందీని అంతగా ద్వేషించడం మంచిది కాదని హితవు చెబుతున్నారు. ద్రవిడ రాజకీయాలు ఒకప్పుడు తమిళం కోసమంటూ దేశ ఐక్యతకు ముప్పు తెచ్చే తీరులో వ్యవహరించాయి. ఇప్పుడు కుటుంబం కోసం స్టాలిన్ ఆ పని చేయడానికి సిద్ధపడుతున్నాడు. ఆ సంగతి తమిళులు, అక్కడి హిందువులు ఎంత తొందరగా గమనిస్తే అంత మంచిది. ★

కథ



'ఎంత దారుణం...!? ఎంత అన్యాయం...!? ఇంకెంత అక్రమం...!? వారి అక్రమాలకూ కండకావరానికి అడ్డే లేదా...? ఇంకా ఎన్నాళ్లు ఈ అజ్ఞాతవాసం! మా స్థానంలోకి వచ్చి మా మీదే పెత్తనం చెలాయిస్తుంటే..., ఇంకా ఎన్నాళ్లిలా చేతులు ముడుచుకొని చేతకానివాళ్లలా...? ఆ తెల్లదొరల పీచమణిచే రోజు ఎప్పుడొస్తుంది?' ఆమె మస్తిష్కంలో ప్రశ్నలు తొలిచేస్తున్నాయి. అవి ప్రశ్నలు కాదు ఆక్రోశం... వేయితలల ఆదిశేషునిలా బుసలు కొడుతోంది.

ఒక చిన్న గదిలో అస్తిమితంగా పచార్లు చేస్తోంది మహారాణి నాచియార్. ఆమె అంతరంగం అల్లకల్లోలంగా ఉంది. హృదయం భగభగ మండుతోంది. అంతకంతకు ఆమెలో ప్రతీకార జ్వాల దావానలంలా ఎగిసిపడుతోంది.

ఆ మధ్యాహ్నం తన అనుయాయులు చెప్పిన వార్త చెవుల్లో గింగురుమంటోంది. కళ్లు క్రోధంతో ఎరుపెక్కి అగ్ని గోళాలను తలపిస్తున్నాయి. కనులు మూసుకుంటే ఆ వార్త దృశ్యంగా కళ్లల్లో కదులుతోంది.

* * *

"మహారాణి... మహారాణి..."

"ఏం సమాచారం... ఎందుకంత ఆదుర్దాగా ఉన్నారు?" అడిగింది నాచియారు రాణి.

"మహారాణి ఒక దుర్వార్త..."

"హు...! మనమున్న పరిస్థితిలో శుభవార్తలెక్కడివి... అన్నీ దుర్వార్తలే కదా... చెప్పండి. విషయమేంటి?" గంభీరంగా వచ్చింది నాచియార్ స్వరం.

"మహారాణి! మన... ఉడైయాళ్ ఆర్కాట్ నవాబు సైన్యానికి చిక్కిపోయింది కదా...! ఎన్ని చిత్రహింసలు పెట్టినా మీ జాడ బయటపెట్టలేదని ఉక్రోషంతో ఈ రోజు..."

"ఊ... ఏమయింది? ఈ రోజు..."

"ఈ రోజు... ఉడైయాళ్ శిరస్సు ఖండించి ప్రదర్శనకు పెట్టాడు నవాబు" గద్గదస్వరంతో చెప్పాడు చారుడు.

'భగవాన్!' కళ్లు మూసుకుంది నాచియార్. 'నమ్మినబంటు ఉడైయాళ్ నవాబు సైన్యానికి చిక్కి ఎంత నరకయాతన పడిందో, అజ్ఞాతంలో ఉన్న తన ఆచూకీ కోసం ఆమెను ఎన్ని చిత్రహింసలకు గురిచేసారో తను ఊహించగలదు. శత్రు సైన్యానికి చిక్కినవారి పరిస్థితి ఎంత హింసాత్మకంగా ఉంటుందో ఒక రాణిగా తనకు తెలియనిది కాదు. అంత హింసను భరించింది గాని తన ఉనికిని బయటపెట్టలేదు ఉడైయాళ్. ఆమె నుంచి ఏ రహస్యాలు రాబట్టలేమని తెలుసుకొని, విసిగిపోయిన నవాబు ఉక్రోషంతో ఆమె ప్రాణాలే తీసేసాడు'.

వార్త తెచ్చిన చారుడు వెళ్లిపోయినా ఆ ప్రభావం నుంచి బయటపడలేకపోతోంది నాచియార్. ఆమె మానసం ఎగిసిపడుతోంది. ప్రతీకారేచ్ఛతో ప్రజ్వరిల్లుతోంది.

'ఎంత కండకావరం! ఎక్కడో సముద్రాలకు ఆవలి తీరం నుంచి వర్తకం కోసమని వచ్చి ఇక్కడున్న కొందరు స్వార్థపరుల సాయంతో, నా దేశాన్నే కబలించి స్వాధీనం చేసుకొని, మా మీదే పెత్తనం చేస్తున్న ఈ తెల్లదొరలను ఏం చేయాలి!?

అవును స్వార్థంతో, అసూయతో ఉన్న కొందరు స్వదేశీ రాజులు ఆ విదేశీయులకు సాయపడి తమవారినే మట్టికరిపించే ప్రయత్నం చేస్తుంటే ఏమవుతుంది!? తన పరిస్థితి కూడా అదే కదా! తమిళ దేశంలో ఒక రాజ్యమైన శివగంగైకి రాజు తన భర్త ముత్తువడగనాథ పెరియ ఉదయ తేవర్. ఎప్పటి నుంచో తమ రాజ్యం మీద కన్నేసిన ఆర్కాట్ నవాబు స్వంతంగా తమ రాజ్యాన్ని చేజిక్కించుకునే సత్తాలేక, ఇప్పటికే ఇక్కడ స్థానం బలపరచుకున్న ఆంగ్లేయులతో చేతులు కలిపి, తమ రాజ్యంపై దండెత్తి మోసంతో తన భర్త ముత్తువడగనాథ పెరియ ఉదయ తేవర్ దైవదర్శనానికి నిరాయుధుడుగా వెళ్లిన సందర్భం కనిపెట్టి అతడిని మట్టుపెట్టి శివగంగై రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాదాన్ని గుర్తించిన తాను తమకు నమ్మకస్తులైన, మురుదు సోదరులుగా పేరు పడిన వెళ్లై మురుదు, చిన్న మురుదుల సహాయంతో తన కూతురితో పాటు ఈ దిండిగల్ అడవుల్లోకి వచ్చి తలదాచుకుంది. తనతో పాటు తమ రాజ్యానికి నమ్మిన బంట్లు కూడా కొందరు వచ్చారు. అలా వస్తున్నపుడు... అప్పుడు...మళ్లీ ఎలాగైనా ఈ ముష్కరులను ఓడించి తమ రాజ్యాన్ని దక్కించుకొని తీరుతానన్న తన పౌరుష ప్రతిజ్ఞ తెలుసుకొని ఆ దుర్మార్గులు ఎంత అపహాస్యం చేసారు...! ఒక ఆడది ఏం చేస్తుందన్న వారి ఎగతాళి గుర్తుకొస్తే ఇప్పటికి కూడా ఒళ్లు కుతకుతలాడిపోతుంది.

ఇక ఉపేక్షించి లాభంలేదు. త్వరపడాలి. ఆ మోసకారులకు, దుర్మార్గులకు, దోపిడీదారులకు తగిన బుద్ధి చెప్పాలి' దృఢ నిశ్చయంతో ముందుకు కదిలింది వేలు నాచ్చియార్. ప్రణాళిక సిద్ధం చేసింది.

* * *

తనకు, తన రాజ్యానికి నమ్మినబంట్లయిన కొందరి సహాయంతో సైన్యాన్ని కూడగట్టుకుంది నాచ్చియార్. కాని ఫిరంగులు, తుపాకులతో యుద్ధం చేసే ఆంగ్లేయులతో పోరాటానికి ఇవి సరిపోవు. ఇంకా బలమైన సైన్యాన్ని కూడగట్టాలి. అందుకే ఒక నిర్ణయానికి వచ్చింది.

"చూడండి ఆ ముష్కరులతో యుద్ధానికి మన ఆయుధాలు, బలగం సరిపోదు. అందుకే నేను హైదర్ అలీని కలిసి మాట్లాడి, వారి సాయం కోరాలను కుంటున్నాను" అంటూ అనుచరుల ముందు తన మనసులో మాట బయటపెట్టింది,

ఈ మాటలకు తెల్లబోయారు అనుచరులంతా.

# ధీర

మావూరు విజయలక్ష్మీ

"మహారాణీ! ఏం చెప్తున్నారు!? ఈ పరిస్థితిలో మీరు హైదర్ అలీని కలుసుకోవడం ఎంత ప్రమాదమో తెలుసా! కార్యం సఫలం చేసుకునే ఆత్రంలో మనం అజ్ఞాతంలో ఉన్నామన్న విషయం మరచిపోతున్నారా మీరు?" ఆందోళనగా ప్రశ్నించారు అనుచరులు.

"లేదు. పరిస్థితులన్నీ అంచనావేసే చెబుతున్నాను... ఇప్పుడు ఇంతకంటే మరో మార్గం లేదు"

"కావచ్చు మహారాణీ! కానీ, అజ్ఞాతంలో ఉన్న మిమ్మల్ని ఎలా బయటకు రప్పించాలా! ఎలా బంధించాలా! అని చూసే శత్రువుల గురించి కూడా లోచించాలి మనం. ఇదెంత ప్రమాదకరమైన పనో ఆలోచించండి!"

"మీ భయం నాకర్థమయింది. ఇలాంటప్పుడే మనం చాకచక్యంగా, ఒడుపుగా మన పని చక్కబెట్టుకోవాలి. లేదంటే మనం ఇలా ఎంతకాలం అజ్ఞాతంలో ఉన్నా ఏమీ సాధించలేం. విజయమో వీరస్వర్గమో అంటారు. కాని మనం మాత్రం విజయమే అని ముందుకు సాగిపోదాం. అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించడం ఎంత నిజమో... మనం మన రాజ్యాన్ని సాధించడం అంతే నిజం. అన్నీ కోల్పోయినా మన ఆత్మవిశ్వాసాన్ని కోల్పో కూడదు. అదొక్కటి ఉంటే మనం కోల్పోయిన వాటన్నిటినీ తిరిగి దక్కించుకోవచ్చు" దృఢంగా చెప్పింది రాణి నాచ్చియార్.

"మహారాణీ ఇప్పటికే ఎనిమిదేళ్ల అజ్ఞాతవాసం గడిపాం. ఇప్పుడు ఏమాత్రం తప్పటడుగు వేసినా చిక్కుల్లో పడతాం. పైగా మరోసారి ఆంగ్లేయుల ముందు తలవంచాల్సిన పరిస్థితి వస్తుంది. కాస్త యోచించండి".

"మీరందరూ నా మంచి కోరేవారు. నాకు హితులు. నమ్మకస్తులు. మీ భయం నాకర్థమైంది. కాని ఒక్కసారి ఆలోచించండి. ఈ పరిస్థితిలో మనముందున్న ఒకే ఒక్క అవకాశం ఇది. నిజమే! మీరన్నట్టు ఇది కాస్త ప్రమాదకరమైనదే. కాని పోరాటం లేకపోతే పురోగతి లేదు. గెలవకపోవడం ఓటమి కాదు, మళ్లీ ప్రయత్నించకపోవడమే ఓటమి. ప్రమాదానికి భయపడితే మనం పురోగమించలేం. మనం ప్రయత్నం మనం చేద్దాం. ఆ ప్రయత్నంలో అప్రమత్తంగా ఉందాం..."

ఆమె దృఢ నిర్ణయానికి అందరూ ఆమోద ముద్ర వేసారు. దిండిగల్‌లో ఆమె హైదర్ అలీని కలుసుకోవడా నికి ఏర్పాట్లు చేసారు.


* * *

"సలాం హైదర్ అలీ సాబ్" గౌరవ సూచకంగా అభివాదం చేసింది వేలు నాచ్చియార్.

"సలాం... మహారాణీ! నన్ను కలుసుకోవాలనుకున్న కారణం?" అడిగాడు హైదర్ అలీ.

ఏ విషయమైనా పూర్తిగా, వివరంగా తెలుసుకోవాలంటే మాతృభాషలో వింటేనే అది సాధ్యమవుతుంది. హైదర్ అలీ మాతృభాష ఉర్దూ. అందుకే వేలు నాచ్చియార్ తన సంభాషణ అంతా ఉర్దూ భాషలోనే కొనసాగిస్తోంది.

భారతదేశంలో ప్రస్తుతం ఆంగ్లేయులు సాగిస్తున్న అరాచకం పూర్తిగా వివరించింది. తమపై జరిగిన అన్యాయపు దాడి వివరించింది. ఆంగ్లేయుల అరాచకానికి అడ్డుకట్ట వెయ్యాలంటే దేశంలోని రాజులంతా ఏకం కావలసిన అవసరం నొక్కి



చెప్పింది. తన రాజ్యాన్ని తను దక్కించుకోవాలంటే తగినంత సైన్యం, ఆయుధాలు లేని మాకు మీ సాయం అవసరమని చెప్పింది.

సంభ్రమంగా వింటున్నాడు హైదర్ అలీ. ఒక దక్షిణాది వనిత ఇంత చక్కగా ఉర్దూ భాషలో ఎలా మాట్లాడగలుగుతోంది! అంతకంటే ముఖ్యంగా ఇంత ధైర్యంగా అంత పెద్ద రాజ్యానికి వ్యతిరేకంగా ఎలా పోరాటానికి సిద్ధమవుతోంది!? అని ఆశ్చర్య పోయాడు.

ఆ అనుమానానికి సమాధానం వేగుల ద్వారా దొరికింది హైదర్ అలీకి.

తమిళనాడులోని రామనాథపురం రాజు చెల్లముత్తు విజయ రఘునాథ సేతుపతి కుమార్తె ఈ నాచ్చియార్. రఘునాథ సేతుపతి, కూతురిని కొడుకులాగే పెంచాడు. యుద్ధవిద్యలతో పాటు తమిళ, ఇంగ్లీషు,ఫ్రెంచ్,ఉర్దూ భాషల్లో తర్ఫీదు ఇప్పించారు. అందుకే ఇప్పుడు హైదర్ అలీతో ఉర్దూలో ఇంత అనర్గళంగా మాట్లాడగలిగింది.

వేలునాచ్చియార్ మాటలతో హైదర్ అలీ ఆలోచనలో పడ్డాడు. 'నాచియార్ రాణికి సాయం చెయ్యడం ఆమెకే కాదు ఒక రకంగా తనకూ ఉపయోగకరమే. ఇప్పటికే ఉత్తరాదిలో గట్టి పునాది వేసి దక్షిణాదిలో కూడా ప్రాబల్యం సంపాదించే ప్రయత్నంలో ఉన్న ఆంగ్లేయులను దక్షిణాదిలో కట్టడి చెయ్యాలంటే ఇలాంటి ఐకమత్యం అవసరమే. పైగా ఆర్కాట్ నవాబు కూడా ఎగిరెగిరి పడుతున్నాడు. అతడికి బుద్ధి చెప్పాలని ఎప్పటినుంచో ఎదురు చూస్తున్నాడు తను. ఇప్పుడు సమయం వచ్చింది. అందుకే వేలునాచ్చియార్ రాణికి సహాయం చెయ్యడానికి సుముఖుడయ్యాడు.

''మహారాణీ! మీ ధైర్యసాహసాలు మాకు నచ్చాయి. మీకు సహాయం చెయ్యడానికి మేము సుముఖంగా ఉన్నాము. మీకు 5000 మంది సైనికులను సహాయంగా ఇస్తాము. మీరు మీ రాజ్యాన్ని దక్కించుకునే ప్రయత్నం చెయ్యండి. అన్నాడు.

''సంతోషం... ధన్యవాదాలు' చెప్పింది నాచ్చియార్ రాణి.

* * *

దళాలను విభజించి ఎవరు ఏ పని చెయ్యాలో... ఏవిధంగా కోటను ముట్టడించి ఆంగ్లేయులను మట్టికరిపించి కోటను స్వాధీనం చేసుకోవాలో పథక రచన చేస్తోంది నాచ్చియార్ రాణి. ఆమె చెబుతున్న ప్రతి అక్షరం శ్రద్ధగా వింటూ ఆకళింపు చేసుకుం టున్నది ఆమె అనుచరగణం.

"మన మహిళా దళానికి, రాజభక్తితో శత్రు రాజులు పెట్టే చిత్రహింసలకు కూడా వెనుకాడక రాజ్యం కోసం, తన రాణి కోసం ప్రాణాలను కూడా పణంగా పెట్టిన ఉడైయాల్ పేరు పెడుతున్నాను. కుయిలీ! దానికి నువ్వు అధ్యక్షురాలిగా వ్యవహరించాలి" చెప్పింది నాచ్చియార్.

"మహారాణీ! ఉడైయాల్ పేరు పెట్టడం వరకు సరైనదే. కాని...నన్ను అంత పెద్ద స్థానానికి..." మాట పూర్తి చేయలేక ఆగిపోయింది దళిత నాయకురాలు కుయిలీ.

''అవును కుయిలీ! ఈ స్థానానికి నువ్వు అర్హురాలివే. ఎన్నో క్లిష్ట సమయాల్లో నా ప్రాణానికి నీ ప్రాణం అడ్డం వేశావు. నీ స్వామిభక్తి, నిజాయతీ, అన్నిటినీ మించి నీ తెగువ, తెగింపు, వేగంగా పథక రచన చెయ్యగల సామర్థ్యం.. ఇవన్నీ నువ్వే దీనికి సరైన వ్యక్తివి అని చెబుతున్నాయి. రేపే మన దాడికి ముహూర్తం. అందరూ సిద్ధంగా ఉండండి. ఆంగ్లేయుల తుపాకులు, బాంబుల ముందు మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఈసారి ఎట్టి స్థితిలోనైనా మన కోటను మనం వశపరచుకోవాలి. అందరూ సిద్ధంగా ఉండండి. కోటలో రక్షణ కోసం చాలా పటిష్ఠమైన ఏర్పాట్లు చేశారని మన చారులు చెప్తున్నారు. మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. రేపే మన దండయాత్రకు ప్రారంభం. హైదర్ అలీ ప్రభువు ఇచ్చిన సైనిక సహాయంతో మనం చురుగ్గా ముందుకు వెళ్లగలం. సిద్ధంగా ఉండండి" చెప్పింది నాచ్చియార్ రాణి.

* * *

నాయకురాలు ఇచ్చిన స్ఫూర్తితో, ఓవైపు నాచ్చియార్ నమ్మకస్తులైన సైనికులు,మరోవైపు హైదర్ అలీ పంపిన సైనికులు రెట్టించిన ఉత్సాహంతో శివగంగై కోట మీదకు వెళ్లారు. వీరవిహారం చేసింది నాచ్చియార్ రాణి.

ఓ వైపు ఆర్కాట్ సైనికులు, మరోవైపు ఆంగ్లేయసేనలు తమ ప్రతాపాన్ని చూపడం మొదలెట్టారు. అయినా ఎక్కడా అదరక బెదరక తన బలగంతో శత్రుసైన్యాన్ని ఊచకోత కొయ్యడం మొదలుపెట్టింది నాచ్చియార్. శివగంగైలో చాలా ప్రాంతాలను వశపరచుకుంది. చివరికి ఆంగ్లేయుల అధీనంలోని తిరుచురాపల్లి కోటమీదకు కూడా వెళ్లింది. కాని దురదృష్టం...అపార ఆంగ్లేయ సైన్యం, ఆయుధసంపత్తి ముందు, ఆమె సైన్యం, హైదర్ అలీ ఇచ్చిన సైన్యం కూడా నిలవలేని పరిస్థితి.

అందరూ తర్జన భర్జనలలో పడ్డారు. ఎందుకంటే కోటలో ఆంగ్లేయులకు ప్రత్యేకమైన ఆయుధాగారమే ఉంది. అంత ఆయుధ సంపత్తితో ఉన్న వారిని తమ పరిమిత ఆయుధాలతో, సైన్యంతో ఎదుర్కోవడం అసాధ్యం.

ఆలోచనలో పడింది నాచ్చియార్ దళం.



# బాలికల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలి

**విజయవాడ:** నివేదిత గురుకులం బాలికల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలని ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సదస్యులు భాగయ్య అన్నారు. శ్రీ విజ్ఞాన విహార ఆధ్వర్యంలో నివేదిత గురుకులం ప్రథమ వార్షికోత్సవం మార్చి 2న విజయవాడలోని ఉంగుటూరులో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భాగయ్య ప్రసంగిస్తూ శ్రీ నివేదిత గురుకులం పూర్తిగా సమాజ పోషితం అని తెలిపారు. ఇక్కడ తయారయ్యే వస్తువులు విదేశాలకు ఎగుమతి చేసేంత నాణ్యతను కలిగి ఉన్నాయని అన్నారు. విద్యార్థినులు ఇక్కడి విద్యా విధానం ద్వారా తల్లితండ్రుల పట్ల గౌరవ మర్యాదలతో నడుచుకునే జీవన విధానం అలవరుచుకుంటారని తెలిపారు.

విజయ ఎలక్ట్రికల్స్ అధినేత దాసరి జై రమేష్ విద్యార్థినుల కళాప్రదర్శనను వీక్షించారు. వారిని ఆశీర్వదించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో సభికులను అలరించారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినుల తల్లి తండ్రులు, చుట్టుప్రక్కల గ్రామాల పెద్దలతో గురుకుల ప్రాంగణం కోలాహలంగా మారింది.

విజ్ఞానవిహార విజయవాడ అధ్యక్షుడు బీవీఎస్‌టీ సాయి, జాతీయ మానవ హక్కుల కమిషన్ గౌరవ సభ్యురాలు విజయభారతి, రామకృష్ణ శారద మిషన్ ప్రవరాజక బోధమయప్రాణ, ప్రవరాజక త్యాగ నిష్ఠ ప్రాణ, గురుకులం ప్రధానోపాధ్యాయిని సావిత్రి, దాసరి బాలవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

"మహారాణీ! ఈ పరిస్థితిని దాటాలంటే ఒక్కటే మార్గం..." చెప్పింది కుయిలీ.

"ఏంటది...?"

"మనం ఒక పథకంతో వెళితే కోటను స్వాధీనం చేసుకోవచ్చు. మరికొద్ది రోజుల్లో దసరా పండుగ రాబోతోంది. స్త్రీలందరూ కోటలోపల ఉన్న దేవిని దర్శించుకోడానికి అనుమతి ఉంటుంది. అందరూ వెళతారు. వాళ్లతో పాటు మా దళం కూడా పండ్లు, పూలబుట్టలతో, ఆ పండ్లుల, పూల మాటున ఆయుధాలు పెట్టుకొని లోపలికెళతాం. మేం లోపలికి వెళ్లిన తరువాత వారి ఆయుధాగారాన్ని స్వాధీనపరచుకుని లోపలి నుంచి కోట తలుపులు తెరుస్తాం. అప్పుడు మీరు కోటలోనికి ప్రవేశించి కోటను స్వాధీనపరుచుకోవచ్చు.

"సెభాష్ కుయిలీ... క్లిష్ట సమయాల్లో సరైన నిర్ణయాలు చెయ్యడంలో నీకు నువ్వే సాటి. సరే! వెళ్లండి! మీరు కోట తలుపులు తెరిచిన కబురు కోసం ఎదురుచూస్తుంటాము".

* * *

నెమ్మదిగా పూలు, పండ్ల బుట్టలతో అమ్మవారి దర్శనం కోసం కోటలోకి సాగిపోతున్నారు మహిళలు. వారి మధ్యలో వారితో కలిసిపోయి చేతిలో పూల బుట్టలతో, తమ డేగ చూపులతో దారంతా జల్లెడ పడుతూ సాగుతోంది కుయిలీ సేన. ఒక దగ్గర పెద్దఎత్తున మందుగుండు సామగ్రితో ఆయుధాగారం కనిపించింది. మామూలు స్త్రీలలాగా ఒక దగ్గర చేరింది కుయిలీ సైన్యం.

"కుయిలీ...! అదిగో చూడు...! ఆయుధాగారం. మందుగుండు సామగ్రితో నిండిన ఖజానా..." ఏదో మామూలు మాటలు చెప్పుకుంటున్నట్టుగా కనబడుతూ చాలా నెమ్మదిగా చెప్పిందొక సైనికురాలు.

'ఆ... అవును. కాని, ఇంతమంది ఉండగా ఇంతపెద్ద మొత్తంలో ఉన్న ఈ మందుగుండును, ఆయుధాలను ఎలా స్వాధీనం చేసుకోవాలి?" స్వాధీనం చేసుకోలేకపోయినా కనీసం ఈ ఆయుధాలు, మందుగుండు శత్రువులకు అందకుండా చెయ్యగలిగితే చాలు. సగం సాధించినట్టే. కాని ఎలా...?' ఆలోచనలో పడింది కుయిలీ. అంతలోనే ఆమె బుర్రలో మెరుపు మెరిసింది.

'అవును... అదే సరైన పని. అలాగే చెయ్యాలి' వచ్చిన ఆలోచనను ఆచరణలో పెట్టే ప్రయత్నంలో పడింది. చుట్టుపక్కల అంతా పరిశీలించింది. గబగబా వెళ్లి అక్కడ దివిటీలు వెలిగించడం కోసం ఒక పెద్ద డబ్బాతో పెట్టిన నూనెను తనమీద దిమ్మరించుకుంది. బట్టలతో సహా తనువంతా నూనెతో తడిసిపోయింది. పక్కనే వెలిగించి ఉన్న దివిటీ తీసుకుంది ఒక్క ఉదుటున మందుగుండు సామగ్రి ఉన్న భవనంలోనికి పరుగుతీసింది. కనురెప్పపాటులో కాగడాను అంటించుకుంది. కుయిలీతో పాటు మందుగుండు సామగ్రి అంతా భగ్గుమంది. మందు గుండు శత్రువులకు అందకుండా ఆత్మార్పణ చేసుకుంది. నిశ్చేష్టులయి నిలబడి పోయింది కుయిలీ మహిళాదళం.

సుశిక్షితులైన ఆ మహిళాదళం వెంటనే తేరుకుంది. వెంటనే వెళ్లి కోట తలుపులు తెరిచింది. అదను కోసం చూస్తున్న నాచ్చియార్ రాణి సైన్యంతో కోట లోపలి ప్రవేశించింది. వచ్చీరాగానే తన నమ్మినబంటు కుయిలీ కోసం వెతికాయి ఆమె కళ్లు. ఎక్కడా కనబడలేదు కుయిలీ.

అది గమనించిన దళ నాయకులు కుయిలీ తెగింపు, త్యాగం ఆమె ముందు పెట్టారు.

హతాశురాలైంది నాచ్చియార్. నోట మాట రాలేదు. అడుగు కదపలేకపోయింది. పరిస్థితిని గమనించిన నాయకులు,

"మహారాణీ త్వరపడండి... కుయిలీ ప్రాణ త్యాగం వృథపోనివ్వకండి. గుండె దిటవు చేసుకోండి. ధైర్యంగా ముందుకు నడవండి" అని హెచ్చరించడంతో, అతి కష్టం మీద ముందుకు కదిలింది. సైన్యంతో కోటను ముట్టడించింది. అంగ్లేయసైన్యం ఎదురుదాడికి దిగింది. అయితే ఆయుధాలన్నీ నాశనమైపోవడంతో ఇక నాచియార్ సైన్యాన్ని నిలువరించలేక, వారి ముందు తలవంచక తప్పలేదు.

* * *

ఓవైపు పండితుల మంత్రోచ్ఛరణలు, మరోవైపు జయహో.. వీరమంగై వేలు నాచ్చియార్ అంటూ ప్రజల జయజయధ్వానాలు....ఇంకోవైపు మంగళవాయిద్య ధ్వనులు మిన్నంటుతున్నాయి. విజయదశమితో విజయం సాధించిన సైనికుల ఆనందానికి అవధుల్లేవు. ఎనిమిదేళ్ల అజ్ఞాతవాసం తరువాత స్వంత రాజ్యంలో స్వేచ్ఛావాయువులు పీల్చిన ఉత్సాహంతో రాజ్యమంతా కేరింతలు కొడుతోంది. ఇలా కోలాహలం నడుమ సింహాసనం అధిష్టించింది మహారాణి వీరమంగై నాచియార్.

వచ్చేవారం కథ..

**మహావీరుడు**

– జి.వి.శ్రీనివాస్




# FORM IV

**(See Rule 8)**

The Registration of Newspapers (Central) Rules, 1956.

| | | |
|---|---|---|
| Place of Publication | : | HYDERABAD |
| Periodicity of Publication | : | WEEKLY |
| Printer's Name | : | **Nagol Sreenivas Reddy** |
| Nationality | : | INDIAN |
| Address | : | 10-3-304/13, C/o Ashwini Poly Clinic, Humayun Nagar, Hyderabad-500 028. Telangana. |
| Publisher's Name | : | **Nagol Sreenivas Reddy** |
| Nationality | : | INDIAN |
| Address | : | 10-3-304/13, C/o Ashwini Poly Clinic, Humayun Nagar, Hyderabad-500 028. Telangana. |
| Editor's Name | : | **Dr. Goparaju Narayana Rao** |
| Nationality | : | INDIAN |
| Address | : | Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli Kachiguda, HYDERABAD - 500 027. |
| Names and Address of individuals who own the news paper and partners or Shareholders holding more than one percent of the total capital | : | **JAGRITI PRAKASHAN TRUST(Regd.)** Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli Kachiguda, HYDERABAD - 500 027. |

**1. I Nagol Sreenivas Reddy hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

1-3-2025 Sd/-
HYDERABAD Publisher




# గురూజీ మార్గదర్శకం కీలకం

శ్రీ గురూజీ తత్వజ్ఞత నేటికీ ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉందని, రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) సిద్ధాంతాన్ని రూపొందించడంలో ఆయన మార్గదర్శనం కీలకమైనదని ఆర్‌ఎస్ఎస్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్‌జీ అన్నారు. మార్చి 4న హైదరాబాద్ నారాయణగూడ కేశవ మెమోరియల్ విద్యాసంస్థల ప్రాంగణంలోని పటేల్‌హాల్‌లో జరిగిన 'శ్రీ గురూజీ దృష్టి–దార్శనికత' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, శ్రీ గురూజీ ఆలోచనలను సమర్థంగా, సమగ్రంగా అర్థం చేసుకునేందుకు ఈ గ్రంథం మార్గదర్శిగా నిలుస్తుంది అన్నారు. భారతదేశంలో మాట్లాడే ప్రతి భాషను జాతీయ భాషగా గురూజీ పరిగణించారని, రాజకీయ, రాజ్యాంగ అంశాల్లో స్పష్టమైన మార్గదర్శ కత్వాన్ని అందించారని అన్నారు. అయోధ్య అంశాన్ని హిందువుల ఐక్యతకు సూచికగా గురూజీ భావించారని గుర్తు చేశారు. జీవితాంతం హిందూ ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్లగల వ్యక్తి కోసం డాక్టర్‌జీ అన్వేషించారని, సంఘంను మరింత పటిష్ట పరచే క్రమంలో, బనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో అధ్యాపకత్వంలో ఉన్న గురూజీని ఎంపిక చేశారని చెప్పారు. గురూజీ తత్వవేత్త, మేధావి, సన్యాసి, ప్రసంగం పరంగా అసాధారణ ప్రతిభ కలిగినవారు కావడమే ఆ ఎంపికకు కారణం కావచ్చని అభిప్రాయపడ్డారు. చైనాతో ముప్పు గురించి గురూజీ అప్పటినుంచే హెచ్చరిస్తూ వచ్చారని, అది భిన్నమైన విధానాలను అనుసరించే దేశమని ఆయన ఆనాడే స్పష్టంగా తెలిపారని అన్నారు. మతమార్పిడులు దేశ విభజనకు దారితీస్తాయని ఆయన హెచ్చరించా రన్నారు. 'మీరు ఆరాధనా విధానాన్ని మార్చుకోవచ్చు, కానీ మీ జాతీయతను మార్చలేరు' అని ఆయన స్పష్టంగా చెప్పారని సునీల్ అంబేకర్‌జీ తెలిపారు. దేశరక్షణ విషయంలో ప్రభుత్వానికి, భద్రతా దళాలకు మద్దతుగా నిలవాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

విశిష్ట అతిథిగా హాజరైన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ, ఈ గ్రంథం పరిశోధకులకు, యువతకు, శ్రీ గురూజీ అభిప్రాయాలను అర్థం చేసుకునేందుకు ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. ఇలాంటి లోతైన ఆలోచనలు భాషా పరిమితులను దాటి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన అభిలషించారు.


ఈ గ్రంథ అనువాదకులు, సీనియర్ పాత్రికేయులు వేదుల నరసింహం మాట్లాడుతూ, గురూజీ ఓ తపస్వి, రుషితుల్యులని అభివర్ణించారు. సామాన్య కార్యకర్త మొదలు మేధావులకు, ధర్మాచార్యులకు కూడా మార్గదర్శనం చేయగల మేధో సంపన్నులని అన్నారు. డాక్టర్జీ సంఘ్‌ని ప్రారంభించి, హిందూ రాష్ట్ర వాదానికి ప్రాచుర్యం కలిపిస్తే.. దానికి తాత్వికతను, సైద్ధాంతపరమైన భూమికను అందజేసింది గురూజీ అని చెప్పారు.

జ్యేష్ఠ ప్రచారకులు రాంపల్లి మల్లికార్జున రావు పుస్తకాన్ని పరిచయం చేస్తూ, సిద్ధాంతపరమైన, చరిత్రపరమైన పుస్తకాలను, మహా పురుషుల చరిత్రకి సంబంధించిన పుస్తకాలను నవయుగ భారతి ప్రచురించిందని తెలిపారు. ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్స వాలను పురస్కరించుకొని నవయుగ భారతి తరపున సంఘ సైద్ధాంతిక పరమైన పుస్తకాలను తీసుకు రావాలని సంకల్పించామని తెలిపారు. అందులో భాగంగానే 'శ్రీ గురూజీ దృష్టి దార్శనికత' పుస్తకం తీసుకొచ్చామని తెలిపారు.


ప్రసంగిస్తున్న సునీల్ అంబేకర్‌జీ

నవయుగ భారతి కార్యదర్శి నేతి క్షీరసాగర్ అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ ప్రాంత సంచాలకులు సుందర్ రెడ్డి ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. మేధావులు, విద్యావేత్తలు, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ సభ్యులు సుమారు 400 మంది వరకూ హాజరయ్యారు.

పూజ్య గురూజీ శతజయంతిని పురస్కరించుకొని (2006) 'శ్రీ గురూజీ సమగ్ర' పేరుతో ప్రచురితమైన పన్నెండు సంపుటలలోని విశేషాంశాలతో 'శ్రీ గురూజీ దృష్టి–దార్శనికత' గ్రంథం రూపొందింది. ఎస్. గురుమూర్తి రచించిన 'గోల్వాల్కర్: ది మోడ్రన్ రుషి విత్ ఎ మిలేనియల్ విజన్" అనే పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ★



ప్రపంచీకరణ పుణ్యమా అంటూ క్రికెటర్ల దశ తిరిగింది. ఐసీసీ టోర్నీలతో పాటు వివిధ దేశాల లీగ్‌ల్లో ఆడుతూ ఇబ్బడి ముబ్బడిగా ఆర్జిస్తున్నారు. మహిళా క్రికెటర్లు పురుషులతో సమానంగా సంపాదిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు.




# మహిళా క్రికెటర్లా! మజాకానా!

అంతర్జాతీయ క్రికెట్లో విరాట్ కోహ్లీ ప్రభ వెలిగిపోతోంది. క్రికెట్ మూడు ఫార్మాట్లలోనూ విరాట్ పరుగుల హోరు, రికార్డుల జోరు కొనసాగిస్తూనే ఉన్నాడు. ఐసీసీ టీ-20× ప్రపంచకప్ విజయంతో ఈ చిట్టిపొట్టి ఫార్మాట్‌కు అనధికారికంగా రిటైర్మెంట్ చెప్పిన 36 సంవత్సరాల విరాట్.. ఇప్పుడు 50 ఓవర్ల వన్డే క్రికెట్‌పై దృష్టి కేంద్రీకరించాడు. తనకు ఎంతగానో అచ్చివచ్చిన వన్డే క్రికెట్లో పలు అరుదైన రికార్డులతో వారెవ్వా! అనిపించుకొంటున్నాడు.

**వన్డేలలో త్రిశతమానం భవతి....**

వన్డే క్రికెట్లో ఇప్పటికే అత్యధిక శతకాల ప్రపంచ రికార్డు నెలకొల్పిన విరాట్ ప్రస్తుత ఐసీసీ మినీ ప్రపంచకప్ (చాంపియన్స్ ట్రోఫీ) గ్రూపులీగ్ ఆఖరి మ్యాచ్ ద్వారా 300 వన్డేలు ఆడిన భారత 7వ క్రికెటర్‌గా రికార్డుల్లో చేరాడు. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా ఈ ఘనతను సొంతం చేసుకోగలిగాడు.

చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో దుబాయ్ వేదికగానే ముగిసిన గ్రూపులీగ్ పోరులో శతకం బాదిన విరాట్ పలు సరికొత్త రికార్డులకు గురి పెట్టాడు. ఆయనకు ముందే 300కు పైగా వన్డే మ్యాచ్‌లు ఆడిన భారత క్రికెటర్లలో మాస్టర్ సచిన్ టెండూల్కర్ (463 మ్యాచ్‌లు- 18426 పరుగులు), మహేంద్రసింగ్ ధోనీ (340 మ్యాచ్‌లు- 10599 పరుగులు), రాహుల్ ద్రావిడ్ (340 మ్యాచ్‌లు- 10768 పరుగులు), మహ్మద్ అజరుద్దీన్ (334 మ్యాచ్‌లు- 9378 పరుగులు), సౌరవ్ గంగూలీ (308 మ్యాచ్‌లు - 11221 పరుగులు), యువరాజ్ సింగ్ (301 మ్యాచ్‌లు- 8609 పరుగులు) ఉన్నారు.

ఇప్పటి వరకూ ఆడిన 299 మ్యాచ్‌ల్లో విరాట్ 51 శతకాలు, 73 అర్థ శతకాలు సహా 14085 పరుగులతో అత్యధిక వన్డే పరుగులు సాధించిన మొనగాళ్ల జాబితా మూడోస్థానంలో నిలిచాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ 270 వన్డేలలోనే 11049 పరుగులతో నిలిచాడు.

**అరుదైన రికార్డులకు మరో పేరు...**

వన్డే క్రికెట్లో దిగ్గజ బ్యాటర్లు సచిన్ టెండుల్కర్, కుమార సంగక్కర నెలకొల్పిన ఒక్కో రికార్డును అధిగమిస్తూ వచ్చిన విరాట్ ఇప్పటికే అరడజనుకు పైగా ప్రపంచ రికార్డులను తన పేరుతో నమోదు చేసుకొన్నాడు.

దుబాయ్ వేదికగా పాకిస్థాన్‌తో ముగిసిన మ్యాచ్ వరకూ ఆడిన 299 వన్డేలలో సగటు 58.20, స్ట్రయిక్ రేట్ 93.41గా నమోదయ్యింది. అత్యధిక వేగంగా వన్డేలలో 10వేలు, 11వేలు, 12వేలు, 13వేలు, 14 వేలు పరుగులతో పాటు..అత్యధిక శతకాలు బాదిన మేటి ఆటగాడుగా చరిత్ర సృష్టించాడు.

2017లో న్యూజిలాండ్ ప్రత్యర్థిగా తన 200వ వన్డే మ్యాచ్ ఆడిన విరాట్ మరో వంద మ్యాచ్‌లు ఆడటానికి ఎనిమిది సంవత్సరాలపాటు వేచి చూడాల్సి వచ్చింది. తన 300వ మ్యాచ్ ను సైతం న్యూజిలాండ్ ప్రత్యర్థిగానే ఆడటం విశేషం. వన్డే క్రికెట్ చరిత్రలోనే 300 మ్యాచ్‌లు ఆడిన 23వ క్రికెటర్‌గా నిలిచాడు. మాస్టర్ సచిన్ టెండుల్కర్ 463 వన్డేలలో 18 వేల 426 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతుంటే.. శ్రీలంక వికెట్ కీపర్ బ్యాటర్ కుమార సంగక్కర 404 మ్యాచ్ ల్లో 14వేల 234 పరుగులతో ఆ తర్వాతి స్థానంలో నిలిచాడు. విరాట్ మాత్రం కేవలం 299 వన్డేలలోనే 14వేల 85 పరుగులు సాధించడం ద్వారా అత్యంత వేగంగా 14వేల పరుగుల మైలురాయిని చేరిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.

సచిన్ 350 ఇన్నింగ్స్‌లోనూ, సంగక్కర 378 ఇన్నింగ్స్‌లోనూ సాధించిన 14వేల పరుగుల ప్రపంచ రికార్డును విరాట్ కేవలం 287 ఇన్నింగ్స్‌లోనే అధిగమించడం ద్వారా మరో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.

**పాకిస్థాన్ ప్రత్యర్థిగా సెంచరీల మోత...**

పాకిస్థాన్ ప్రత్యర్థిగా ఉంటే అత్యుత్తమంగా రాణించడం, సెంచరీల మోత మోగించడం విరాట్ కోహ్లీకి అలవాటుగా మారింది. ఐసీసీ వన్డే ప్రపంచకప్, ఐసీసీ మినీ ప్రపంచకప్‌తో పాటు.. ఆసియాకప్ క్రికెట్ పోటీలలోనూ పాక్ ప్రత్యర్థిగా శతకాలు సాధించిన ఏకైక, ఒకే ఒక భారత బ్యాటర్ విరాట్ మాత్రమే.

లక్ష్యఛేదనలోనూ అత్యధిక పరుగులు, అత్యధిక శతకాలు బాదిన బ్యాటర్ రికార్డులు సైతం విరాట్ పేరుతోనే ఉన్నాయి. తన వన్డే క్రికెట్ ప్రస్థానంలో తను ఇప్పటి వరకూ సాధించిన 51 శతకాలలో అత్యధికంగా 28 సెంచరీలు చేజింగ్ సమయంలోనివే ఉన్నాయి. 'చేజింగ్ కింగ్'గా పేరుపొందిన విరాట్ సాధించిన మొత్తం 14వేల 85 పరుగుల్లో 7వేల 979 పరుగులు చేజింగ్ సమయంలోనే సాధించడం విశేషం. పదహారు సంవత్సరాల తన క్రికెట్ జీవితంలో ఇప్పటికే రెండు (2011 వన్డే, 2024 టీ-20) ప్రపంచకప్‌లు, ఓ మినీ ప్రపంచకప్ (2013 చాంపియన్స్ ట్రోఫీ) అందుకొన్న విరాట్ .. 2024 మినీ ప్రపంచకప్‌తో పాటు.. 2027 వన్డే ప్రపంచకప్‌ను భారత్‌కు అందించాలన్న పట్టుదలతో ఉన్నాడు. మాస్టర్ సచిన్ టెండుల్కర్ కు అసలు సిసలు వారసుడిగా, ఆయన నెలకొల్పిన అత్యున్నత ప్రమాణాలను అందుకొంటూ భారత క్రికెట్ పతాకాన్ని ప్రపంచ క్రికెట్ కోటపై రెపరెపలాడిస్తున్న విరాట్‌కు జేజేలు పలకాల్సిందే మరి.! ★



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969






# ఆ అమాత్యు

**కొత్త బడ్జెట్‌లో రైల్వే శాఖకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. రూ.2,52,000 కోట్లు కేటాయించడాన్ని బట్టి ప్రభుత్వం ఈ శాఖకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నదీ, ఈ శాఖ నుంచి ఎంతగా ఆశిస్తున్నదీ అర్థం చేసుకోవచ్చు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు సమానంగా రైళ్లను అభివృద్ధి చేయడంతో పాటు, నిరుద్యోగ యువతకు భారీగా ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ఈ శాఖ మీద దృష్టి పెడుతోంద నేది అర్థమైపోతూనే ఉంది. కేంద్ర ప్రభుత్వంలో రైల్వే, సమాచార, ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్న 54 ఏళ్ల అశ్వినీ వైష్ణవ్ కూడా కేంద్ర ప్రభుత్వ ఆశయాలకు తగ్గట్టుగానే దేశంలోని లక్షలాది మంది యువతీ యువకుల భవిష్యత్తులను తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు.**

ఆ తర్వాత ఆయన వాజపేయి ప్రభుత్వంలో ప్రధాని కార్యాలయంలో పనిచేశారు. ప్రస్తుతం మోదీ వికసిత్ భారత్ పేరుతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే ఉద్దేశంలో ఉన్నందువల్ల ఆయన దృష్టి వైష్ణవ్ మీద పడింది. ఐ.టి, రైల్వే శాఖల ద్వారా వికసిత్ భారత్ మరింతగా నెరవేరే అవకాశం ఉంటుందని గుర్తించిన మోదీ ఈ రెండు శాఖలను ఒకే వ్యక్తికి అప్పగించారు. ఇదివరకటి మోదీ మంత్రి వర్గంలో కూడా రైల్వే మంత్రిగా పనిచేసిన అశ్వినీ వైష్ణవ్ దేశంలో వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టడం విశేషం. సుమారు 250 జిల్లాలను కవర్ చేస్తూ ఆయన ఇదివరకే 85 వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టారు. ఇవి దేశ ముఖచిత్రాన్ని చాలావరకు మార్చేశాయి. రైల్వేల ప్రగతి ఆయన ఆధ్వర్యంలో వేగం పుంజుకుంది. దేశవ్యాప్తంగా సుమారు 100 రైల్వేస్టేషన్లను పునర్నిర్మించారు. దేశంలోని మొత్తం 7,400 రైల్వేస్టేషన్లలో 1,300 స్టేషన్లను పూర్తిగా ఆధునీకరించారు.

వైష్ణవ్‌పథకాల విషయంలో లోపాలేవీ కనిపించక పోవడంతో ప్రతిపక్షాలు సహజంగానే ప్రయాణికుల భద్రత గురించి విమర్శిస్తున్నారు. సంస్థాగతంగా రైల్వేలో ఎన్నో లోపాలున్నట్టు కూడా అది విమర్శి స్తోంది. రైల్వే భద్రతా విభాగంలో సుమారు 1.75 లక్షల ఖాళీలు భర్తీ కాకుండా పడి ఉన్నాయి. వైష్ణవ్ ఇప్పుడు వీటిని భర్తీ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

## రైల్వేలకు కొత్త భవిష్యత్తు

టెక్నాలజీని పూర్తి స్థాయిలో ఉపయోగించి రైల్వేలను అత్యంత ఆధునికం చేయాలని కంకణం కట్టుకున్న మోదీ ఈ మేరకు వైష్ణవ్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మోదీ కలలుగంటున్న ఆధునిక పాలనలో వైష్ణవ్ ఒక ప్రధాన ఆలంబన. ఒడిశాలో 1996లో సంభవించిన తుపాను నష్టాన్ని తగ్గించడంలో, ప్రజల ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషించిన వైష్ణవ్‌ను వాజపేయి ప్రధానమంత్రి కార్యాలయంలో చేర్చిన వ్యక్తి ప్రధాని సంయుక్త కార్యదర్శి అశోక్ సైకియా. ఆ తర్వాత ఆయన వాజపేయి వ్యక్తిగత కార్యదర్శిగా మారారు.

ఆ తర్వాత ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని, జి.ఇ కార్పొరేషన్‌లో సి.ఇ.ఓగా చేరారు. ఐ.ఐ.టి, ఆ తర్వాత ఎం.బి.ఎ చేసిన వైష్ణవ్ సీమెన్స్‌లో కూడా పనిచేశారు. ఆయన స్వయంగా ఇనుము, ఉక్కు ఊచలకు సంబంధించిన సంస్థలను కూడా నెలకొల్పారు. కేవలం భాగస్వామ్య ఒప్పందాల కోసం ఆ తర్వాత ఆయన తన వ్యాపారాలను గుజరాత్‌కు మార్చారు. ఆపై ఆరు నెలలకే ఆయనకు మోదీ నుంచి ఆహ్వానం అందింది. ఇక ఐ.టి మంత్రిగా ఆయన కొన్ని లక్ష్యాలను ఏర్పరచుకొని. వివిధ ఐ.టి సంస్థలను ఇతర ప్రాంతాలకు విస్తరించడంతో పాటు కొత్త ఉద్యోగాల సృష్టిని ప్రోత్సహించదలచుకున్నారు. విద్యావంతులైన యువతీ యువకులను దృష్టిలో పెట్టుకుని ఆయన ఐ.టి సంస్థల విస్తరణకు అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

కేంద్రంలో సరికొత్త ప్రణాళిక చోటు చేసు కుంటోంది. కీలకమైన దేశ అవసరాలు, సమస్యలు, ఎన్.డి.ఎ ఎన్నికల మేనిఫెస్టోలోని విషయాలు వగైరాల కారణంగా బడ్జెట్ తర్వాత నుంచి కేంద్రంలో ఆరుగురు మంత్రులకు చేతి నిండా పని ఉండే అవకాశం కనిపిస్తోంది. మోదీ నాయ కత్వంలోని మూడవ పర్యాయపు ఎన్‌డీఏ ప్రభుత్వంలో వాగ్దా నాలు, అనుసరించి, వ్యవసాయం, నీరు, పరిశ్రమలు, కార్మికులు, ఉద్యోగాలు వంటి రంగాలు ప్రధానంగా ఊపందు కోవాలి. నిజానికి, మోదీ ప్రభుత్వం ఈ రంగాలను దృష్టిలో ఉంచుకునే సరికొత్త కార్యక్రమానికి రూపకల్పన చేసింది. కేంద్రంలోని నలుగురు మంత్రులు – శివరాజ్‌సింగ్ చౌహాన్, చిరాగ్ పాశ్వాన్, సి.ఆర్. పాటిల్, మన్ సుఖ్ మాండవీయాలను ఇప్పటికే సమాయత్తం చేయడం జరిగింది.

వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వ్యవసాయ రంగంలో ఉన్న సమస్యలు సంపూర్ణంగా తెలుసు. ఆయన ఇప్పటికే తనకు అవసరమైన సమాచారాన్ని సమీకరించుకున్నారు. దేశంలో దాదాపు 45 శాతం మంది వ్యవసాయ రంగం మీదే ఆధారపడి ఉన్నారు. జాతీయాదాయంలో ఆరు శాతం ఈ రంగం నుంచే సమకూరుతోంది. జాతీయాదాయాన్ని పెంచా లన్నా, పేదరికాన్ని నిర్మూలించాలన్నా ఈ రంగం అభివృద్ధి కీలకం. పారిశ్రామిక రంగంలో మాదిరిగా కాకుండా వ్యవసాయ రంగంలో ఆటుపోట్లు, ఒడిదుడుకులు ఎక్కువగా ఉంటాయి.

## రైతు సంక్షేమంపై దృష్టి

గతంలో లోక్‌సభ ఆమోదించి, ఆ తర్వాత రైతుల నిరసనల కారణంగా ఉపసంహరించుకున్న వ్యవసాయ చట్టాలను రైతుల ఆకాంక్షలకు తగ్గట్టుగా కొద్దిపాటి మార్పులతో తిరిగి ప్రవేశపెట్టే అవకాశం ఉంది. రైతులకు మరింత వెసులుబాటుగా, సౌకర్య వంతంగా రుణ సౌకర్యాలు కల్పించడం, మార్కెటింగ్ సౌకర్యాలను పెంచడం, ఆహార ధాన్యాల నిల్వకు వసతులు మెరుగు పరచడం, వ్యవసాయ సంఘాలను మరింత పటిష్ఠం చేయడం వంటి విషయాల్లో మరిన్ని

# లకు చేతినిండా పని

మార్పులు చేసే అవకాశం కూడా ఉంది. వ్యవసాయాభివృద్ధిని, గ్రామీణాభివృద్ధిని మేళవించి కొత్త కార్యక్రమాలను చేపట్టాలన్నది కేంద్ర ప్రభుత్వం ధ్యేయంగా కనిపిస్తోంది. అయితే, ఇందులో సగానికి సగం బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాల్సిన ఉన్నందువల్ల నాలుగు పర్యాయాలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించిన చౌహాన్ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం సాధించాలి.

ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన చిరాగ్ పాశ్వాన్ కొంత మేరకు చౌహాన్‌తో సమన్వయం సాధిస్తూనే, దేశంలో ఆహారధాన్యాల సరఫరా, పంపిణీ వంటి కీలక విషయాల్లో సత్తా ఏమిటన్నది నిరూపించుకోవాలి. ఆహారధాన్యాలు, నిత్యావసర సరుకుల ధరలు పెరగడం ఆర్థిక,రాజకీయ రంగాల మీద ప్రభావం చూపిస్తుంది. ఆహార ధాన్యాలకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తే దాదాపు 8 శాతం వరకు ద్రవ్యోల్బణం కనిపిస్తోంది. సరిగ్గా ధాన్యం ఉత్పత్తి జరగకపోవడంతో పాటు, సరైన నిల్వ వ్యవస్థలు లేకపోవడం, మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం వల్ల రైతాంగం దీనావస్థలోనే ఉంటూ వస్తోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, ఫుడ్ ప్రాసెసింగ్ విషయంలో బాగా వెనుకబడిఉంది. పంటనష్టాలు జరగకుండా ఉండాలన్నా, పంట వృథా కాకుండా ఉండాలన్నా ఫుడ్ ప్రాసెసింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలి.

**భారీగా ఉద్యోగాల సృష్టి**

రైతులు తమ ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడానికి, అవసరమైనప్పుడు లేదా వీలైనప్పుడు అమ్ముకోవడానికి తగ్గట్టుగా నిల్వ కేంద్రాలను దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో ఏర్పాటు చేయాలి. రైతుల కోసం ఇటువంటి సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో పాటు, ఒక జిల్లా, ఒకే ధాన్యం అనే విధానాన్ని అవలంబించడం మీద కూడా దృష్టిసారించాలి. ఆహారధాన్యాలను సరైన రీతిలో మార్కెటింగ్ చేయడంతో పాటు వీట వల్ల వస్తున్న ఆదాయాన్ని పెంచడం, వీటి ద్వారా మరిన్ని ఉద్యోగాలను సృష్టించడం కూడా ఇప్పుడు కీలకాంశంగా మారింది.

దేశంలో నీటి సమస్యలు, జల సంక్షోభాలు క్రమంగా పేట్రేగిపోతున్న నేపథ్యంలో జల శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ ఈ రంగం మీద మరింతగా దృష్టి పెట్టాలి. భారతదేశ రాజకీయ ఆర్థిక వ్యవస్థలో ఇది ఎవరికీ పట్టని సంక్షోభంగా మారిపోయింది. ఇప్పుడు ఈ సమస్యను, సంక్షోభాన్ని తప్పనిసరిగా పట్టించుకోవాలి. నీటి నిల్వ, నీటి లభ్యత, నీటి నాణ్యత, నీటి సరఫరాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడానికి ఉద్దేశించిన హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టవలసి ఉంటుంది. దేశంలోని దాదాపు వంద లోక్‌సభ నియోజకవర్గాల్లో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయిలో ఉంటున్నాయి. ఈ నియోజక వర్గాలకు పూర్తిగా ట్యాంకర్ల ద్వారానే నీరు అందుతోందంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, దాదాపు ప్రతి పట్టణంలో, ప్రతి నగరంలో 50 నుంచి 100 కిలోమీటర్ల దూరం నుంచి నీరు తీసుకు వచ్చి సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొని ఉంది.


**కీలక సమస్యలకు పెద్ద పీట**

దేశంలో అత్యవసరంగా ఉప్పు నీటి నుంచి మంచి నీటిని తీసే వ్యవస్థలను అభివృద్ధి చేయాలి. అంతేకాక, నీటిని రీసైక్లింగ్ చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు భారీగా నిధులు సమకూర్చడమే కాకుండా, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం కోసం ప్రయత్నించాలి. ఇందుకు పన్నుల మినహాయింపులు, ప్రోత్సాహకాలు ప్రకటించాలి. రాజకీయ నాయకుడుగానే కాకుండా, ఒక సాంకేతిక పరిజ్ఞాన నిపుణుడుగా కూడా ఎంతో అనుభవం ఉన్న పాటిల్ ఈ రంగాన్ని ప్రక్షాళన చేయడానికి, అభివృద్ధి చేయడానికి ఇప్పటి నుంచే నడుం బిగించారు. ప్రభుత్వం కూడా నిధులపరంగా, సిబ్బందిపరంగా ఇప్పటికే అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించినందువల్ల ఆయన రోజుకు 18 గంటలు శ్రమిస్తున్నారు. కార్మిక వ్యవహారాలు, యువజన వ్యవహారాలు, ఉపాధి వంటి కీలక రంగాలకు చెందిన మంత్రి మన్‌సుఖ్ మాండవీయా, నైపుణ్యాల అభివృద్ధి శాఖకు మంత్రిగా ఉన్న జయంత్ చౌధురి ఇదివరకెన్నడూ లేనంత స్థాయిలో ఈ రంగాల మీద దృష్టి పెట్టడం జరుగు తోంది. దేశంలో అత్యంత కీలక, క్లిష్ట సమస్యగా ఉన్న ఉపాధి కల్పన రంగానికి కొత్త దశ, దిశ కల్పిం చేందుకు ఈ ఇద్దరు కేంద్ర మంత్రులు అత్యధిక సమయాన్ని కేటాయిస్తున్నారు. నిరు ద్యోగం, ఉపాధి కల్పన వంటి సమస్యల ప్రభావం గత ఎన్నికల్లో బాగానే కనిపించింది. కేంద్ర ప్రభుత్వం ఈసారి ఈ అంశాల మీద పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా కార్మికులను సృష్టించే విధానాన్ని ఇక పకడ్బందీగా అమలు చేసే పనిలో పడింది. విద్యావంతులకు ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణనిచ్చి వారిని దేశంలోని కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు లభించే అవకాశా లను పెంచడం మీద ఈ మంత్రులు ఇప్పటికే దృష్టి పెట్టారు. ఉద్యోగాలు దొరకని లక్షలాది మంది విద్యా వంతులకు సంబంధించిన వివరాలను సేకరించి, వారికి ఉద్యోగాలు కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని వీరు ముమ్మందు మరింత భారీ స్థాయిలో చేపట్టే అవకాశం ఉంది.






పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పీయూష్ గోయల్ దేశంలో అనేక కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో పాటు, అతి ప్రధానమైన వాణిజ్య సంస్థలను విస్తరించడం మీద దృష్టి కేంద్రీకరిస్తున్నారు. విదేశాల నుంచి పెట్టుబడులను ఆకట్టుకోవడంతో పాటు, విదేశీ కంపెనీలు భారతదేశంలో తమ సంస్థలను ఏర్పాటు చేసేలా ఆయన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఎలక్ట్రానిక్స్, ఫార్మస్యూటికల్, వైద్య పరికరాలు వంటి రంగాల్లో అతి వేగంగా అగ్రస్థానానికి చేరుకుంటున్న భారతదేశం ఈ రంగాలను దేశవ్యాప్తంగా విస్తరించడానికి, తద్వారా ఉపాధి సమస్యను పరిష్కరించడానికి పీయూష్ గోయల్ ప్రయత్నిస్తున్నారు. చైనాను కాదని అనేక దేశాలు భారతదేశంలో తమ మార్కెట్ కార్యకలాపాలను విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి పీయూష్ గట్టి ప్రయత్నాలు సాగిస్తున్నారు. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పారిశ్రామిక కేంద్రాలను విస్తరించే కార్యక్రమం కూడా పూర్తి స్థాయిలో అమలు కాబోతోంది. వీటివల్ల విదేశీ పెట్టుబడులను ఆకట్టుకోవడంతో పాటు ఉపాధి కల్పనకు కూడా అవకాశాలు పెరుగుతాయి. మొత్తం మీద రాజకీయ అనివార్యాలు, ఆర్థిక అవసరాలకు తగ్గట్టుగా పనిచేయాల్సిన బాధ్యత ఈ మంత్రుల మీద ఉన్నట్టు అర్థమవుతోంది.



**జి.రాజశుక**
సీనియర్ జర్నలిస్ట్

## తెలుసుకుందాం

# వేంకటేశ్వర స్వామి ఆలయం - వెలుగొండ



ఏపీలోని ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం గార్లదిన్నె గ్రామంలో వెలసిన ఆలయమిది. తిరుమలలోని వేంకటేశ్వరస్వామి వారికి వెలుగొండ వేంకటేశ్వరుడు ప్రతిరూపమని భక్తుల నమ్మకం. కొండపైన శ్రీలక్ష్మీదేవి అమ్మవారి ఆలయం, శ్రీకృష్ణదేవరాయలు కట్టించినట్లు ఏర్పాటు చేసిన శిలాశాసనం భక్తుల్ని ఆకట్టుకుంటోంది. ఏటా ఇక్కడ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.

## కథ

# కోతి - న్యాయం!

అనగా అనగా చిన్ను, బుజ్జి అనే రెండు పిల్లి పిల్లలు ఉండేవి. ఒకరోజు అవి రెండు ఆడుకుంటూ ఉండగా వాటికి ఒక రొట్టెముక్క కనిపించింది. ఆకలి మీద ఉన్న చిన్ను, బుజ్జిలు ఆ రొట్టె ముక్క కోసం పరిగెత్తాయి. రెండూ ఒకేసారి రొట్టెముక్కను అందుకున్నాయి.

'ఈ రొట్టెను నేను ముందు అందుకున్నాను. ఇది నాది' అంది చిన్ను. "అదేం కుదరదు! దాన్ని ముందు చూసింది నేను. ఆ రొట్టె నాకు చెందవలసినది" అంది బుజ్జి. అలా అవి రెండూ తగవులాడుకోవడం మొదలుపెట్టాయి. ఒకదాని మాట మరొకటి వినిపించుకోకుండా రొట్టె ముక్క కోసం కీచులాడుకుంటూనే ఉన్నాయి.

ఇదంతా దూరం నుంచి ఒక కోతి గమనించింది. అది చాలా తెలివైనది. "ఈ రెండు పిల్లుల తగవులో నేను లాభం పొందవచ్చు" అనుకుంది. చిన్ను, బుజ్జిల దగ్గరకు వెళ్లి "మీరిద్దరూ మంచి స్నేహితులు కదా! అంత చిన్న విషయానికి తగవులాడుకోవడం ఏమీ బాగాలేదు. నేను మీ సమస్యకు పరిష్కారం చూపిస్తాను. నా దగ్గర ఒక త్రాసు ఉంది. దాని సహాయంతో రొట్టెముక్కను మీ ఇద్దరికీ సమానంగా పంచుతాను" అంది.

కోతి పరిష్కారం న్యాయంగా అనిపించి వాటి దగ్గర ఉన్న రొట్టెముక్కను దాని చేతికి ఇచ్చాయి పిల్లిపిల్లలు. కోతి రొట్టెముక్కను రెండు ముక్కలు



## పద్యము

**ఊరక సజ్జనుండొదిగి యుండిననైన దురాత్మకుండు ని**
**ష్కారణ మోర్వలేక యపకారము చేయుట వాని విద్యగా**
**చీరలు నూరుటంకములు చేసెడివైనను పెట్టెనుండగా**
**చేరి చినింగిపో గొరుకు చిమ్మట కేమి ఫలంబు భాస్కరా!**

**భావం :** భాస్కరా! ఎంతో విలువైన బట్టలు పెట్టెలో ఉండగా చిమ్మట పురుగు వాటికి చిల్లులు పెట్టి కొరికి పాడుచేస్తుంది. దానివల్ల ఆ పురుగుకి ఏమి లాభం లేదు. వాటికి పాడు చెయ్యటం ఒక స్వభావం. అలాగే ఎవ్వరినీ ఏమీ పల్లెత్తు మాట అనక తన ఇంట తానున్న సజ్జనుడికి నిష్కారణంగా దుర్జనుడు అపకారం చేసి బాధ పెడతాడు. వాడికి వచ్చే లాభం ఏమీ లేదు. అది చెడ్డవాని గుణం.

## శ్లోకము

**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్**
**మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనామ్**

**భావం :** మహాత్ములు ఆలోచించేది, పైకి చెప్పేది, చేసి చూపేది... మూడూ ఒకేలా ఉంటాయి. అదే త్రికరణ శుద్ధి. మనసులో ఒకటి, మాటలో వేరొకటి, చేసే పని మరొకటి.. ఇలా ఉండేది దురాత్ములకు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| కొచ్చి | గోవా |
| వాస్కోడిగామా | కేరళ |
| చెన్నై | గుజరాత్ |
| అహ్మదాబాద్ | అసోం |
| గౌహతి | తమిళనాడు |

**సమాధానాలు :** కొచ్చి–కేరళ; వాస్కోడిగామా–గోవా; చెన్నై–తమిళనాడు; అహ్మదాబాద్–గుజరాత్; గౌహతి–అసోం.

## భారత స్వాతంత్య్ర సమరయోధులు

### రమాదేవి చౌదరి



ఒడిశాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త. 1899 డిసెంబరు 3న జన్మించారు. 1921లో ఉద్యమంలో చేరారు. 1930లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. కిరణ్ బాలా సేన్, మాలతీదేవి చౌదరి, సరళా దేవి, ప్రాణకృష్ణ, పాధియారి వంటి ఇతర కార్యకర్తలతో కలిసి ఇంచుడి, సృజంగ్ గ్రామాలకు వెళ్లారు. ఆమెతో సహా అందర్నీ 1930 నవంబరులో నిర్బంధించారు. ఉద్యమంలో భాగంగా 1936, 1942లలోనూ అరెస్ట్ అయ్యారు. 1985 జూలై 22న మరణించారు.



చేసింది. త్రాసులో ఒక్కోవైపు ఒక్కో ముక్క వేసింది. ఒకముక్క కొంచెం పెద్దగా ఉండడం చేత త్రాసు ఒక వైపునకు వంగింది. “అరే, రెండు ముక్కలు సమానంగా లేవే..” అని కోతి కొద్దిగా తిన్నది. ఈసారి త్రాసు మరో వైపునకు వంగింది. “ఈసారి కూడా ముక్కలు సమానంగా లేవు” అని కోతి మరో ముక్కను కాస్త కొరికింది. అలా ఒక్కోసారి ఒక్కో వైపు ఉన్న ముక్కను కొరుకుతూ ఉంటే చిన్ను, బుజ్జిలు బిక్క మొహం వేసుకొని చూస్తూ ఉండిపోయాయి. కోతి అలా చేస్తూ చేస్తూ రొట్టెను మొత్తం తినేసి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

“మనలో మనం కీచులాడుకోకుండా రొట్టెను పంచుకొని ఉంటే బాగుండేది. మన తగవులాట వల్ల కోతి లాభపడింది” అని పిల్లులు తమ తప్పు తెలుసుకున్నాయి. ★

## జనరల్ నాలెడ్జ్

1. దేవీ అహల్యాబాయి హోల్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడుంది?
2. కేంద్ర పత్తి పరిశోధన సంస్థ ఎక్కడుంది?
3. ఆంధ్రా శివాజీ అని బిరుదు కలిగిన నేత?

సమాధానాలు : 1. ఇండోర్ (మధ్యప్రదేశ్); 2. నాగపూర్; 3. పర్వతనేని వీరయ్య చౌదరి.

## మెదడుకు మేత

నూరు పళ్లు,
ఒకటే పెదవి..
ఏమిటది?

జవాబు : దానిమ్మ

## మంచిమాట

ఓడిపోతామేమోనన్న భయం గెలుపును దూరం చేస్తుంది.



# వారఫలాలు

10-16 మార్చి 2025

### మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆప్తులతో సఖ్యత నెలకొంటుంది. బంధువులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. ఆస్తి వివాదాల పరిష్కారం. ఇంటి నిర్మాణాలకు ప్రణాళిక. గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఆరోగ్యపరంగా కొద్దిపాటి చికాకులు నెలకొన్నా సర్దుకుంటాయి. రచయితలు, క్రీడాకారులు అనుకున్నది సాధిస్తారు. 10,11తేదీల్లో ప్రయాణాలు. స్నేహితుల నుంచి ఒత్తిడులు. దైవకార్యాలలో పాల్గొంటారు. హయగ్రీవ ధ్యానం చేయండి.

### వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

సోదరులు, స్నేహితులతో ఉత్తరప్రత్యుత్తరాలు సాగిస్తారు. ఎంతటి వారినైనా మాటలతో ఆకట్టుకుంటారు. విద్యార్థులు, నిరుద్యోగుల కృషి ఫలిస్తుంది. వ్యాపారులకు లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగి ప్రోత్సాహకరంగా ఉంటుంది. కళాకారులు అనుకున్న అవకాశాలు క్రీడాకారులు, పరిశోధకులకు అనుకూల సమయం. 13,14 తేదీల్లో ఆస్తి వివాదాలు. ఆకస్మిక ప్రయాణాలు. శ్రీమహావిష్ణు షోడశనామస్తుతి మంచిది.

### మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆదాయం తగ్గి కొత్తగా అప్పులు కూడా చేయాల్సివస్తుంది. బంధువులు, స్నేహితులతో వివాదాలు నెలకొనే సూచనలు. కొన్ని వ్యవహారాలలో రాజీ తప్పదు. విద్యార్థులు కొంత నిరాశ చెందుతారు. భూవివాదాలు, కోర్టు కేసులు కొంత చికాకు. ఉద్యోగులకు అదనపు పనిభారం. రచ యితలు, కళాకారులు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే మేలు. 12,13 తేదీల్లో శుభవార్తా శ్రవణం. ధన, వస్తు లాభాలు. మహాలక్ష్మీ అష్టకమ్ పఠించండి.

### కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

అదనపు ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. ఇంటి నిర్మాణ యత్నాలు కార్యరూపం. పట్టుదలతో కొన్ని సమస్యలు పరిష్క రించుకుంటారు. వ్యాపారులకు క్రమేపీ లాభాలు. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. పారి శ్రామికవేత్తలు ఒత్తిడులనుంచి బయట పడతారు. కళా కారులు, రచయితల యత్నాలు సఫల మవుతాయి. 15,16 తేదీల్లో స్నేహితులతో తగాదాలు. అనారోగ్యం. శ్రీ సూర్యప్రార్థన చేయండి.

### సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

సన్నిహితులతో వివాదాలు సర్దుబాటు కాగలవు. దూరపు బంధువులను కలుసుకుని మీ భావాలను వెల్లడిస్తారు. వ్యాపారులు సంస్థలను విస్తరిస్తారు. ఉద్యోగు లకు విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. మంచి గుర్తింపు లభిస్తుంది. రచయితలు, వైద్యుల సేవలకు తగిన గుర్తింపు లభిస్తుంది. 10,11 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో ఒత్తిడులు. అనారోగ్యం. మేధా దక్షిణామూర్తి స్తుతి మంచిది.

### కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

సమాజంలో విశేష గౌరవం లభిస్తుంది. రాబడి గతంకంటే మెరుగు. ఇంతకాలం పడిన కష్టం ఫలిస్తుంది. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా కొనసాగుతాయి. ఉద్యోగులకు సమస్యలు తీరతాయి. పారిశ్రామిక వేత్తలకు అన్నింటా విజయాలు సిద్ధిస్తాయి. క్రీడాకారులు, పరిశోధకులకు నూత నోత్సాహం. 14,15 తేదీల్లో వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. సుబ్రహ్మణ్యధ్యానం చేయండి.


### తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

గతం నుంచి వేధిస్తున్న ఒక సమస్య నుంచి గట్టెక్కే సూచనలు. ఆదాయం మెరుగ్గా ఉన్నా ఖర్చులు అధికం. శుభకార్యాలపై చర్చలు సఫలం. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలలో విజయం. ఉద్యోగులకు శ్రమానంతరం ఫలితం. పారిశ్రామిక వేత్తలకు శుభవార్తలు. రచయితలు, క్రీడాకారుల యత్నాలు సఫలం. 13,14 తేదీల్లో ఇంటా బయటా చికాకులు. అనారోగ్య సూచనలు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

### వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఎదురు చూస్తున్న ఉద్యోగావకాశాలు దగ్గరకు వస్తాయి. కొన్ని సమావేశాలకు హాజరవుతారు. పరిచయాలు విస్తృత మవుతాయి. గృహ, వాహనాలు కొనుగోలు యత్నాలు సఫలం. ఉద్యోగులకు కొత్త హోదాలు లభిస్తాయి. రాజకీయవర్గాలకు నూతనోత్సాహం. పరిశోధకులు, వైద్యుల సేవలకు విశేష ఆదరణ లభిస్తుంది. 11,12 తేదీల్లో వృథా ఖర్చులు. ద్వాదశ సూర్య నమస్కారాలు చేయండి.

### ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం




సింహంభట్ల సుబ్బారావు

6300674054


చేపట్టిన కార్యక్రమాలు కొంత నిదానంగా పూర్తి చేస్తారు. విద్యార్థులకు అనుకూల పరిస్థితి. ఇంటి నిర్మాణయత్నాలలో పురోగతి. వ్యాపారులకు క్రమేపీ లాభాలు అందుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు. కళాకారులకు కొత్త అవకాశాలు. రచయితలు, క్రీడాకారులకు పేరుప్రతిష్ఠలు దక్కుతాయి. 10,11 తేదీల్లో స్వల్ప అనారోగ్యం. కుటుంబంలో కలహాలు. శ్రీరామధ్యానం మంచిది.

### మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఇంతకాలం పడిన కష్టం కొలిక్కి వస్తుంది. విలువైన వస్తువులు, భూములు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. కాంట్రాక్టర్లు అనుకున్న టెండర్లు దక్కించుకుంటారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలలో విజయం. ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుంది. 13,14 తేదీల్లో బంధువులతో తగాదాలు. కష్టానికి ఫలితం కనిపించదు. ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రం పఠించండి.

### కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

మీ కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది. నూతన వ్యక్తుల పరిచయం. సమాజంలో గౌరవమర్యాదలు పొందుతారు. విద్యార్థులకు అనుకూల ఫలితాలు ఉత్సాహాన్నిస్తాయి. వ్యాపారులకు మరింత లాభాలు. ఉద్యోగులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. క్రీడాకారులు, పరిశోధకులకు అనుకున్న అవకాశాలు దక్కుతాయి. 15,16 తేదీల్లో బంధువిరోధాలు. చోరభయం. లలితాదేవిస్తుతి మంచిది.

### మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

వ్యతిరేకులు కూడా అనుకూలురుగా మారి చేయూతనిస్తారు. కాంట్రాక్టర్లకు శుభవార్తలు అందుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారులు అనుకున్న లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. రాజకీయవేత్తలకు కొన్ని సమస్యల నుంచి విముక్తి. వైద్యులు, రచయితలకు ఊహించని ఆహ్వానాలు అందుతాయి. 11,12 తేదీలలో దూరప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. ధన్వంతరీ మంత్రం జపించండి.

# పదరసం - 504

## ఆధారాలు

**అడ్డం**

1) పలుచని, అంత గొప్పగా లేని (3)
2) త్యాగరాజు రచించిన ఒక యక్షగానం (6)
7) జంతువుల ఆహారం అటునుంచి వచ్చింది (2)
9) నమ్మకస్తులే తిరగబడ్డారు (4)
10) సాధారణంగా ప్రతికథకూ చివరన ఇది ఉంటుంది (2)
11) తాత్కాలికమైన బస (3)
14) చెప్పు (3)
15) భయంలాంటిది (3)
16) .... తప్పకుండా అంటే ఏ ఒక్కటీ వదలకుండా (2)
17) గోమాత అరుపు (2)
18) ఒక విధమైన కాల్చిన రొట్టె తిరగబడింది (3)
21) మోటు లాంటిదే (అటునుంచి) (3)
24) పరిజనం, బంధుసముదాయం (3)
26) ఊరకనే పేలువాడు (5)
27) హద్దు, పరిమాణం (4)

**నిలువు**

1) ..... పెద్దమ్మ కథలు చాలా ప్రముఖమైనవి (4)
2) వీధి నాటకాలలో మాట / పాట తరువాత తందానతాన మొదలైనవి అనడం (2)
4) కోరిన వస్తువులనిచ్చెడి ఆవు (5)
5) లక్ష్యం సరిగా లేదు (2)
6) ..... పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించడమని నానుడి (5)
8) మంచి (2)
12) నిస్పృహ, నిస్సహాయతతో ఉండడం (4)
13) ఎగతాళి, అపహాస్యం (4)
14) సరైన సమయం పైకొచ్చింది (3)
19) .....ఊరు దిబ్బ అని సామెత (పైకి) (4)
20) అమాయకురాలు (2)
22) సుమారు (4)
23) జుట్టు తక్కువ ఉన్న స్త్రీలు ధరించేది (3)
24) జీవితం (3)
25) పాము పైకొచ్చింది (3)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | 4 | | 5 | | 6 |
| | ■ | 7 | 8 | ■ | | ■ | | ■ | |
| | ■ | ■ | 9 | | | | ■ | 10 | |
| 11 | 12 | | ■ | ■ | | ■ | 13 | ■ | |
| ■ | | ■ | 14 | | | ■ | 15 | | |
| 16 | | ■ | | ■ | ■ | 17 | | ■ | ■ |
| ■ | 18 | 19 | | ■ | 20 | ■ | 21 | 22 | |
| 23 | ■ | | ■ | 24 | | 25 | ■ | | ■ |
| 26 | | | | | ■ | | ■ | | ■ |
| | ■ | | ■ | | ■ | 27 | | | |

**పదరసం - 503 సమాధానాలు**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| మ1 | హా | శి2 | వ | రా3 | త్రి | ■ | ■ | జా4 | ■ |
| చ్చ | ■ | శి | ■ | గ | ■ | ఐ5 | రా6 | వ | తం7 |
| తు8 | షా | రం | ■ | యా | ■ | ■ | లు | ■ | వం |
| న | ■ | ■ | అ9 | న | గ10 | న | గా | ■ | ల |
| క11 | ను12 | వి | ప్పు | ■ | గ | ■ | ఋ13 | కా14 | బ |
| ■ | ల | ■ | లే15 | ప | నం | ■ | ■ | ప | ■ |
| గ16 | క | మ | ని | ■ | ■ | పా17 | కు18 | లా | ట19 |
| డ | ■ | ■ | వా20 | ల | కం21 | ■ | లా | ■ | తే |
| స22 | రి | జో23 | డు | ■ | ట24 | లు | సా | కు25 | ■ |
| రి | ■ | లె | ■ | శ్ర26 | ద్ధ | ■ | ■ | క్క27 | చు |

సినిమా

కొత్త సంవత్సరంలో ఢిల్లీ శాసనసభ ఎన్నికలు, మహాకుంభమేళా, 'ఛావా' హిందీ చిత్రం కమ్యూనిస్టులకు చికాకు కలిగించాయి. ఈ మూడు చోట్ల కనిపించిన హైందవశక్తితో వారికి నిద్రపట్టడం లేదు. ఎన్నో రకాల కుయుక్తులతో వీటిని బలహీన పర్చాలని చూసినా, ఎదురుదెబ్బే తగిలింది. అఖండ విజయం సాధించిన 'ఛావా' హిందీ సినిమా వారికి కునుకు పట్టనీయడంలేదు. దాంతో తమ చెప్పుచేతల్లో ఉన్న మీడియా సంస్థల్లోనూ, సోషల్ మీడియాలోనూ మరింత రెచ్చిపోయి పిచ్చి రాతలు రాస్తూ సంతృప్తి పడే యత్నాలు చేస్తున్నారు.




# కమ్యూనిస్టుల కంటిలో నలుసు 'ఛావా'!

న్యూఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల్లో ఇండీ కూటమిలో లుకలుకలు బయటపడ్డాయి. కాంగ్రెస్, ఆప్, కమ్యూనిస్టులు ఎవరి కుంపటి వారు పెట్టుకున్నారు. కమ్యూనిస్టులంతా ఏకమైతే తిరుగే ఉండదనే భావనను గత కొంతకాలంగా చేశారు మార్క్సిస్టు మేధావులు. ఆ ప్రకారమే కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఎం), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఎం.ఎల్.) లిబరేషన్ మూడు కలిసికట్టుగా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేస్తే, 2,158 ఓట్లు వచ్చాయి. చిత్రం ఏమంటే... ఈ ఆరు చోట్ల కలిపి నోటాకు 5,627 ఓట్లు పడ్డాయి. ఆ ఆరు చోట్లా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి కనీసం వెయ్యి ఓట్లు తెచ్చుకోలేదు.

ఇక రెండవది కనీవినీ రీతిలో జరిగిన మహా కుంభమేళా. ఎప్పటిలానే కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు దీనిని ఎంతగా విమర్శించాలో అంతగా విమర్శించే పని పెట్టుకున్నాయి. మరీ ముఖ్యంగా అక్కడ వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభను గురించి ప్రస్తుతించడం ఇష్టంలేని వీరు, ఎక్కడ ఏ లోపం దొరుకుతుందా? ఎండగడదామా? అని తహతహలాడిపోయారు. చిన్న చిన్న సంఘటనలు మినహా మహా కుంభమేళా ప్రశాంతంగా జరగడంతో వారికి నిద్రపట్టలేదు. కొన్ని సందర్భాలలో యాత్రికులను తీవ్ర ఇబ్బందులు ఎదురైనా, భగవంతుని మీద భారం వేసి కోట్లాది మంది త్రివేణి సంగమం వైపు కదిలారు తప్పితే... ఎక్కడా ఆందోళనలకు దిగలేదు. తమ కోపాన్ని వేరే మతస్తుల మీద చూపలేదు. ఇది కూడా వారికి కంటగింపుగానే అనిపించింది.

కమ్యూనిస్టులను అసహనం పాలు చేసిన మూడో అంశం 'ఛావా' చిత్రం విజయం. ఫిబ్రవరి 14న విడుదలైన ఈ హిందీ సినిమాకు విశేష ఆదరణ లభించింది. పది పన్నెండు రోజుల్లోనే రూ.500 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. సరైన విజయాలు లేక బిక్కుబిక్కు మంటున్న హిందీ చిత్రసీమకు ఊపిరి పోసింది. దాంతో రాజకీయ, ఆధ్యాత్మిక రంగాలలోనే కాకుండా చిత్రసీమలోనూ హైందవానికి దన్నుగా నిలిచే చిత్రాలకు ఆదరణ లభించడాన్ని వామ పక్షీయులు తట్టుకోలేకుండా ఉన్నారు. గత కొంత కాలంగా ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను కీర్తిస్తున్నట్టే నటిస్తూ... హింద్ పద్ పాదషాహీ అయిన ఆయనకు కులం ముసుగు వేసే ప్రయత్నం చేశారు. శివాజీని కీర్తించే క్రమంలో 'శివాజీ గొప్ప వీరుడే కానీ ఆయన అందరికీ కోసం కృషి చేసిన వాడు. ముస్లింలకు వ్యతిరేకం కాదు' అని ఆయన్ని హిందువులకు దూరం చేసే కుట్రలకు తెరలేపారు. తమ పార్టీ కార్యాలయాల ముందు వినైల్ హోర్డింగ్స్ పెట్టారు. శివాజీ ఆకాంక్ష హిందూధర్మ పరిరక్షణ. అందుకోసం తన వెంట ఎవరు నడిచినా కలుపుకుంటూ వెళ్లారు తప్పితే... తన ధర్మానికి హాని జరుగుతుందని తెలిసినప్పుడు తరతమ భేదాలను చూపలేదు. అలాంటి ధర్మ పరిరక్షకుడికి కులాన్ని అంటగట్టడం అంటే... భారతరత్న అంబేద్కర్‌ను కులం చట్రంలో ఇరికించడం లాంటిది.


'శివాజీలా జీవించు.... శంభాజీలా మరణించు' అనే మాటకు అసలు సిసలు అర్థం ఏమిటనేది వెండితెరపై 'ఛావా' చిత్రం రూపంలో దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ చూపించారు. ప్రాణాలు పోయినా..పరమతాన్ని స్వీకరించనని వీరమరణం పొందిన శంభాజీ జీవిత గాథ నేటి తరానికి ఆదర్శం. ఈ సినిమా చూసిన చిన్నారుల నుండి యువకుల వరకూ 'ఈ చరిత్రను మాకు ఎవ్వరూ చెప్పలేదేమిటీ? మా పాఠ్య పుస్తకాలలో ఇలాంటి వీరుల గాథ లేదేమిటీ?' అని ప్రశ్నిస్తున్నారు. కొన్నేళ్లుగా మెకాలే మానసపుత్రులు రాసిన పాఠాలనే చదివిన వీరికి ఇప్పుడు జాతీయవీరుల గాథలను చదువుకోలేక పోయామే అనే బాధ కలుగుతోంది. ఇదే అంశాన్ని సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తున్నారు. హిందూ సమాజం నుండి వస్తున్న ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కమ్యూనిస్టులు సతమతమవుతున్నారు. వారి కనుసన్నలలో వెలువడిన చరిత్రను తప్పు పట్టడం, హిందూ ధర్మాన్ని కులం పేరుతో విచ్ఛిన్నం చేయాలన్న దురాలోచన నెరవేరకపోవడంతో వారికి ఎటూ పాలుపోవడం లేదు.

శంభాజీ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ, గతంలో కొందరు రాసిన వక్ర చరిత్రను నిస్సిగ్గుగా ప్రచారం చేస్తున్నారు. అయితే గతంలో మాదిరి కమ్యూనిస్టులు చెప్పినదంతా విశ్వసించే పరిస్థితుల్లో ఇవాళ సగటు హిందువు లేడు. అదీ వారికి తెలిసిపోయింది.

ఈ మధ్య కాలంలో కమ్యూనిస్టు మేధావులకు నిద్రలేకుండా చేసిన 'ఛావా' చిత్రం భారతదేశంలోని ఇతర భాషల్లోకి అనువాద మవుతోంది. అందులో భాగంగా మొదట తెలుగులో డబ్ చేశారు. మార్చి 7న ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అల్లు అరవింద్ కు చెందిన గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పంపిణీ చేస్తోంది. విశేషం ఏమంటే... ఈ సినిమా హిందీలో విడుదలైనప్పుడు అల్లు అరవింద్ చిన్నకొడుకు, నటుడు శిరీష్ 'మేం చదువుకున్న ఎన్.సి.ఇ.ఆర్.టి. టెక్స్ట్ పుస్తకాలలో భారతీయ రాజుల వీరగాథలను చెప్పకపోయినా... ఇలాంటి సినిమాల ద్వారా తెలుసుకోగలుగుతున్నాం' అని సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టాడు. 'ఛావా' సాధించిన విజయంతో రాబోయే రోజుల్లో మరింత మంది దర్శక నిర్మాతలు హిందూ యోధుల విజయగాథలను ఇలా సినిమాల ద్వారా సమాజానికి అందిస్తారేమో చూడాలి.

**అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# మహాకుంభమేళా చిత్రమాలిక




















From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 20



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు











వెల : ₹.300/- వెల : ₹.300/- వెల : ₹.100/- వెల : ₹.360/- వెల : ₹.200/-













వెల : ₹.499/- వెల : ₹.300/- వెల : ₹.120/- వెల : ₹.300/- వెల : ₹.250/-












వెల : ₹.350/- వెల: PB ₹.399/- వెల :₹.450/- వెల : ₹.549/- వెల : ₹.400/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687